
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక



4 అణాలు
17-3-54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



రైలుసిగ్నల్

—ఫొటో: బి. రంగనాథన్—మద్రాసు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 27
17.3-54

విజయ ఫాల్గున శుద్ధ త్రయోదశి బుధవారం



పరీక్షల రోజులు

ఫోటో : సి. ఎస్. పార్థసారథి (కడప)

విషయానుక్రమణిక

ముఖచిత్రం:— భరణీవారి
"చక్రపాణి"లో భానుమతి.


కాలక్షేపం

"కాననమున, రణమున, సలి,-
లానల, రిపుమధ్యమున,-మహోబ్ధి, నగాగ్ర
స్థానమున, మత్తు, నిద్రితు,
బూనికతో బూర్వపుణ్యములు రక్షిం
చున్."

తా॥ అడవిలోగాని, యుద్ధములోగాని, నీటిలోగాని, నిప్పులోగాని, శత్రువుల మధ్యమునగాని, మహాసముద్రములోగాని, కొండకొనను గాని, ఉన్నటువంటివానిని లేదా ఒళ్లు తెలియక మత్తుచెందినవానిని గాని, నిద్రలో ఉన్నవానిని గాని, వాని పూర్వపుణ్యములు రక్షించును.

అడవిలో స్థిరంగా నివాసం ఉంటున్నటువంటి అడవిజాతులవాళ్లు చాలామంది ఉన్నారు. కాని, వాళ్లు తాము అక్కడ కాపురం చేయడం తమ పూర్వజన్మ పుణ్యం వల్లనే యనెడి తలంపుతో "ధన్యోస్మి! ధన్యోస్మి!" అని స్మరించుకుంటూ ఉండరు. ప్రాణాపాయములు లేకుండానే కాంతార వాసం చేస్తూ ఉంటారు. కాని, వాళ్లను బస్తీప్రాంతాలకు తీసికొనివచ్చి కొన్నిదినములపాటు యిక్కడ వాళ్లకు వసతులను ఏర్పాటు చేసినట్లయితే, ఇక్కడ యీ బస్తీ ప్రాంతాలలోనే సుఖంగా ఉన్నదంటారు. పట్టడివికంటె పట్టణం బాగున్నదంటారు. అడవులలో తిరిగేవాళ్ళకు ఉన్న స్వేచ్ఛ నిజంగా యీ మహానగరంలో ఉండేవాళ్లకు ఉండదు. ఏదైనా చెట్లకాయలూ తిన్నాక కోసికొని యథేచ్ఛగా ఆరగించవలెనంటే, కారడవిలో దూరినట్లుగా ఊరిలో ఉన్న ఏ అపాయీ అంటుకుండా మిడితో టలో నూ అడుగిడకుండా అడుగు పెట్టడానికి వీలు లేదు - లఘుశంకకుపోవలెననిపించినప్పటికీ, తోచినచోట కూర్చుండుటకు వీలులేదు. పోలీసులు పట్టుకొని, న్యూసెన్సు కేసు పెట్టి, అధమం, అర్ధరూపాయ జరిమానా విధిస్తారు. రోడ్డు మధ్య నడువనే కూడదు. అడవిలో పెద్దపులులనైనా తప్పించుకోవచ్చుగాని, బస్తీలో బస్సులను తప్పించుకోవడం బ్రహ్మదేవునికైనను అసాధ్యమౌతుంటుంది. అడవిలో గోచీ పెట్టుకొని తిరిగినా విశేషమేమీ లేదు. బస్తీలో బట్టకట్టనివానిని పశువుగా చూస్తారు. హాట్, బూట్, సూట్ వేసినవాడు తన బూటుకాలి క్రిందనే ప్రపంచం ఉన్నదన్నంత టీక్ టాక్ షోక్‌తో నడుస్తాడు. అటువంటివాళ్ళకు భయపడి ఆటవికులు అటో యిటో ఎటో తప్పుకొని తిరగాలి. చెరువుకువెళ్ళి స్నానంచేసి మడినీళ్ళు తీసికొని నడిబజారులో పోతున్న విశ్వస్త్రయినా తనప్రక్కనుంచి వెళ్లేవారిమీద తన అహం అంతగా చూపించదు.

కొత్తగా మనదేశంలో విక్టోరియా రాణి ప్రభుత్వం వెలసినదినాలలో, సర్కారు ఉద్యోగాలు చేస్తున్న అధికారులు పట్టణ వీధులలో పోతూ ఉంటే, వారి అధికారం పగటి దివిటీలు వేసినట్లుగా వెలుగుతూ ఉండేది. వారి అధికారంలో కారం అధికంగా ఉండేదని చెప్పవచ్చు. మేజిస్ట్రేటుగారు కోర్టుకు వెళ్ళడం మధ్యాహ్నము ఒంటిగంటకు - ఆయన తిరిగి కోర్టునుంచి యింటికి వెళ్లడం రాత్రి 8 గంటలకు - మేజిస్ట్రేటుగారు వెనుక నడుస్తూ ఉంటే, ముందుగా బిళ్ళబంట్రోతులు ఇద్దరు నడుస్తూ ఉండేవారు. ఒకని చేతిలో కొవ్వొత్తి దీపానికి చిమ్నీ తగిలించిన స్ప్రింగులాంతరు ఉండేది. రెండవ బిళ్ళబంట్రోతు భుజంమీద మేజిస్ట్రేటుగారి కాగితాలు ఉన్నటువంటి సందుకా పెట్టె ఉండేది. ఈవిధంగా ఆయన రాత్రి 8 గంటలకు చీకట్లో పోతూ ఉంటే, ఆయనకు ఎదురుగా, ఎవరైనా ఎద్దుబండి తోలుకొని వస్తూ ఉంటే, పది పదిహేను గజాల దూరంలో ఆ మేజిస్ట్రేటుగారి బంట్రోతులను చూడగానే, బండిదిగి ఎద్దుతో సమానంగా నడుస్తూ బండిని తోలవలెను. అవిధంగా దిగి ఎంతదూరం ఎంతసేపు బండి తోలవలెనంటే, మేజిస్ట్రేటుగారిని దాటి వెళ్లేవరకు తోలవలెను. అటుపిమ్మట తిరిగి బండి ఎక్కి తోలవచ్చును. ఒకనాటి


నేడే చూడండి!
ఆంధ్రదేశ
ముఖ్యకేంద్రములలో
ప్రదర్శింపబడు చున్నది
వాహినీ
చిత్రము
పెద్దమనుషులు
మీరు మీవారందరూ తప్పక చూడవలసిన
చిత్రము
నిర్మాత-దర్శకుడు-
కే.వి.రెడ్డి. B.Sc. (HONS)
రచన.
డి.వి.నరస రాజు B.A.

రాత్రి ఒక ఒంటెద్దు బండీవాడు పొరబాటున బండి దిగలేదు. బండిలోనుంచి దిగినట్లయితే, వెనుక బరువు ఎక్కువై కాడి పైకి లేచిపోయేటట్లుగా ఉంది. అరధంలో వెనుక వైపున పెద్ద గుండిగవంటి ఒక గంగా భాగీరథీ సామానురాలైన పూర్వసువాసిని కూర్చుండుటచేతనూ, ముందుభాగంలో పనిబిడ్డ తల్లి కూర్చుండడంచేతను ఇరువైపుల బండికి సమతూకం ఉంటేనే నిమిత్తమై బండివాడు బండి దిగడం శ్రేయస్కరంకాదు. నిజమే. కాని, ఆ సమయంలో మేజస్ట్రేటుగారు ఆ బండికి ఎదురవడం కూడా శ్రేయస్కరంకాదు. బండివాడు పరాకు చిత్తగించడంకూడా సంభవించింది. వాడు అరదమునుండి దిగకుండుట పొగరుబోతు లక్షణమని యెంచి, వాని బండిని అక్కడ ఆపించి, మేజస్ట్రేటుగారి భటులు వానిని అడ్డదారిలోనే అడ్డమైన చివాట్లు పెట్టి, వాని పేరు, తావు టికాణా చెకప్ చేసి వ్రాసికొన్నారు. వానిని మరునాడు కోర్టుకు రప్పించి జరిమానా విధించారు. దండనాధుడు బండివానికి శిక్ష ఎందుకు విధించాడంటే బండివాడు క్రిందామీదా తెలియకుండా, కళ్ళుమూసికొని బండి తోలుచున్నందుకు శిక్ష విధించానన్నాడు. నిజంగా ఆ ఎద్దుబండిని హద్దుమీరిన వేగంగా వాడు తోలనేలేదు. వాడు రోడ్డు ఎడమప్రక్కగా బండిని తోలడం (అపసవ్యంగా తోలడం) రహదారీ రూల్సు ప్రకారం సవ్యమే గనుక వానికి శిక్షవిధించడం భావ్యంకాదు.

కాని, ఆ బండివాడు వెలిగించిన లాంతరు కేవలం గుడ్డిదీపంలాగున ఉంది. పొగ విపరీతంగా వచ్చి లాంతరు అద్దాలన్నీ మసితో ఆవరింపబడి అది బండికి దీపమా ధూపమా అన్న స్థితిలో అగమ్యగోచరంగా ఉంది. బండికి దీపం ఉన్నదా లేదా అనే విషయం గ్రహించడానికి వీలు లేకుండా గ్రహణం పట్టినట్లుంది. తత్వమసి మహా వాక్యభావమైనా తత్వవేత్తల జ్ఞాననేత్రములకు అంతు చిక్కుతుందిగాని యీ మసి దీపం మనుష్యమాత్రుని స్థూలదృష్టికీ, చర్మచక్షువులకూ అంతు చిక్కడంలేదు. దీపం అనేది అక్కడ ఉన్నదా? అభావమా?" అనే మీమాంస కొమ్ములు తిరిగిన పండితులకే జటిల క్లిష్ట కష్టసమస్య. బండిఎద్దు ఆ మీమాంస లేకుండానే నడుస్తోంది. దండనాధికారికూడా ఆవిషయం గమనించలేదు. బండికి గుడ్డిదీపం ఉంది. న్యాయపరిపాలన కూడా గుడ్డిగానే ఉంది. మేజస్ట్రేటుగారు వస్తూఉంటే బండిదిగకుండా బండిని తోలిన బండివానికి కళ్ళు నెత్తిమీదకు వచ్చినవని శిక్షించారు. కాని మేజస్ట్రేటుగారికి మేజస్ట్రేటు పదవి రాగానే ఆయనకుకూడా కళ్ళు నెత్తిమీదకు వచ్చినవనే విషయం మేజస్ట్రేటు గ్రహించలేదు. అధికారగర్వాంధకారంలో కళ్ళు మూసికొనిపోయి, జ్ఞానదీపం లేకుండానే తన న్యాయపరిపాలనారథమును నడిపిస్తూ ఉన్నాడు.

కాకినాడలో ఒకప్పుడు జిల్లా అధికారియైన తెల్లదొరగారు గుర్రపుబండీమీద పోతూ ఉంటే, ఒక పల్లెకాపువాడు కావడిబద్ద భుజమున పెట్టుకొని రోడ్డుమీద నడుస్తున్నాడు. జిల్లాఅధికారియైన తెల్లదొర గుర్రపుబండీమీద వేగంగా సవారీచేస్తున్నాడు. కాపు వానిని త్వరగా తన బండి త్రోవనుండి తప్పుకొని ప్రక్కగా పోవలెనని హెచ్చరిస్తూ కొంతసేపు గంట మ్రోగించాడు. ఆ కాపువానికి కొంచెం చెవుడుకూడా ఉన్నదని అనుమానించడానికి అవకాశం ఉంది. ఎట్లాగైతేనేమి కొంతసేపు గంట కొట్టగా కొట్టగా వాడు ప్రక్కకు తప్పుకొని నడవడం సాగించాడు. ఆగ్రహావేశుడైన ఆంగ్లేయుడు అగ్నివలె భగ్గుమని ఆ కాపువాని ప్రక్కనుంచి తన బండీ పోవుచున్న తరుణంలో తన కొరడాతీసి ఝళిపించి ఆ కాపువాని వీపునకు చుర్రుమనేటట్లుగా ఒక్క దెబ్బ వేశాడు. ఆ దెబ్బతో కాపువానికి ఒళ్లు మండిపోయింది. తోక తొక్కిన త్రాచువలె ఆ గుర్రపుబండీ వెంటబడి కావడిబద్దను తన శక్తికొలదీ ఆ దొరమీద విసరి విసరి కొట్టాడు. దొరగారికి బలేదెబ్బ తగిలింది. ఆస్పత్రిలో కొన్నాళ్లు మంచమెక్కి మంచి మార్గంలోకి ఆరోగ్యస్థితిలోకి క్రమేణ రాగలిగాడు. ఇదంతా వందేమాతరం రోజుల్లో జరిగిన విషయం. అనగా రమారమి 47 ఏళ్ళక్రింద జరిగినకథ.

అప్పటికీ యిప్పటికీ కాలం మారిపోయింది. కాని, నాగరికజాతి నగరాలలో యంత్రశకటాలమీద తిరుగుతూఉంటే మోటారుల ప్రక్కగా మోటుజాతి మనుష్యు

ప్రకృతి - ఓనమాలు

★

వసంతరావు రామకృష్ణరావు

నింగినీ - నీరదాలనీ - కలుషితంచేసిన
నిన్నటి నిశ్చల విభావరీ నిష్క్రమణతో
నేటి నిశాంత ప్రభాతం ప్రవేశించింది !
ఆద్యంతాలు లేని కాలస్వరూపంలో
అనంతమైన నిత్యతనుండి 'నేడు' వచ్చింది.
మళ్లీ—నిరాశావిభావరిహృదయంలో
ఈ 'నేడు' నిశ్చలంగా నిద్రపోతుంది !
ఆ అజ్ఞాతమైన పదార్థంలోనుండి
'రేపు' రెక్కలు ధరించి వస్తుంది !
ఉషస్సులోనుండి అపరాహ్ణం!
అపరాహ్ణంలోనుండి అంధకారం !!
మళ్ళీ—అపరంజి కిరణాల ప్రభాతం !
ప్రకృతి విశ్వవీధులలో నేర్పే ఓనమాలు
మానవుని అజ్ఞాన తిమిరానికి ఆనవాలు !

★ కాలక్షేపం ★

లను ఆటవికులు అడవిలో సుఖంగా బ్రతుక గలరా? లేక నగరాలలో సుఖంగా బ్రతుక గలరా? అనే విషయం చర్చించవలెనంటే, మొత్తంమీద మానవకోటి యీ నవనాగరిక యుగంలో ఎక్కువ సురక్షితంగా ఉన్నదా? ఆటవిక జీవితంలో సుఖంగా ఉన్నదా? అనే అగాధమైన ప్రశ్నలోకి దిగవలసి వస్తుంది. గతచిన మహాసంగ్రామంలో జపానుకు చెందిన హిరోషిమా అనే దీవిమీద అమెరికావారు ఒక్క ఆటంబాంబు వేస్తే ఒక్క దెబ్బను 70 వేలమంది మరణించారు. ఇంకొక 70 వేల మంది గాయపడ్డారు. లేదా కాళ్లు చేతులు విరిగి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుగా జీవచ్ఛవములవలె బ్రతికినారు. ఆటంబాంబులోనుంచి బహిర్గతమైన ప్రచండమైన అణుశక్తి ప్రభావమువల్ల వేలకొలది జనులు నిర్వీర్యులై క్షయవ్యాధివంటి వ్యాధుల పాలైనారు. 70 వేల మందికి ఒక్కక్షణంలో ఒక్కుమ్మడిగా మరణం, మరొక 70 వేల మందికి దుర్భరమైన ప్రాణావశిష్ట దేహధారణం సంప్రాప్తించింది. గతయుద్ధంలో అమెరికను విమాన దళంలోని 20 వ విమానదళం జపాను ముఖ్యనగరమైన టోకియోనగరంమీద అనేక బాంబరు విమానాలతో ఒక్కసారిగా బాంబులవర్షం కురిపిస్తే ఒక్కరాత్రిలో 83 వేల మంది మరణించారు. ఒక లక్షమంది ఆ ఒక్కరోజులో గాయపడ్డారు. అమెరికాలోని ఏల్సునగర విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్రవేత్తయైన కొరల్ డెవ్వార్ గారు ఒక రేడియో ఉపన్యాసంలో చెప్పియున్నారు. ఈసారి తిరిగి మహాసంగ్రామంవస్తే రణరంగాలలో ఉండే సైనికులకంటె మహానగరములలో నివసించెడి నగరవాసులకే మున్ముందుగా దెబ్బతగిలి జననష్టము ఎక్కువగా కలుగుతుంది. ఫ్యాక్టరీలు ఎక్కువగాఉండే ప్రదేశాలమీదనే శత్రువిమానములు మున్ముందుగా బాంబులు వేసి ఆ ఫ్యాక్టరీలను ధ్వంసం చేస్తాయి. ఆహారపదార్థాల ఫ్యాక్టరీలను, ఆయుధాల ఫ్యాక్టరీలను ధ్వంసం చేస్తాయి. అందువల్ల నగరాలకున్నూ నగరవాసులకున్నూ బాంబుల వర్షాలవల్ల మున్ముందుగా ముప్పు తప్పదు. ఆటంబాంబు ఒకటికి 70 వేల మంది చొప్పున ఒక్కసారిగా నాశనమైపోతారు. సాధారణ బాంబుల వర్షమైనప్పటికీ, తీవ్రంగానే ఉంటుంది. నగర పౌర జననాశనం సగటు సుమారున అంతే దారుణంగా ఉండగలదు అని కొరల్ డెవ్వార్ పండితుడు అన్నాడు. ఇటువంటి నవనాగరిక దారుణ మారణాస్త్ర ప్రయోగ ప్రచండ సంగ్రామ యుగంలో, నగరములలో ఉండే వాళ్ళకన్నా అడవులలో ఉండేవాళ్ళే ఎక్కువ సురక్షితంగా ఉండగలరని సిద్ధాంతీకరించవలసి ఉంటుంది.

ఈవిధంగా యోచించి చూస్తే నిజంగా నగరములలో ఉండేవారి బ్రతుకు గాలిలో పెట్టిన దీపంవంటిదనిన్నీ, అడవులలో ఉండే వారి బ్రతుకు భద్రమైనదనిన్నీ నిర్ణయించవలసి వస్తుంది. నవనాగరిక యుగం అంటే ఇదే. ఆటంబాంబుల యుగంలోకి మన నాగరికత విస్తరించింది. విద్యుచ్ఛక్తి యుగంకూడా పాతకాలప్రసక్తియై దానిమీద అనురక్తి వెనుకబడింది. విద్యుచ్ఛక్తికంటె అణుశక్తి (ఆటమిక్ శక్తి) అనేకరెట్లు ఎక్కువైంది. ఆటమిక్ శక్తితో నావలను నడిపించవచ్చు. ఆటమిక్ జలాంతర్గాములను అమెరికావారు నిర్మిస్తున్నారు. ఆటమిక్ శక్తితో విమానాలు నడుపవచ్చు. ఆటమిక్ శక్తితో రైళ్ళు నడుపవచ్చు - ఆటమిక్ శక్తితో మోటార్లు కూడా నడుపవచ్చు. స్వయంచలన శక్తిగల మోటారుకార్లు మొదలైనవాటిని "ఆటోమొబైల్సు" అని పిలుస్తారు. మోటారు రిక్షాలను "ఆటోరిక్షా" లంటారు. ఆటోరిక్షాకు మించిన ఆటమిక్ రిక్షాకూడా అమలులోకి రావచ్చు - ఆటోమొబైల్సు శకటాలు పోయి ఆటమ్ మొబైల్సు శకటాలు వస్తాయి. ఆటంశక్తితో బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలను నడిపించవచ్చు. అందువల్ల త్వరలోనే అఖిలప్రపంచం అణుశక్తిమయం అవుతుంది. ఇప్పుడు మనం ఆటమిక్ యుగంలో ఉన్నాము.

మానవుడు ఒకప్పుడు అనాగరికుడై అడవులలో నివసిస్తూ ఉండేవాడు. అడవులలో ఉండేవారిని రక్షించేవారెవరు? వారి పూర్వజన్మపుణ్యమే వారిని అడవులలోని ఆపదలనుండి రక్షించగలదని మనసిద్ధాంతం. అయితే నగరములలో ఉండేవాళ్ళను మాత్రము వాళ్ళ పూర్వజన్మపుణ్యము రక్షించదా? అనే సంశయం నిస్సంశయంగా కలుగుతుంది. మానవుడు ఆటవికుడై ఉన్నప్పుడు ఎక్కువ జనసంహారం సంభవించినదా? ఆటమిక యుగంలో ఎక్కువ జనసంహారం సంభవిస్తుందా? అనే ప్రశ్నకు సరియైన లెక్కలుకట్టి ఆటవికయుగం ఎక్కువ శ్రేయస్కరమైనదో, ఆటమిక యుగం ఎక్కువ క్షేమకరమైనదో ధీమంతులు నిర్ణయించాలి.

కాని, మన పూర్వులకు ఒక నమ్మకం ఉంది. ఎక్కడ పాపం ఎక్కువగా ఉంటుందో అక్కడే మహోత్పాతాలు సంభవిస్తూఉంటాయి అని వారిఅభిప్రాయం. ఇదివరకు బీహారురాష్ట్రంలో ఒక బ్రహ్మాండమైన భూకంపం సంభవించింది. అప్పుడు గాంధిమహాత్ముడు ఒకమాట అన్నాడు. అస్పృశ్యులనేవారిని కొందరిని అగ్రజాతులవారు చాలా హేయంగా అడవిమనుష్యులకంటె, అడవి మృగాలకంటె హీనంగా పరిగణించి బహిష్కరిస్తూ ఉండడంవల్లనే, ఆ మహాపాతక దోష ఫలితంగా యిటువంటి ఘోర భూకంపం సంభవించిందన్నాడు. మహాత్ముని మాటలను రవీంద్రనాథ టాగూరుగారు ఆక్షేపించారు. అస్పృశ్యత అనే పాతకం బీహారులో మాత్రమే ఉన్నదా? ఇతర ప్రాంతాలలో యీ పాతకం లేదా? అట్టి సందర్భంలో బీహారు రాష్ట్రంలోని ప్రజలకు మాత్రమే యీ ఘోర విపత్తు ఎందుకు సంభవించాలి? అని ప్రశ్నించారు. కాని, అన్ని ప్రాంతాల వారినీ భగవంతుడు ఒకే విధంగా శిక్షిస్తే ఒకే శిలాశాసనం ఎక్కడ ఉంటుంది. బెంగాలులో మహాక్షామం రావచ్చు. పంజాబులో మతకలహములు రావచ్చు. ఆంధ్రలో వరదలు రావచ్చు. అయితే, అస్పృశ్యత యనెడి మహాపాతకం ఒక్కటే మన దురవస్థలకు కారణభూతమా? అని ప్రశ్నించవచ్చు. అస్పృశ్యులనే వారిని అనేకులు అగ్రజన్ములతో సమానంగా ఆధ్యాత్మిక మహోత్సవములకు అనర్హులుగా ఎంచలేదా? అంటున్నారు. వాళ్లు దండనార్హులని లోకం ఏకరువు పెట్టే వారి దురవస్థలకు వారి పూర్వజన్మపాతకమే కారణమని నిరూపించింది. కాని, అగ్రజన్ములయినవాళ్ళు పూర్వజన్మంలో పుణ్యం చేసుకున్నారనిన్నీ, అందువల్లనే అగ్రజన్ములై అవతరించారనిన్నీ చెప్పబడింది. అటువంటి శ్రీమంతులు, గుణవంతులు, బుద్ధిమంతులు, సుగుణవంతులు, కులవంతులు, పుణ్యవంతులు అని చెప్పబడేవాళ్ళు కూడా ఇటువంటి గుప్తపాపాల దుర్భరణముల పాలైపోవుటకు కారణమేమిటి? అనేది అనల్పమైన ధర్మసందేహం. కనుక, పూర్వకర్మ ఫలితం అందుకు కారణమని గాంధి మహాత్ముడు ఊహించడం గూర్చి "ఇదేమిటి!" అనడానికి అవకాశం లేదు. అస్పృశ్యత హరించిపోవాలనే సంకల్పంతో అస్పృశ్యులను ఆయన హరిజను లన్నారు. హరిజనోద్ధరణకోసం ఆయనతో పాటు ఠక్కర్ బాబా గారు ఆయనజీవితం అంతా ధారపోసి కృషి చేశారు. అడవులలో సర్కారు ప్రాంతాలలో ఉండే గిరిజనులుకూడా ఎక్కువ ముఖ్యులేని దీనావస్థలో ఉన్నారని ఠక్కర్ బాబా యెంచి వారి పరిస్థితి లను దర్శించవలసిన లేకుండా వారికి బాధపడే మార్గం చూపించి వారిని తరింపజేయుటలో కృషి చేసినారు.

త్వరలో కొత్త సీరియల్

“మంచీ - చెడూ”

రచన: శ్రీ “శారద”

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు త్వరలోనే ఒక కొత్త సీరియల్ నవలను అందించగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము.

ఆర్థిక స్తోమతు లోపమైనప్పుడు సమాజంలో జీవనం ఎంత యాతనామయమౌతుందో, ముఖ్యంగా స్త్రీలకు అట్టి పరిస్థితులలో ఎంతటి ఘోరపతనం సంభవిస్తుందో ఈ చిన్న నవల యథాతథంగా చిత్రిస్తుంది. అయితే అమానుషమైన ఈ దుఃఖాంధకారంలో సహజ మానవ సౌశీల్యం, ప్రేమార్ద్రతలు వెలుగుదారులు చూపగలవు. నేటి సామాజిక జీవనాన్ని వాస్తవికంగా చిత్రించడానికి రచయిత శ్రీ ‘శారద’గారు చేసిన కృషి పాఠకులలో ఔత్సుక్యం రేకెత్తించగలదని ఆశిస్తున్నాము - సంపాదకుడు.

ఏమైనప్పటికీ ఘోరవిషాద విలయములు సంభవించినప్పుడైనా మనుష్యులకు అట్టి విలయకారణ కర్మదోష మేదో ఒకటి ఉండ వలెననే ఆత్మవిచారణ కలుగుట మహాత్ముల లక్షణం.

గడచిన మహాసంగ్రామ దినములలో జపానువాళ్లు మద్రాసు మొదలైన కోస్తా నగరములమీద బాంబులు వేస్తారనే భయం ప్రారంభం కాగానే కోస్తా ప్రాంతనగరములను ఖాళీచేసి జనులు తండోపతండములుగా కోస్తాకు దూరంగావున్న స్వగ్రామాలకు వెళ్ళిపోయినారు. మద్రాసు నగరంలో ఉద్యోగిగా ఒక తమిళసోదరుడు అప్పుడు కాపురం ఉంటూండేవాడు. ఆయనతోబాటు ఆయన తల్లికూడా మద్రాసులో ఉంటూఉండేది. అది 1942 సం॥-మద్రాసునగరంమీద జపానువాళ్ళు బాంబులు వేస్తారనే భయం ప్రబలమైంది. అరవంలో “ప” అనే ఉచ్చారణకూ “బ” అనే ఉచ్చారణకూ ఒక్కటేఅక్షరం ఉంటుంది. అందువల్ల “పాంబు” అని వ్రాసినప్పటికీ “బాంబు” అని నోటితో పలుకగలరు. కాని “పాంబు” అనేమాటకు అరవంలో పాము అని అర్థం “బాంబు” అనేది యుద్ధంలో ప్రయోగించెడి ప్రేలుడు అగ్నిగోళం. కాని, అరవభాష ఉచ్చారణలోనూ, వ్రాతలోనూ “బాంబు” అంటే ప్రేలుడు అగ్నిగోళం కావచ్చు. “పాంబు” అనగా పాము కావచ్చు. మద్రాసులో ఉన్న తమిళసోదరుని స్వగ్రామం ఇంకా దక్షిణంగాఉన్న తిరునల్వేలి జిల్లాలో ఉంది. ఆయన చిన్నతమ్ముడు ఆ స్వగ్రామంలోనే ఉన్నాడు. తల్లికి యీ చివరి కుమారుని మీద ఎక్కువ మక్కువ ఉండేది. అందువల్ల ఒకనాటిరాత్రి మద్రాసులోఉన్న పెద్దకుమారునితో స్పష్టంగా చెప్పింది. “ఇక్కడ బాంబులు పడితే, మనకెవ్వరు దిక్కు? నేను ఇక్కడ చచ్చిపోతే నా కోసం నా చిన్నకొడుకు దిక్కులేని పక్షి అవుతాడు. నాకు రాత్రిఅంతా వాడే కలలో కన్పించాడు. నేనిక్కడ జపాను వాళ్ల బాంబుల మూలంగా ప్రాణాలు విడుస్తే నామీద పంచప్రాణాలు పెట్టుకొన్న నా చిన్నకొడుకు ప్రాణాలు తల్లడిల్లిపోతాయి. వాని విషయమై నేనిక్కడ దిగులుపడుతూ ఉండలేను” అని ఆ తమిళసోదరుని తల్లి స్పష్టంగా చెప్పింది. ఆమె మాటలను త్రోసివేయలేక ఆ ఉద్యోగి తన తల్లిని రైలు ఎక్కించి తిరునల్వేలి జిల్లాలోని స్వగ్రామానికి పంపించివేశాడు. ఆమె అక్కడ సురక్షితంగా చేరినట్లు ఉత్తరం వచ్చింది. కాని ఆ మరుసటి వారంలోనే మరొక ఉత్తరం వచ్చింది ఆమె బయటకుపొలంలోకి వెళ్ళి చీకట్లో వస్తూఉండగా పాముకరచి ఆనాటిరాత్రియే స్వర్గస్థురాలైందని స్వదస్తూరీతో తమ్ముడువ్రాసిన ఉత్తరం మద్రాసులో ఉన్న అన్నగారికి చేరింది. ఆ ఉత్తరం చూచుకొన్న తమిళసోదరుని హృదయం తపించిపోయింది. ఆమె మద్రాసులో బాంబువల్ల మరణించకుండా రక్షించిన దేవుడు తిరునల్వేలిపాంబువల్ల మరణించకుండా చేయలేక పోయినాడు. ఈ బాంబు అయితేనేం? ఆ బాంబు అయితేనేం? బాంబుఅయినా పాంబు అయినా ఒక్కటే అని తలపోసి విలపించాడు.

ఆటవికజీవితంలోనైనా, నేటి ఆటవిక యుగజీవితంలోనైనా “ప్రానికతో పూర్వపుణ్యములు రక్షించున్” అనేమాట క్షరం కాదు-అది శిలాక్షరం - అంతేకాదు - అది శివాక్షరం. శివునిఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనేమాట బుట్ట దాఖలు చేయడానికి వీలులేదు. ★

పరీక్ష

“రమా! ఓ రమా!”

బద్ధకంగా వత్తిగిల్లి లేవకుండానే పిలిచాడు ప్రకాశం. చిన్నమబ్బు పట్టి ఉదయం అంతా, నిద్రలేస్తోన్న అందమైన అమ్మాయిలాగ మత్తుగా ఉంది ..పరీక్షలూ, పుస్తకాలూ అన్నీ ఎంతో అర్థరహితాలుగా అనిపించాయి...మంచం వొదలాలని అనిపించలేదు.

పెరట్లో పని చేసుకుంటూన్న రమ చేతులు కడుగుకుని వొస్తూ, “అరే! తెలివి వొచ్చిందే! టైము కేవలం ఏడూ నలభై మాత్రం అయింది!” అన్నది.

“మంచిపని చేసిందిలే! — కాని, టూత్ బ్రష్ ఇస్తే...”

కొంచెం సిగ్గుపడుతూ అని, ఆగిపోయాడు ప్రకాశం.

“అలారం కొట్టిందా?”

దూరంగా నిలబడి అడిగింది రమ.

ఇంక లాభం లేదని మంచంమీద లేచి కూర్చుని, “కొడితే ఎందుకు లేవనూ!... దానిమీద ఆధారపడి నిద్రపోతే, కాలం అంతా వృధా చేసింది!” అన్నాడు ప్రకాశం తానూ సీరియస్ పోజు పెట్టి.

“దాన్నెందుకు తిడతారూ?.. అలారం వినిపించినా మెలకుండా పడుకుని...”

కొంచెం కోపంగానే అంది రమ.

“అరే! అలారం కొట్టిందా?...”

నిజంగా కొట్టనట్లు అడిగాడు ప్రకాశం.

“ఓ! పిచ్చెక్కిన భావకవిలాగ అల్లరి చేస్తోంటే, నేనే దానికి నోరుమూశాను... అదుగో...మీ తిక్కనని మూతి వేసి...”

ప్రయత్నించినా రమ గంభీరంగా వుండలేకపోయింది — అతని బాధ చూసి... చిన్నగా నవ్వుతూ...

“థాంక్యూ రమా! యు వార్ మోస్ట్ బ్యూటిఫుల్ ......అక్షరాలా పెద్దనగారి నిర్వచనానికి సరిపోయే పతివ్రతవి...”

కొంచెం తేలికపడి అన్నాడు ప్రకాశం.

“హుం...థాంక్స్ కూడానూ!...ఒట్టి బద్ధకం మనిషి అయిపోతూ ... కొంచెం విసురుగా దుప్పటి మడత పెడుతూ అంది రమ.

“వేకువజామున లేవలేవను నీ కోప కిరణమ్ములను నాపై ప్రసరింపజేసి నాలోని బద్ధక తమస్సులను చీల్చి చెండాడు నో యర్థాంగీ! టూత్ బ్రషున్ గొనిరమ్ము...”

నాటకంలోలా అని, నవ్వుకోసం ఎదురు చూశాడు ప్రకాశం

“ఇంకేం! కొంచెం కొంచెం ఒంటబడుతూంది!...మరికొంచెం చదివితే పార్టు టూ ఈసారి సులువుగా పేసవొచ్చును.” అంది రమ - నవ్వకుండా.

“కానిమ్ము - అట్లే అగుగాక...” అని లేచి బ్రష్ తీసుకుంటూ,

ఇవ్వాప్రప్ర జగన్నాధరావు

“అయితే, టిఫన్ ఏమన్నా ఉందా?” అన్నాడు ప్రకాశం

“వాడు లేచాడా రమా?” అంటూ అవతలినించి రంగారావు కేక వేశాడు...” అం ...లేచారు ..” అని సమాధానం చెప్పి, “తొరగా ముఖం కడుక్కుని టేబిల్ దగ్గర పుస్తకంతో కూర్చోకపోతే, టిఫిన్ వొచ్చేస్తుంది” అన్నది రమ.

“కూర్చుంటే...”

“కాఫీ వొచ్చేస్తుంది”

“వెరిగుడ్ ...తినాన్డి టైల్ టేబిల్ మీద పడేసి, తొరగా కాఫీ పట్టుకురా” అని ప్రకాశం బయటికి నడిచాడు. టేబిల్ సర్ది రమ కాఫీ తేవడానికి వెళ్ళింది

*　　*　　*

కూర తరుగుతూన్న రమ అన్నీ ఆలోచించి, “పాడు పరీక్షలు - మనుషుల్ని చంపేస్తాయి...పోనీ మొదటిసారి పేస్ అయినా చేసేరు ..” అనుకున్నది.

ప్రకాశం మొదటిసారి పేసయితే ఆమె అలాగ అనుకోకపోను . కాని, అతని పార్టు టూ ఉండిపోయి ఇలా ఇలా...,

“ఇలా చిక్కుతే చేరపోతే ఎంత బాగుండును!” అనుకుంది రమ - మరికొంచెం ఆలోచించి...

“రమా!”

పిలిచాడు ప్రకాశం...గదిలో నించి. గంటనించి చదివితే కొంచెం శ్రద్ధ వొచ్చిందనుకున్న రమ మళ్ళా అనుమానంలో పడ్డది.

“ఎందుకు?”

అక్కడినించే కేక వేసింది - కూర ముక్కలు గిన్నెలో పడవేసి చేతులు కడుగుకుంటూ.

“పనిఉంది...ఓసారి...”

“కూర తరుగుతున్నాను - తరవాత వొస్తాను” అంది రమ—

“కాదు రమా!...అర్జంటు...”

ఇంక లాభం లేదని వెళ్ళి గుమ్మందగ్గర నిలబడి, “అబ్బబ్బ... చంపుతారు కదా! ఎందుకూ?” అన్నది రమ

పుస్తకం దూరంగా విసిరి కుర్చీలో జేరబడి, “నీకోసం వొస్తే చూడాలనిపించింది ..బ్యూటిఫుల్!” అన్నాడు ప్రకాశం.

“బొత్తిగా చిలిపి...” నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టి అన్నది రమ.

“అమ్మాయిలిలాగే..అబ్బాయిలని పాడు చేస్తారు...”

“చదువుకోకుండాను—కదూ?”

“ఊఁ...”

“ఇంక చాలుగా నీపుస్తకంలో ఏముందో చూపండి...మామగారు వొచ్చే వేళ అయింది” అన్నది రమ.

“ఏం చదివేది రమా!...ఎక్కడికెళ్ళినా ఒకటే గొడవ...” బాధగా అన్నాడు ప్రకాశం.

“ఏమిటది?”

“ఏమిటేమిటి?...ఈ పద్యం విను... దుష్యంతుడు శకుంతలని చూడగానే అంటాడూ...”

పద్యం రాగయుక్తంగా పాడి ఊరుకుని, చిలిపిగా రమ కళ్ళల్లోకి చూశాడు ప్రకాశం.

“అయితే ఏం?” అంది రమ, పొడిగా.

“ఏం ప్రశ్న వేశావ్ రమా!...ఆ శకుంతల నా మనోవీథిలో సాక్షాత్కరించి నిన్నొక్కసారి చూడమని ఆజ్ఞాపించింది— పిలిచేశాను...” గొప్పపని చేసినట్లు అన్నాడు ప్రకాశం.

“గొప్పపని చేశారు—అది సరేగాని, పుస్తకం తియ్యగానే మీ కళ్ళు సౌందర్య వర్ణనమీద పడతాయేం?” అన్నది రమ.

“ప్రపంచం అంతా దానితో నిండి ఉంది కాబోలు...అది పుస్తకం రాసినవాడి తప్పూ కాదు...”

“సరే...ఇంక చదువుకోండి...వెళ్తాను” వెనుదిరుగబోయింది రమ.

"వెళ్ళిపోతావా రమా?...కొంచెంసేపు..." దీనంగా అన్నాడు ప్రకాశం.

"అబ్బా! ... ఏమిటా దైన్యం?... సెప్టెంబరు వెళ్ళేదాకా కొంచెం బుద్ధిగా ఉండకపోతే ఇంటికి వెళ్తాను -" అన్నది రమ - మంచంమీద కూర్చుంటూ.

"ఫరవాలేదులే...మామగారు మహా మంచివాడు—సవాల్ గుమ్మం తొక్కకుండా చేసి ఉంచాడు...*I Thank him*" అన్నాడు ప్రకాశం.

"వొచ్చిన చికాకే అది -" అన్నది రమ తల వొంచుకుని.

"లేకపోతే వెళ్ళిపోదువా రమా?"

బాధగా అడిగిన ఆ ప్రశ్న విని అలాగే తలవొంచుకుని కూర్చుంది రమ - లేకపోతే ...లేకపోతే...

"చదువుకోండి -"

త్వరగా లేచి బయటికి నడిచింది రమ. తెల్లబోయాడు ప్రకాశం.

* * *

వెన్నెల నిండుగా కాస్తోంది...ప్రశాంతం చేస్తోన్న పరిసరాలని మరీ అందంగా చేస్తూ... పదకొండో, మరి కొంతో అయి ఉంటుంది. ప్రకాశం ఆకాశంవైపే చూస్తూ మంచంమీద పడుకున్నాడు.

పగలంతా వేడిగా ఉంది; అప్పటికి కొంచెం చల్లబడింది.

రమ రాలేదు.

ఏచడి అయినా ఆ మేనని చూసి ఆశ అంతా ఖర్చు చేసుకుంటున్నాడు ప్రకాశం. ఏకాంతం: మలయమారుతం; వెన్నెల... ఒక్కటే తక్కువ - రమ...రాలేదు. అంతా లోపమే...

చదువు - చదూ ... చదవండి ... చదివోయ్...

అందరూ అదేమాట ... అమ్మ అలా అంటుంది...నాన్న సంగతి చెప్పనక్కర్లేదు- ఆయనకి తనమీద ఫీకదాకా కోపం వుంది. స్నేహితులూ అదే సలహా...చివరకి రమా... చదవండి. చదువుకోండి...

పాడు చదువు - అనుకున్నాడు ప్రకాశం. తను బి. ఏ పూర్తిచేసి ఏం చెయ్యాలీ - వ్యవసాయం తప్ప? నాన్నకి పెద్ద ఉద్దేశం తాను గ్రాడ్యువేటు కావాలని...తాను రెండు పార్టులు పేసయ్యాడు ... ఒక్క పార్టు - టూ - ఉండిపోయింది...

పాడు చదువు - పాడు పుస్తకాలు... అనుకున్నాడు ప్రకాశం. పదకొండు తరవాతా చదవాలనా వీళ్ళనుకు నేది?

కళ్లు మూసుకున్నాడు ... భారతం ... శ్రీనాథుడు...శకుంతల...దుష్యంతుడు... '*Eminent Scholar*' రాసిన నోట్సు... పరీక్షలు...పరీక్ష..

లేచి తొందరగా పచారు చేశాడు... దూరంగా ఏడుస్తోన్న దీపం ఆర్పి వొచ్చి పడుకున్నాడు -

కొద్ది క్షణాలలో రమ వొచ్చి టేబిల్ మీది పుస్తకాలు సర్దిపెట్టి వొచ్చి పడుకున్నది.

"రావను కున్నాను..." అన్నాడు ప్రకాశం.

తెల్లబోయి - "నిద్రపోలేదూ?" అన్నది రమ.

"నిద్దరాలేదు".

రమ జవాబివ్వలేదు...కొద్ది నిముషాలు ఊరుకుని, "చదవకుండా కాలక్షేపం చేశారు ఎందుకని?" అన్నది.

"ఎవరు చెప్పారు?"

"—మామగారు వొచ్చి చూసి వెళ్లేరు.."

ప్రకాశం తెల్లబోయాడు.

"నిజంగా?"

"అక్షులారాను"

పొడిగా అన్నది రమ.

ఆలోచనలో పడినట్లు మంచంమీద జేరబడి, "అయితే గూఢచారులని వెయ్యడం కూడా అయిందన్నమాట!" అన్నాడు ప్రకాశం.

"ఆయన ననేదేమిటి?" అంది రమ - నిర్లిప్తంగా.

"మరి-నాదే తప్పు...అంటావు కదూ?"

కొంచెం ఊరుకుని,..." అలా అంటే మీకు కోపం వొస్తుంది కాదూ?" అంది రమ.

"వొస్తే వొచ్చిందిలే - నీ ఉద్దేశమూ తెలుసుకోనీ" అన్నాడు ప్రకాశం.

"నిజంమీద కోపగిస్తే ఏముందీ?"

"ఆ నిజం అందరూ చూపడం వేరులే..."

"నేనూ అంతే..."

"నువ్వు అనవని నా ఉద్దేశం..."

"మీ కంతా తెల్సును...ఒక్క నెల జాగ్రత్తగా చదివితే మామగారి కోరికా తీరుతుంది...మీ చదువు పాడు చేశాననే నిందా నాకురాదు...ఎవరిమీదా కోపం తెచ్చుకోవడం ఎందుకు?"

మెల్లిగా, నెమ్మదిగా అన్నది రమ.

"నేను చెప్పేది నమ్ముతావా?" అన్నాడు దృఢంగా ప్రకాశం.

"ఏమని?"

"ఈసారి ప్రయత్నించినా ఫెయిలవనని..."

"నేను తప్పకుండా నమ్ముతాను..."

"మరైతే, రేపటినించి మళ్ళా మామూలుగా రొటీన్—అలారం లేదు...'చ-దు-వు' అనే మాటలేదు...పిలిస్తే పని ఉందనడం లేదు...ఏం?"

రమ దూరంగా చూస్తూ, "మీ మీద నేను ఏమీ బెంగపెట్టుకోలేదు...కాని, ఈ నియమాలు మాత్రం తప్పవు..." అన్నది.

"ఎందుకని?"

"మీకు తెల్సు..."

"అవును—నువ్వు నన్ను నమ్మలేవు."

ఆ స్వరంలోని కటుత్వానికి త్రుళ్ళిపడింది రమ.

"కాదండీ...కొంచెం ఆలోచిస్తే మీకే తెలుస్తుంది..." అన్నది త్వరగా.

"ఆలోచించకుండానే తెలుస్తూంది ... నాన్నకీ అమ్మకీ నువ్వంటే ప్రాణం... నువ్వు అవునంటే కాదనలేరు. నా పరీక్ష కోసం నీదే బెంగ. పోనీ - అబద్ధం కూడా ఎందుకు?" అన్నాడు ప్రకాశం.

రమ ఏమీ మాట్లాడకుండా తారకలని లెక్కపెడుతోన్నట్లు ఆకాశంవైపు చూడసాగింది.

"నేను నమ్ముతుంటే మాత్రం నిన్నే... నా మనస్సు నువ్వైనా అర్థం చేసుకుని వుంటావనుకున్నాను...వీళ్ళందరూ నన్ను కాకుల్లాగ పొడుస్తున్నా నువ్వు కొంచెం గ్రహించి, అధమం నన్ను వాళ్లందరిలాగే బాధించకుండా కొంత ఉపశమనం ఇస్తావనుకున్నాను..."

"నేననేది—"

"ఏమీ అనవద్దులే...పడుకో—"

మాటలాడకుండా ముఖం దాచుకున్నాడు ప్రకాశం.

* * *

"నీ కొంచెం చెప్పాలనుకుంటున్నా నమ్మాయ్."

రంగారావు కాలుస్తోన్న చుట్ట పారేసి నిలబడ్డాడు. రమ తలవంచుకుని నిలబడింది.

"వాడి పరీక్ష లెప్పుడో తెలుసా?"

"ఆఁ..."

"ఇంక నెల ఉంది..."

"అవును"

★ పరీక్ష ★

"ఈమాత్రైనా వాడు పేసయితే కొంచెం బాగుంటుందికదూ?"

"అవును..."

"అలా అనుకుంటే - నువ్వు కొంచెం దూరంగా ఉండాలి వాడికి..."

ఒకసారి తలఎత్తి చూసి తిరిగి కళ్లు దించుకున్నది రమ.

"ఆ...అదే చెప్దామని...నీ కఠినూనం ఉంటే చాలా ఉండొచ్చును కాని, ఇంత హద్రి ఉంటే మంచిది కాదని..."

రమ మాటలాడలేదు.

"ఒకటి రెండుసార్లు చెప్పేను - కాని నీకు రుచించినట్లు కనిపించలా...అందుకనే...అయినా, ఒకటి మరిచిపోకు—నీ స్థితి..."

ఆయన బయటికి నడిచాడు — రమ తల వొంచుకునే వంటఇంటివైపు నడిచింది. తానేం చెయ్యాలి?—ఇంకా ఏం చెయ్యాలి?

మామగారు అలాగ...ఆయన ఇలాగ...

"ఎందుకూ అట్లా ఉన్నావ్?"

"ఏమీలేదు...

అత్తాకోడలూ ఎవరిపనుల్లో వారు నిమగ్నులయారు.

"ఆయన ఏమైనా అన్నారా?"

ఉండలేనట్లు అడిగింది అత్తయ్య.

"ఏమీ లేదు..."

"నాకు తెల్సులే ..అయినా, కొంచెం ఎడంగా ఉండమనేగా! చివరికి మీ మంచికే!...దానికికోపం తెచ్చుకుంటే ఎలా?"

"కోపం లేదు..."

"పోనీ. బాధే అను. ఉన్నమాట అంటే కోపించటం కన్నా, బాధపడడం కన్నా, సరిదిద్దుకోవడం మంచిదికాదూ?"

"అవును..."

అవును—సరిదిద్దుకోవాలి ... తాను సరిదిద్దుకుంటుంది—ఇంక.

సాయంత్రం అయేదాకా రమని ప్రకాశం పలువనూలేదు—ఆమె అతనికి కనపడనూ లేదు. సాయంత్రం తలనొప్పిగా ఉందని రమ పడుకున్నది. ఒళ్లు చూసి చాలా జ్వరం ఉందని చెప్పింది అత్తయ్య.

తలఅంతా చికాకుగా ఉన్నది...నిద్ర పట్టలేదు రమకి. ఏవేవో ఆలోచనలు వొస్తున్నాయి.

పరీక్ష...పరీక్షలు...

'ఎవరికి!' అనుకున్నది రమ.

తలనొప్పి విపరీతంగా ఉంది...పిడుగు వొస్తూంది. ఒక్కసారి చచ్చిపోతే బాగుండునని పిస్తూంది.

"ఎలా ఉంది రమా?"

మెల్లగా...చల్లటి చెయ్యి నుదురుమీద వేసి అడిగాడు ప్రకాశం.

"బాగా ఉంది...తలనొప్పి—"

"డాక్టర్ని పిలవనా?"


"వొద్దులెండి - అదే తగ్గుతుంది..."

మెల్లగా నిద్రపట్టినట్లు కళ్లు మూతలు పడ్డాయి - నిద్రపట్టినట్లే ఉంది లేచేసరికి గంటో...ఎంతో.

"ఎలా ఉంది దానికి?"

రంగారావు గొంతుక

"అలాగే ఉంది - జ్వరం ఎక్కువగా ఉంది"



కుర్చీలో కూనిరాగం

"ఆరుద్ర"

విద్యార్థి జీవితంలో 'కాలేజీ మేగజీన్' వెలువడే రోజు మరువరాని రోజు. తన రచన అందులో అచ్చుపడ్డ విద్యార్థికే కాదు. అది చదవమని, చదివి అభిప్రాయం చెప్పమని తనని పొగడమని ఆ విద్యార్థి ఎవరెవర్ని కలుసుకొంటాడో వాళ్ళకికూడా ఆరోజు మరువరాని రోజే. మేగజీనులో పడ్డవాళ్ళని చూసి పడనివాళ్ళు మెచ్చుకోవచ్చు, నొచ్చుకోవచ్చు - అప్పుడప్పుడు ఓ రెండు ఇచ్చుకోవచ్చు. ఏమైనా ఆ పడ్డవాడి బాధ పగవాడికైనా వద్దు. అయినా తప్పదు. ఈ తప్పనిసరితిప్పిదం ప్రతి ఒక్క రచయితా చేసి ఉంటాడు.

పది పదిహేనేళ్ళకిందట, భావకవిత్వం ఒంటికి పటించుకొని శ్రీశ్రీ ని నారాయణబాబుని చదివి 'చెడిపోయిన' కాలేజీ కవులు ఆ పద్ధతులలో రాస్తే ఆ రాసినవి మట్టుకూ కాలేజీ మేగజీనులలో అచ్చువేయించుకోడానికి తటపటాయించుకూ ఉండేవారు. తెలుగు పండితులు ఆధునిక కవిత్వాన్ని అంటరానిదానిగా చూసేవారు. తోటి విద్యార్థులు "వీడొక్క భావకవిరోయ్!" అని కాలేజీ కవిని భయంతో వింతతో చూసేవారు. గాని ఆధునిక రచన కాలేజీ పత్రికలలోకూడా ఎక్కింది. వ్యావహారిక భాషలో వచన రచన, గేయాలలో కవిత్వం కాలేజీ పత్రికా సంపాదకులు అచ్చువెయ్యక తప్పలేదు. ఆంధ్రా యూనివర్సిటీ మేగజీన్లలో అబ్బూరి వరదరాజేశ్వరరావ్ రచనలు, అనిసెట్టి సుబ్బారావు సంపాదకత్వంలో గుంటూరు ఏ. సీ. కాలేజి మేగజీను ఆ రోజుల్లో ఒక విప్లవమే!

ముద్దుకృష్ణ 'జ్వాల'లాగ నవ్యసాహిత్య పరిషత్తు వాళ్ళ 'ప్రతిభ'లాగ కాలేజీ మేగజీన్లు ఉండడానికి ప్రయత్నించేవి. అది ప్రయత్నమే తప్ప మరేంకాదు. కళాశాల పత్రికలలో ఒకటీ అరా తప్ప తక్కిన రచనలు పేజీలు నింపడానికి వేసేవి, సరిసమానమైన ప్రాతినిధ్యంకోసం సంపాదించేవి అని అందరికీ తెలిసినవిషయమే. అందులో ఫలానా ఫలానా విద్యార్థి థర్డ్ బియస్సి, ఫలానా ఫలానా అమ్మాయి సెకెండియరు అన్న రచయితల పేర్లు తప్ప తక్కినవి అంత ఆనందించవలసిన విషయాలు కావు. కళాశాల పత్రికలలో శిల్పగరిమ ఎంత ఉంటుందో ఎవరికి తెలియదు.

ఈమధ్య ఒక హైస్కూలు పత్రికని చూడడం పడ్డది. అందులో 'శిల్పగరిమ రమణీయంగా ఉంద'ని ఒక ప్రఖ్యాత ఆధునిక కవి ప్రశంసించారు. ఆ కవిగారిమీద నాకు గౌరవం విశేషంగా ఉండడంవల్ల ఆ పత్రికని ఆశతో చదివాను. శిల్పగరిమ మాట దేవుడెరుగును. ఆ పత్రికలోని ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రచురించిన రచనలు చూసి గుండె బాదుకొన్నా. "ఇది నిజం" అని పేరుపెట్టి ఒక విద్యార్థి చదువుకొనే ఆడపిల్లలమీద ఒక పద్యం రాశాడు. అది అచ్చువేశారు. చిత్తగించండి.

"వీళ్లంతా వచ్చేజనరేషన్ వాళ్లకి మదర్స్
నిజాని కీళ్ళందరూ కావాలి బ్రదర్స్
అలా అందర్నీ పిలవడంలో లేదుబ్యూటీ
పైకిమాత్రమే ఈ మొరాలిటీ!
కనిపించిన మగవాడల్లా వీళ్ళ లవర్
వాళ్లమీద ప్రయోగిస్తారు వీళ్ళ అస్త్రాల పవర్
వారినిపోయే మగవాడు తనవంక జూస్తే ఫూల్
మరి క్లాసులో దొంగచూపులు చూడడమే నా రూల్"

ఇలాగ పోయిపోయి ఆడపిల్లల 'మనస్తత్వాన్ని' అతి ధైర్యంగా వర్ణించి వర్ణించి, ఆ కవి అంటాడు

"ఇటువంటివాళ్లంతా సిష్టర్స్
మగవాళ్ళంతా వీళ్ల మిష్టర్స్
ఇటువంటివాళ్లు మాత్రం లేడీస్
వీళ్లు కేవలం కేడీస్!"

చిత్తగించారా! ఎంత కొత్తదనం! ఎంత ఉద్రేకం. ఎంత శిల్పగరిమ! ఇది పాపం ఒక విద్యార్థి రచన మట్టుకే. అతనికంటె ఘనుడు ఆచంట మల్లన. ఒక ఉపాధ్యాయుడు సదరు హైస్కూలు పత్రికలోనే చాటువులు ప్రచురించారు. అవికూడా. చిత్తగించండి.

ఓ పథికా! క్షణమ్మిచట నుండుము!
గ్రంధము విప్పి చూడుమో
యీపెను రాజవైద్యుడవో, హెచ్చగు
జ్యోతిష శాస్త్రవేత్తవో!
నాపతి యూరలేడు; పయనమ్మయి
ఎప్పుడు వచ్చు? గ్రుడ్డిదౌ
నాపతి తల్లి కెట్లు నయనమ్ములు వచ్చు
నెరుంగ తెల్పుమా!

అంతటితో ఆగలేదు. 'అతిరమణీయమైన' వర్ణనకూడా చేశారు అదికూడా గమనించండి.

"జలదపథమ్మునన్ వెలయు జక్కని
బావి ఒకండు దానిక
వ్వల బలభిన్మణీ ఖచిత
భర్మవినిర్మిత సౌధమార్గ మ
వ్వలను బటీరలిప్త హిమవత్పరి
భోగ్యము శైలయుగ్మ మ
వ్వల నమృతమ్ము పొంద సులభమ్మట
వారికి జంద్రసన్నిధిన్"

పద్యాలు ప్రశస్తంగా ఉన్నాయికదూ. అర్థం ఏ ఒకరిద్దరికోగాని విద్యార్థులలో బోధపడక పోవచ్చు. సహజంగా అర్థం ఏమిటని మాస్టారిని అడుగుతారు. వారు చిరునవ్వు నవ్వి రహస్యంగా అర్థం చెప్తారు. అలా అర్థం తెలుసుకొన్న విద్యార్థి ఆ పద్యాలకి తాను తెలుసుకొన్న అర్థాలని తదితర విద్యార్థులకి సగర్వంగా తెలియచేస్తాడు. 'భాషాప్రవీణ' 'విద్యాప్రవీణ' అయిన ప్రధానాంధ్ర పండితుడు రచించిన చాటువులు (హేలుడికి అమాం బాపతు సంస్కృతశ్లోకాలకి మక్కీకిమక్కీ తర్జుమా అయితేనేం ఆ సంగతి బయట పెట్టక పోయినా) అత్యంత 'రమణీయం' గాఉన్నాయని స్కూలు స్కూలంతా తెలుస్తుంది. (సదరు హైస్కూల్లో ఆడపిల్లలు కూడా చదువుకొంటున్నారు పాపం. "స్త్రీకి స్వాతంత్ర్యమువచ్చెనేని ..స్త్రీ తనధర్మము నుండి చెడుటయేగాక మహిళామండలికి గళంకము దెచ్చును" అనే సదభిప్రాయాలు కూడా కలిగినవాళ్ళు! ఈ ఉన్నత పాఠశాలలో కవిత్వం,'రసం' ఎంత ఉన్నతంగా ఉన్నాయో చూశాక ఎవరుమట్టుకూ గుండెలు బాదుకోరు!

* * *

కాంగ్రెసు కుటుంబాలలో పుట్టి ఖద్దరు పొత్తిళ్ళల్లో పెరిగిన ఈ తెలంగాణకూడా చేనేతపరిశ్రమపట్ల అదోరకం అభిప్రాయం కలిగి ఉండడం దోషం కాదేమో అని ఇప్పుడు జరిగిన "చేనేత సప్తాహం"వల్ల నా అనుమానాలు మరింత గట్టిపడ్డాయి. నా మట్టుకు నేను పుట్టింది కాంగ్రెసువాదుల కుటుంబంలో. కట్టింది చాలా కాలంవరకు ఖదరే. నాకు బాగా జ్ఞానం వచ్చేవరకు మా ఇంట్లో రాట్నాలు ఆడుతూ ఉండేవి. రెండు పుష్కరాలకిందట విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో, వచ్చీరాని వయస్సులో నేనుకూడా షాపుల దగ్గర పికెట్ చేయడం నాకు జ్ఞాపకం ఉంది.

మా ఊళ్లో విదేశీ సరుకులమ్మే పేరుపడ్డ షాపుముందు - ఖద్దరు నిక్కరు, ఖద్దరు లాల్చీ గాంధీటోపీ ధరించి నాకన్నా రెండింతలు పొడుగున్న జెండా పట్టుకొని పికెట్ చేస్తున్నా. "బాబూ విదేశీ వస్తువులు కొనకండి: స్వదేశీ వస్తువులు కొనండి" అని అరుస్తున్నా. పాపం కుర్రాడు అలిసిపోతున్నాడని మావాళ్లందర్నీ బాగా ఎరిగిన షాపువాడు ఒక స్టూలుబల్ల నాకోసం వేయించాడు. దానిమీద కూర్చొని, ఎవరేనా షాపులోకి వెళుతున్నప్పుడు లేచి నిలబడి పికెట్ చేయడం ఇంకా జ్ఞాపకం ఉంది. పెద్దలు పలికిన చిలకపలుకులు పలుకుతున్నా. ఎవరో నామాటలు విని నవ్వి ముచ్చటపడి షాపులోకెళ్ళి చక్కటి చాక్లెట్లు కొని నాచేత తినిపించారు. ఎంత ఉత్సాహంతో పికెట్ చేశానో, అంత ఉత్సాహంతో అవి తిన్నాను. షాపువాడూ, చాక్లెట్లు కొని తినిపించినవాడూ విరగబడి నవ్వారు. అప్పటికిగాని నేను పాపంచేసినట్టు నాకు తెలియలేదు. షాపులోకి ఎవరో తెల్లదొర వెళుతూఉంటే అతడికి స్వదేశీ వస్తువులేగాని, విదేశీ వస్తువులు కొనవద్దని హితోపదేశం చేశాను. అతడు నా మాటలకి మెచ్చుకొని నేను చెప్పినట్టే తన స్వదేశీ వస్తువైన చాక్లెటుకొని నాచేత తినిపించాడు. శుద్ధ ఖద్దర్ కట్టుకొని సీమలో తయారయిన తినుబండారాన్ని తిన్నందుకు గాంధీమహాత్ముడు శపించిపోతాడేమో అని, నా కాళ్ళకింద భూమి పగిలిపోతుందేమో అని ఇప్పటికీ నాకు కలలో భయంగానే ఉంటున్నది.

అలాంటి సంప్రదాయంలో అసంఖ్యాకులు నాలాగే పెరిగిఉంటారు. అయినా అందరం ఈరోజుల్లో ఖద్దరుని ఆదరించుతున్నాం అనుకోడం ఆత్మవంచన. విదేశీ వస్తువులని బహిష్కరించిన మహా మహా వాళ్ళే విదేశీ వేషభాషలు ఆచరించక తప్పలేదు. ఖద్దరు పెంట్లాం, ఖద్దరు షర్టు ఖద్దరు కోటూ వేసుకొని కచేరీలకి వెళ్లక తప్పలేదు. ఇలాంటి జాతీయాభిమానులని చూశాక ఖద్దరుమీద ఉన్న గౌరవం కాస్తా పోయింది. పరాయి ప్రభుత్వంతో పోరాటం సాగించుతున్నప్పుడు ఖద్దరు అవసరం ఎంతైనా కావలసివచ్చింది. కాంగ్రెసు ప్రభుత్వాలు గద్దెలమీద కెక్కినప్పుడు పారిశ్రామికంగా దేశం వెనకపడినప్పుడు మిల్లు నూలుతో నేసిన చేనేత బట్టలని ప్రోత్సహించడం బాగానే ఉంది. గాని ఇవాళ చేనేతబట్టలనే కట్టండనడం వాచీని వెనక్కి తిప్పడమే.

చాలామంది నిరుద్యోగులయిపోతారని భయపడి, చేనేత పరిశ్రమని ప్రోత్సహించడం చేతకాక సాహసంలేక చేసేపని. సహకార పద్ధతిమీద మొన్నమొన్న మరకదుళ్ళ మిల్లు స్థాపించినట్టు సహకార పద్ధతిమీద మరనేత మిల్లులుకూడా జిల్లాకొకటి ఉండేరోజులొస్తే బాగుండును. యంత్రయుగంవల్ల చేతిపనులు దెబ్బతింటాయని పూర్వంలాగే అన్నీ ఉండాలనడం మంచి లక్షణంకాదు. దేశం పారిశ్రామికం అయితే పనులు పోయేవాళ్ళకి వేరే పనులు కల్పించడం సర్కారువారికి చేతనైనప్పుడు వేరే భయాలు ఉండవు.

చేతినూలు, చేనేతపై తయారయిన వస్త్రాలు మన గొంతుకలలో పచ్చి వెలక్కాయల్లాగున్నాయి. నెహ్రూగారు దేశం పారిశ్రామికం కావాలనే వారే. ఆయన యంత్రయుగాన్ని వాంఛించే వ్యక్తే - అయితే కాంగ్రెసు సంప్రదాయంవల్ల చేనేతని ఆయన ప్రోత్సహించక తప్పదు. "చేనేత వారా"నికి సందేశమిస్తూ "చేనేత వస్త్రాల తయ్యారీలో అనుసరించే విధానాలను మార్పు చేయడానికి కూడా నిరంతరం ప్రయత్నాలు జరగాలి" అని ఆయన ఘట్టుగా తన ఉద్దేశాలు చెప్పారు. ప్రస్తుత అసహాయ పరిస్థితుల్లో చేనేతని ప్రోత్సహించాలేమోగాని, కలకాలం ఇలాగే ఉండాలనడం అవివేకం.

* * *

"జీవకారుణ్యం" మనిషన్న ప్రతివాడిలోనూ ఉంటుంది. నోరులేని జంతువుల్ని పనిపెట్టుకొని హింసించడం ఎవరూ సహించరు. గాని మానవులకి లేని స్వేచ్ఛని జంతువులకి ఇవ్వమనడంలో 'కారుణ్యం' మరీ జాస్తీఅయి తీరుతుంది. శ్రీమతి రుక్మిణీదేవి అరండేలు కౌన్సిల్ ఆఫ్ స్టేట్సులో ఒక బిల్లు ప్రవేశపెట్టి సభవారిఅనుమతిమీద అది ఉపసంహరించుకొన్నారు. ఆ బిల్లును ప్రతిపాదిస్తూ ఆమెచేసిన ప్రసంగంలో జీవకారుణ్యం మరీ మరీగా ఉంది.

జంతు ప్రదర్శనశాలలోనూ, సర్కస్‌లోనూ జంతువులని హింసించకూడదట! పులినోట్లో తలపెట్టేవాడూ, రింగ్ మాష్టరూ, జీవకారుణ్యం కలిగి, జంతువులని హింసించలేదే అనుకోండి. ఆ పులికి జీవకారుణ్యం ఉంటుందా? ఏమో చెప్పలేం. సర్కస్‌లో జంతువులని హింసించకూడదని శాసించడం దాకానే వెళ్లేరు. అసలు సర్కసులనే నిషేధించాలని ఒక శాసనం తయారు చెయ్యలేదు. అందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.

రుక్మిణీదేవి ఈ బిల్లుని తీసుకొస్తారని తెలియగానే కజిన్సు "అహింస ఒకకళ" అని ఇంగ్లీషులో ఒక వ్యాసం రాశారు. చతుష్షష్టికళలు అంటే అరవైనాలుగుకళలనే పూర్వం చదువుకొన్నా అందులో అహింస అనేది లేదు. మహావిష్ణువు పదకొండో అవతారం ఎత్తగాలేంది అరవై అయిదో కళకూడా ఉండకూడదా. ఉన్నా అదెలాగు కళో. నాకేం అర్థంకాలేదు. గాని యథాశక్తి జీవకారుణ్యం ప్రదర్శించడం కళాకారుల విధి అని సాధ్యమైనంతవరకూ అలా ప్రదర్శించుతూ నేఉన్నా. మా వీథిలో ఊరకుక్కలు (వాటిని మునిసిపాలిటీవాళ్లు తగలెయ్య!) రాత్రిపూట బృందగానం చేస్తున్నప్పుడుమట్టుకూ జీవకారుణ్యం ఎగిరిపోతూఉంటుంది. కుక్కలబండీవాళ్లు వీటిని పట్టుకుపోతే బాగుండుననిపిస్తుంది. మొరిగే కుక్కలు కరవవు నిజమేగాని అవి నిద్రమట్టుకూ చెడగొడతాయి. వాటిపట్ల జీవకారుణ్యం ఎలా చూపెట్టాలో రుక్మిణీ దేవిగారే చెప్పాలి. అడయారు కళాక్షేత్రం చుట్టుపక్కల ఈ బాధలేదు. అందుచేత ఇలా ఎన్నైనా చెప్తారు.

* * *

మహాత్ముడి 'ఆత్మకథ' చదువుతున్నప్పుడు అప్పుడప్పుడు ఒళ్ళు జలదరిస్తుంది. ఆయన చిన్నప్పుడు స్నేహితులతో కలసి మేకమాంసం తినడం, తిన్నాక ఆ రాత్రి కడుపులో ఆ మేక అరవడం ఆ తరవాత నుంచి ఆయన మారిపోవడం ఘట్టం చదువుతున్నప్పుడు మనస్సు వికలమవుతుంది. ఇటువంటి సంఘటనే ఒకటి నెహ్రూగారు మొన్న స్టేట్ కౌన్సిలులో చెప్పారు. 36 సంవత్సరాల కిందట నెహ్రూగారు వేటకి వెళ్లారట. అప్పుడొక ఎలుగుబంటిని చంపారట. ఆ తరవాత వేటమీద మోజు నశించి ఒక్క జంతువునికూడా చంపలేదట. స్వానుభవం అయిన ప్రతిఒక్కడూ జీవకారుణ్యం ఎందుకు చూపడు? భారతదేశంలో జంతుహింస నివారణకి బిల్లుమట్టుకు అనవసరం.

* * *

హరిజనులు దేవాలయంలో ప్రవేశించవచ్చు అని శాసనం చేశారు. ఏం జరిగింది. శాసనం కాగితాలలోనూ ఆశయం మనస్సులోనూ ఉండిపోయింది. అణుమాత్రం ప్రయోజనం లేకపోతున్నది. హరిజనులు దేవాలయ ప్రవేశం చేయబోతూఉంటే ఛాందసులు సత్యాగ్రహం చేయడం, ఆలయ ప్రాంగణంలో అత్యాచారాలు చేయడం జరుగుతూంది. నిరాశతో హరిజనులు వెనక్కి తిరిగిపోతున్నారు. ఒకవేళ చేస్తే జంతుహింస నివారణకోసం చేసే శాసనం కూడా ఇలాగే అవుతుంది. ఉబలాటం కొద్దీ శాసనాలు చెయ్యగానే సరికాదు. ఛాందసులకి కోపంవచ్చినా, వాళ్లని మెచ్చుకొని ఆరాధించేవాళ్లకి తాపంవచ్చినా ఖరాఖండీగా కచ్చితంగా వరసపెట్టి శాసనాన్ని అమలు జరపడంలోనే ప్రజ్ఞ ఉంటుంది. అలా చే. ధైర్యం మనవాళ్లకి లేదు. ★

చేసిన పాపం

మీరూ నమ్మరు. యిలా జరిగిందని చెప్పితే బహుశా నేనూ నమ్మను. కానీ యీ విశాలవిశ్వంలో అపారాద్భుత సంఘటనలెన్నో.

నేనూ అతడూ కూడా హిందూపురం స్టేషన్లోనే రైలు ఎక్కాం. అతడు ముందు బెంచీపైకూర్చొని తూగుతున్నాడు. ప్రయాణం చాలా చికాకుగా ఉంది. యింటినుంచీ వచ్చిన లెటర్ చూచినప్పటి నుంచీ అసలే మనస్సు వికలంగా ఉంది. పైగా ప్రయాణం రద్దీ. సావకాశంగా కూచోడానికూడా జాగాలేదు. బెంచీల మధ్య క్రిక్కిరిసి దట్టంగా నిలబడిన మనుష్యులగోడవల్ల ఊపిరాటం లేదు. రెండు మూడు స్టేషనులు దాటినవి. రద్దు కొంచం తగ్గింది. ముందు బెంచీఆయన తురీయావస్థ నుంచీ మేల్కొన్నాడు. స్టారు సిగరెట్టు వెలిగించి తాపీగా కాళ్లు బారజాపి కూర్చొన్నాడు. ఎక్కడి కెళ్లాలండీ అన్నాడు. ఘంగానా అన్నాను. నేనూ అటువైపే అన్నాడు. ఊరూ పేరూ అడిగాడు. తనూ ఒకతూరి మా ఊరిమీదగా వెళ్ళానన్నాడు. 'ఏన్యోసిన్సి' అనుకొన్నాను, అనంతపురం స్టేషన్ వచ్చింది. తన సామాను చూస్తూండమని చెప్పి స్టేషన్లోకి వెళ్ళాడు. అనంతపురం స్టేషన్ విడిచినప్పటినుంచీ ముసలాయన బాతాఖానీ ప్రారంభించాడు. చాలా హుషారైనమనిషి. మాటకొక సామెత. నిమిషానికొక కథ చెబుతాడు. యివన్నీ పండిపోయిన తన అనుభవాలే.

మా రైలును ఒకటిన్నరఘంట ఆలస్యంగా చేరింది గుంటకల్. ఫలితం యిక రైలును లేదు. పోర్టరు శుభవార్త చల్లగా చెప్పాడు. ఇక ఆరుగంటలూ అక్కడే పడి ఉండవలసిందే. నాకసలే చీకాకుగా ఉంది. గోరుచుట్టుపై రోకలిపోటు. యిద్దరం వెళ్ళి కాఫీ తాగివచ్చి ప్లాటుఫారంలో వేసిన బెంచీలపై కూలబడ్డాం. ముసలాయన తన పాతకాలం నాటి బెడ్డింగును పరిచాడు నన్నూ కూర్చోమన్నాడు. నా వృత్తి వ్యవహారం అన్నీ అడిగాడు. మీరో అన్నాను. హెడ్ కానిస్టేబిల్ చేసి పెన్షన్ తీసికొన్నాడట. పోలీసుద్యోగం మంచిదండీ అన్నాను. ఆ. ఏముందీ. దగాలో మోసం నేరాలూ పాడు ఉద్యోగమన్నాడు. ఐనా దుష్టశిక్షణా శిష్టరక్షణాఅనేది ఉండాలిగదా అని తానే సరిపెట్టుకొన్నాడు మరి మీ డ్యూటీలో మీ రెన్నడూ కఠోరంగా ప్రవర్తించలేదా అన్నాను. అన్యాయంగా కఠోరంగా నేనెన్నడూ ప్రవర్తించలేదుగానీ ఒకతూరి మాత్రం ఘోరమైన తప్పిదమే చేశానన్నాడు. ఇది చెప్పబోయేకథకు నాందీ ప్రస్తావన. ఎలా? అన్నాను. యిక ప్రారంభించాడు.

బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

నేను నాయిరవై సంవత్సరాల వయసులో కానిస్టేబుల్ గా చేరాను. పదేండ్లు కానిస్టేబిల్ గా రైటరూగా ఉన్నాను. తరువాత హెడ్ కానిస్టేబుల్ అయినాను. పోలీసు ఉద్యోగం స్వరూపం మీకు తెలిసే ఉంటుంది. అధికారం దర్జాలో మానవత్వం మరుగుపడిపోతుంది. కానీ నేను ముక్కుకు నూటిగా పొయ్యేవాడిని. పార్టీదార్లు అయాచితంగా యిచ్చే బహుమతులూ అవీ యివీ తీసికోకపోలేదు. కానీ ఎవరినీ నొప్పించలేదు. అందరిఎడలా న్యాయంగా ప్రవర్తించేవాడిని. కనీసం అలా ప్రవర్తించేవాడినని నాఊహ. పై అధికార్లూ ప్రజలూ కూడా నాతో స్నేహంగా ఉండేవారు. యిలా 20 ఏండ్లు గడిచినవి. ఒకనాడు రామాపురం మునసబునుంచీ తక్షణం రావలసిందని రిపోర్టు వచ్చింది. అప్పుడు సబిన్స్పెక్టర్ యిన్చార్జిలో నేనే ఉన్నాను. వెంటనే విచారణకు ఆ గ్రామానికి వెళ్ళాను.

రామాపురం మునసబు చండశాసనుడు. ఊరిలో తనమాటకు తిరుగులేదు. లంచాలతోనే మేడ కట్టించాడు. పెద్ద భూస్వామి కూడాను. కానీ ఆ గ్రామంలోనే రంగయ్య అనే మామూలు రైతున్నాడు. న్యాయం దయాకలిగిన పెద్దమనిషి. మునసబు కతినిని చూస్తే భయం. రంగయ్య తనకు న్యాయమైనదని తోచినదానికోసం పోరాడతాడు. కనుక రంగయ్యకూ మునసబుకీ చుక్కెదురు. రెండుమూడుపార్లు రంగయ్య మునసబు శాసనాల్లో జోక్యం చేసికొన్నాడు. మునసబుతో పీడింపబడినవారిని వెనకేసుకొచ్చాడు. దానితో యిద్దరూ బద్ధశత్రువులయ్యారు. ఇది యిలాగుండగా ఒకరోజు ఆ గ్రామంలోని ఘరానా ఆసామి జానకిరామయ్యనుఎవడో రాత్రి చీకటిలో కత్తితో పొడిచాడు. అది హత్యా ప్రయత్నమే. కాస్తలో తప్పిపోయింది. కానీ జానకిరామయ్యకు బలమైన గాయాలు తగిలినవి. యిందులో విశేషమేమంటే పూర్వంనుంచీ జానకిరామయ్యకూ రంగయ్యకూ చాలామనస్పర్ధలున్నాయి. మునసబు కిప్పటికి సమయం కలుసుకొచ్చింది. ఆడబోయిన తీర్థం ఎదురైంది. యిదంతా చేసింది రంగయ్య కుమారుడు శ్రీరాములే అని ఎలుగెత్తి చాటాడు. జానకిరామయ్యను బలవంతంచేసి ఆవిధంగా వాఙ్మూలం కూడా యిప్పించాడు. కానీ ఆ వూళ్లోని ఆబాలగోపాలానికీ శ్రీరాములు నిర్దోషి అనే విషయం తెలుసు.

నేనీ కేసు ఒప్పుకోనన్నాను. కానీ మునసబు సామాన్యుడు కాడు. నయానా భయానా చెప్పాడు. నేను వినలేదు. చివరికి తన బ్రహ్మాస్త్రం వదిలాడు. ఒకటి రెండు మూడు నాలుగు ఐదు. ఐదు పచ్చకాగితాలు! నాతల గిర్రున తిరిగిపోయింది. ఎన్ని నెలలు సంపాదించాలి నే నింత జీతం. డబ్బుదే ఎప్పుడూ మానవత్వంపై విజయం. కేసు రికార్డుచేసి శ్రీరాములును స్టేషనుకు తీసికొని వెళ్ళాను.

లాకప్లో ఉన్నంతకాలం శ్రీరాములుపై ఎంతో క్రూరంగా ప్రవర్తించాననే చెప్పాలి బంధువుల నెవ్వరినీ స్టేషన్ దరిదాపులకైనా రానివ్వలేదు. రంగయ్య అహర్నిశలూ స్టేషన్లో పడి ఏడ్చేవాడు. అన్నిటికంటే క్రూరం. శ్రీరాములు చెల్లెలు

అన్నను చూట్టానికి వచ్చింది. నేనిప్పుడు వీల్లేదన్నాను. ఏడ్చింది. ఆ బాలికకు నా మూడవకూతురు ఏండ్లుంటాయ్. చెంపకు చేరడేసి కళ్లు. విరిసీ విరియని పువ్వులా గుంటుంది. ఎలాగైనా నన్నిప్పుడు చూడ నివ్వండని ఏడ్చినది. నేను పసువులా కన్నుగీటాను! పాపం ఏమీ చేయలేని అవమాన భారంతో కుమిలిపోయింది.

తరువాత కేసు విచారణ జరిగింది. మున సబు సామాన్యుడా. సాక్ష్యమంతా పకడ్‌బందీగా ఉంది రంగయ్య కొంపనమ్మి న్యాయంకోసం ఖర్చుపెట్టాడు. ఫలితం శూన్యం. ఉగ్రుడైన మేజస్ట్రేటు మూడేండ్లు శిక్ష విధించాడు శ్రీరాములుకు. దానితో రంగయ్య సంసారం కూలిపోయింది, అంతే అన్నాడు. వృద్ధుని ముఖంలో విషాదరేఖలు గోచరించినాయ్. తరువాత అన్నాను. తరవాత ఏమీ లేదు. ముసలి రంగయ్య ఆర్నెల్లలో మనోవ్యథతో చనిపోయాడు. దిక్కులేని అనాధ బాలికను ఒక ముసలాయనకు ముడిపెట్టి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారు బంధువులు. శ్రీరాములు విడుదలైనాడు కానీ అతడు పిచ్చిబట్టి దేశాంతరం వెళ్ళాడని కొందరూ, దొంగలతో కలిసిపోయాడని కొందరూ అంటారు. ఏమైనాడో పాపం భగవంతునికే తెలుసు. ముసలాయన కథ ముగించి ఆవులించి చిటికెవేస్తూ రెండు దమ్ములు లాగి సిగరెట్టు పారవేశాడు. క్షణంలో గుర్రుపెడ్తూ నిద్రపోతున్నాడు నాకు నిద్ర రాలేదు. అతను చెప్పిన విషయాన్నే ఆలోచిస్తున్నా. పాపం శ్రీరాములేమైనాడో. ఇంతలోనే ఒక లావుపాటి మనిషి వచ్చి అగ్గిపెట్టె బాబూ అన్నాడు. లేదన్నాను. వెళ్లిపోయాడు.

ట్రైను వస్తూంది అనే పోర్టర్ కేకతో యిద్దరం మేల్కొన్నాము. గబగబా ప్లాటుఫారంవైపు పరుగెత్తాను. నాకూ ఒక టికెట్టు తీసుకరా బాబూ అని ముసలాయన జేబులో చేయి పెటాడు కోటు జేబు వెతికాడు. లోపలి బనియను జేబు గాలించాడు. అమాంతం కెవ్వుమని కేక వేశాడు. పోయింది పర్సు. వెయ్యి రూపాయల పర్సు! వృద్ధాప్యంలో ఏకమాత్రమైన ఆధారం పర్సు! ముసలాయన ఏడ్పులకూ పెడబొబ్బలకూ గుంతకల్లు ప్లాటుఫారం ప్రతిధ్వనించింది. పెద్దగుంపు పోగైనారు. అయ్యో పాపం అన్నారు కొందరు. ప్లాటుఫారంలో అంత అజాగ్రత్తగా పండుకోడమా అని మందలించారు కొందరు. రైల్వేపోలీసు స్టేషనుకు పరుగెత్తాం. అక్కడ సబిన్స్పెక్టర్



అమాంతం కెవ్వుమని కేక వేశాడు. పోయింది పర్సు!—
వెయ్యి రూపాయిల పర్సు !!

దొంగను గుర్తుపట్టి చూపిస్తే విచారిస్తామన్నాడు. ముసలాయన ఏడ్పులు తగ్గలేదు. ట్రైను కదిలే వేళైంది. మీ వూరికి టికెట్టు తెస్తానన్నాను. ససేమిరా వినలేదు. అక్కడే కూర్చొని యిన్వెస్టిగేషన్ చేస్తాడట. ఇక లాభం లేదని ముసలాయన వద్ద సెలవు తీసికొని నేను రైలెక్కాను.

నాకుమాత్రం కూచోడానికి సావకాశంగా సీటు దొరికింది. నాతరువాత ఎక్కిన వాళ్లు చాలామంది వాకిట్లోనే నిలబడ్డారు. రైలు కదిలింది. రైలు కదలగానే రష్ తగ్గడమూ ఆగగానే రద్దీ ఉధృతం కావడమూ ఒక అనిర్వచనీయమైన సామాన్య సూత్రం. నాముందు ఒక లావుపాటి మనిషి నిలబడినాడు. నేను కొంచెం ఉదారంగా నవ్వి కొని అతనికి కూర్చోడానికి చోటిచ్చాను. ఏ వూరన్నాను. ప్రపంచకమంతా నావూరే బాబూ అన్నాడు. నా కాశ్చర్యం వేసింది. జేబులోనించీ సిగరెట్ కేసు తీసి నా కొక కాప్‌స్టన్ సిగరెట్టిచ్చాడు. మనిషి పశువు కావడానికి ప్రభుత్వమే కదండీ కారణం అన్నాడు. అసలు మీరెవరండీ అన్నాను. నా సంగతి మీకు పరిపూర్తిగా తెలుసునండీ అన్నాడు. వీడికేమో పిచ్చెత్తిందనుకొన్నాను. ఇంతవరకూ గుంతకల్లు ప్లాట్‌ఫారంలో అగ్గిపుల్ల అడిగావు లేదన్నాను. ఇది మినహా నిన్ను నా జీవితంలో చూడలేదన్నాను. చూడకుంటే వినగూడదూ అన్నాడు. ఆ మనిషి వాలకం విచిత్రంగా ఉంది. ఇంతలో స్టేషన్

★ చేసిన పాపం ★

వచ్చింది. ఆ మనిషి విధేయంగా వెళ్లొస్తా బాబూ మరచిపోకండి అన్నాడు. ఆమనిషి దిగి ప్లాటుఫారంలో నిల్చున్నాడు. రైలు కదలబోతున్నది. నాకు ఔత్సుక్యం ఎక్కువైంది. రైలు కదిలింది. సరేగానీ నీ పేరు చెప్పవూ అన్నాను.

ఆ మసక చీకటిలో ప్లాటుఫారంనుంచీ మెల్లగా విన్పించింది. "నా పేరే బాబూ శ్రీరాములు!" ★

భార్యా అరూపవతీ

1

(హాస్టల్)

రాధాకృష్ణ: ఏమిటోయ్, కామరాజూ? క్రాస్‌వర్డ్ పజిల్ సాల్వ్ చేస్తున్నావా? ఏం?

కామరాజు: కాదోయ్. అంతకన్న పెద్ద పజిల్; చూడూ;

రాధా: ఓ; వధూవరుల ఫొటోలా? ఏం? ఎవరన్నా ఎరిగినవాళ్లున్నారా?

కామ: లేదు. కాని పజిల్ వేరే ఉంది?

రాధా: ఏమిటది?

కామ: ఈ దంపతులందరినీ శ్రద్ధగా చూడూ. ఈ అయిదు జోళ్లలోనూ సరి అయిన జోడల్లే నీకొక్కటైనా కనిపిస్తోందా?

రాధా: (ఉదాసీనంగా) ఏదో గంతకు తగ్గ బొంతా; చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా; పెళ్లిళ్లు స్వర్గంలో అవుతాయన్న ఇంగ్లీషు సామెత వినలా?

కామ: ఏడిచినట్టే ఉంది. ఈ పెళ్లిళ్లు స్వర్గంలో కాదు, నరకంలో అయాయంటాను. ఈ అందవికారం మనిషికి ఎంత అందగత్తె దొరికిందో చూడు. ఈ పక్కనే ఉంది మరో జంట. మొగుడు సినిమాస్టార్ లా ఉన్నాడు భార్య ఎక్‌స్ట్రాకన్న ఘోరంగా ఉంది. నా పజిల్ ఏమంటే ఈ ఆడదానికి ఆ మగాడూ, ఈ మగాడికి ఆ ఆడదీ జత దొరికితే ఇంత విడ్డూరంగా ఉండకపోను గదా అని;

రా: నువ్వనుకున్నట్టుగా జతలు కలపటానికి ఎన్నో వేల అభ్యంతరాలుంటాయి. వాటిలో ఏ ఒకటి ఊహించగలిగినా నువ్విట్లా మాట్లాడవు. నీకు 'ఇమాజినేషన్' లేదు, కామరాజూ...

కా: నేను ఇమాజినేషన్ జాస్తి అయి బాధపడుతున్నానని అంతా అంటుంటే నువు నాకు ఇమాజినేషన్ లేదంటున్నావుటోయ్, రాధా?

రా: ఇదేగా నీ ఇమాజినేషను?

కా: నా ఇమాజినేషనంటావేవిటి? ఈ పత్రిక కాపీ ఈ జంటలందరూ చూడరూ? ఈ ఫొటోలో అందగత్తె ఆ ఫొటోలో అందగాణ్ణి చూడదూ? చూసి ఏమనుకుంటుంది.

రా: బహుశా; ఏమీ అనుకోదు.

కామ: నీకే ఇమాజినేషన్ లేదు. తన మొగుడికన్న బాగున్నాడనీ, తనకన్న కురూపిని చేసుకున్నాడని అనుకోదుటోయ్?

రాధా: నాకు నమ్మకం లేదు.

కామ: నీ నమ్మకం ఎవడిక్కావాలి? మానవ సహజమైన మనస్తత్వం ఉండదూ?

రాధా: ఏవిటా మనస్తత్వం?

కామ: అది కూడా నీకు తెలీదన్నమాట.

రాధా: ఒకవేళ నా మనస్తత్వం వికటించి ఉండవచ్చు. నీ మనస్తత్వం సహజ ధోరణిలోనే ఉందిగదా?

కా: నిస్సందేహంగా?

రా: నీకు పెళ్ళయిందా?

కా: ఇంకా లేదు, ఏం?

రా: మరేం లేదు...నువు అందగాడివేనా?

కా: (నీళ్లు నములుతూ) ఊఁ...అంత అందమూ లేదు, బొత్తిగా అనాకారీ కాదు. సామాన్యమంటాను. లేక సామాన్యంకంటె ఒక్క పిసరు మెరుగేమో? దేనికీ క్రాస్‌ఎగ్జామినేషన్?

కొడవటిగంటి కుటుంబరావు

రా: నీకు అందగత్తెలను చూసినప్పుడల్లా వాళ్ళమీద మనసు పోతుందా?

కా: పోకుండా ఉంటుందా?

రా: అందగత్తెను చూసే పెళ్లాడతావా?

కా: వీలయితే వొదిలిపెడతానా?

రా: నువు ఒక మాదిరి అందం గలవాడివై ఉండీ, మంచి అందగత్తెను పెళ్ళాడటం అన్యాయం కాదూ?

కా: అంత మరీ అన్యాయంగా పెళ్ళాడతాననుకున్నావా?

రా: ఆ గర్భదరిద్రుడి కూతురు చాలా అందగత్తె దొరుకుతుందనుకో, మరీ అందంగా ఉందని మానేస్తావా?

కా: అటువంటి పరిస్థితుల్లో......

రా: లక్షరూపాయల ఆస్తితో కురూపి వస్తుందనుకో మానేస్తావా?

కా: మరీ కురూపి అయితే మానేస్తాను. లక్షరూపాయలయేది, పది లక్షలయేది, నేనట్లా డబ్బుకు అమ్ముడుపోను. ఎన్నటికీ అమ్ముడుపోను. చేసుకున్న భార్యమీద ఇచ్ఛ కలగాలా, వద్దా?

రా: నీ కెప్పుడూ కురూపి మనుషుల మీద మనసు పోదుటోయ్, కామరాజూ?

కా: (వెగటుగా) ఛీ, ఛీ; నాకేం ఖర్మోయ్?

రా: నీ ఇమాజినేషన్ లేకపోతే పోయింది గాని, నాకన్న సౌందర్యోపాసివిగా కనబడతావు.

కా: నీకుమాత్రం సౌందర్యోపాసన లేదా ఏం? చక్కని ఆడదానిమీద నీకు మనసుపోదా? పైగా అందగాడివికూడా నాయెను.

రా: నా అందం మాటెట్లా ఉన్నా, నాకుమటుకు అందమైన ఆడవాళ్ళంటే ఆకర్షణ లేదు. అందంగా ఉంటే చూసి సంతోషించనని కాదు. కాని అందాన్ని చూస్తే నాలో కోరికలు పుట్టుకురావు.

కా: అట్లా అయితే నీకు వాంఛే లేదన్నమాట.

రా: లేదంటే ఎట్లా? ఉంది. నా కేసి ఆశగా చూసే మనిషి కంటబడినా, ఒక ఆడది సులభంగా లభ్యమయే రకమని తెలిసినా, ఆ మనిషిమీద తాత్కాలికంగా మనస్సుపోతుంది. ఆమనిషి కురూపిఅయినా నన్నంతగా బాధింపదు.

కా: ఇంత అందగాడివి ఇటువంటి స్త్రీల వెంటపడుతూంటావా? నీకేం ఖర్మోయ్?

రా: నా అందం ప్రసక్తి అనవసరం; నా చక్కదనానికి నేను తన్మయుణ్ణయి కూచోవటం – అసాధ్యం. నువ్వనుకున్నట్టుగా నే నెవరివెంటా పడలేను. నా మనస్తత్వం చెప్పాను, అంతే.

కా: నీ మనస్తత్వం నాకు తలకిందులుగా ఉన్నట్టు తోస్తున్నది. అదే నీ మనస్తత్వమయితే అందిన ఆడదాని వెంట నల్లా ఎందుకు పడలేదూ?

రా: బహుశా ఒకందుకై ఉంటుంది· నాకు పెళ్ళయింది—

కా: (ఆశ్చర్యంగా) ఆఁ;

రా: అవును అయి చాలా ఏళ్ళయింది. కాపరానికి రావటానిక్కూడా సిద్ధంగా ఉంది నా భార్య. ఈ ఆడది నాకు అందుబాటులో ఉండటమే గాక, నాకోసం తపించిపోతోంది కూడాను. నా కోరికను రేపే రెండు లక్షణాలూ ఉన్న భార్య ఉండగా, నే నితర స్త్రీలవెంట పడవలసిన ఖర్మేమిటోయ్?

కా: ఇంకేం? నీకోసం తపించే అందమైన భార్యను పెట్టుకు నేనా ఇన్ని కోతలూ కోస్తున్నావు?

★ భార్యా అరూపవతీ ★

రా: నా భార్య అందంగా ఉంటుందని నే చెప్పానా?

కా: నువు కురూపిని పెళ్లాడావని నమ్మమంటావా ఏం?

రా: అవును. నా భార్య కురూపి. పొట్టిగా, సన్నగా, నల్లగా, ఉంటుంది.

కా: (జాలిగా) ఎంత అన్యాయం; నాకు తెలీదు సుమా; ఇటువంటి దాంపత్యాలు ఎట్లా ఏర్పడతాయా అన్నదే నాకు పజిల్‌గా ఉంటుంది.

రా: నా పెళ్ళివిషయంలో పజిల్ ఏమీ లేదు. మా నాన్న చాలా వ్యాపారాలు వేడుకల్లే చేసి చిక్కునపడ్డాడు. అందుచేత నా పెళ్లి, పక్కా వ్యాపారంలాగా చేసి కుటుంబాన్ని నిలబెట్టవలసి వచ్చింది. లేకపోతే మేమంతా నాశనమైపోయి ఉండేవాళ్ళం.

కా: కట్నం బాగా ఇచ్చారు కాబోలు.

రా: ఆ వివరాలన్నీ అడక్కు.

కా: స్వార్థంకొద్దీ కురూపిని కట్టుకున్నావా? ఇంకా నువు తెలివిగలవాడి వనుకున్నాను.

రా: నువ్వనుకున్న దానికన్న కూడా నేను 'తెలివితక్కువవాణ్ణే అనాలేమో. ఎందుకంటే పెళ్లయ్యేటప్పటికి మా కుటుంబ వ్యవహారాలు నాకు తెలీదు. ఈ పెళ్లి ద్వారా మాకు లాభం కలుగుతున్నదని కూడా నే నెరగను. అదంతా మా నాన్నకు మాత్రమే తెలుసు.

కా: అట్లా అయితే నువు నీ కాబోయే భార్యని చూడకుండా చేసుకున్నావన్న మాట.

రా: చూశాను. ఆమోదించానుకూడా.

కా: అయితే అప్పటికి అందవికారమైన మనిషి కాదేమో.

రా: మధ్యలో వచ్చిన అందవికారమేమీ లేదు.

కా: అట్లా అయితే నువు చెప్పేదానికి అర్థం ఏమీలేదు. నువ్వు వొట్టి వెర్రిబాగులవాడివై ఉండాలి.

రా: తమ్ముడూ, జీవితంలో మనం నిజంగా పాటించేది స్థాయికాదు, పరిణామగతి.

కా: ఇదేమిటీ వేదాంతం?

రా: కొంచెం ఓపికగా విను. నెలకో రెండువందలు సంపాదించేవాడికి సుఖం ఉందా, లేదా అంటే నువు చెప్పలేవు. ఒకడి జీతం నూటయాభైనుంచి రెండువందలకు పెరిగిందనుకో, వాడు భూమిమీద నిలవలేనంత సంతోషంలో ఉంటాడు. మరొకడికి జీతం మూడువందలనుంచి రెండు వందలకు తరిగిందనుకో వాడు కుంగిపోయి ఉంటాడు. నడి వేసవిలో విజయవాడ నుంచి చెన్నపట్నం వెళ్లినవాడికి ఎంతో సుఖంగా ఉంటుంది. ఊటీనుంచి వెళ్లినవాడికి వసెతగులుతుంది; నాకు చిన్నతనంలో చచ్చే జబ్బు చేసింది. జబ్బు నయమై పథ్యంపెట్టిన కొత్తలో కాళ్లీడ్చుకుంటూ వెళ్ళి సాయంకాలంపూట దొడ్డి అరుగుమీద కూచుని చెట్లూ చేమలూ, వాటిమీద పడే ఎండా చూస్తుంటే జీవించి ఉండటంలో ఇంత ఆనందం ఉందే అనిపించేది. సంపూర్ణారోగ్యంలో ఉన్నప్పుడు కూడా నాకంత జీవితానందం కలగలేదన్న మాట...

కా: (అడ్డం తగిలి) నీ ఉపన్యాసం పాడుగాను. మనం మాట్లాడుకునేదానికీ, ఇప్పుడు నువు చెప్పేదానికీ ఏమన్నా సంబంధం ఉందా?

రా: ఉంది మరి. నేను పెళ్లిచూపులకు వెళ్ళినప్పుడు నా కాబోయే అనాకారి భార్యమొహం నన్ను చూడగానే ఏదో అప్యాయత కనబరిచింది ఆమె చూపులోనూ, మొహంలోనూ అంతకు మునుపు లేని కళ ఏదో వచ్చింది. లోకంలో కల్లా అందమైన మనిషైతే మాత్రం ఏంలాభం? నిన్ను చూడగానే ఏమాత్రమో కళ తప్పే మొహాన్ని నువేం చేస్తావు? నే చెప్పేది నీ కర్థంకాలా?

కా: కాకేం అయిందిలే, కాని నిన్ను చూడగానే ఆవిడ మొహం వికసించిందని కురూపిని చేసుకోవటానికి ఒప్పుకున్నావా? ఏంమనిషివోయ్? అందగాడు ఎదురుగా కనిపిస్తే ఎవరిమొహమైనా వికసిస్తుంది.

రా: నువు చెప్పేదాన్నిబట్టి ప్రపంచమంతా సౌందర్యోపాసకుల్లా కనిపిస్తుంది; అందమైన భర్తలుగల ఆడవాళ్ళు పరపురుషులకేసి చూడరన్నమాట; డబ్బులేనివాడు డబ్బుగలవాడిచుట్టూ ప్రదక్షిణాలు చేసినట్టు అందవిహీనులు అందంగలవాళ్లచుట్టూ పరిభ్రమిస్తారన్నమాట; అంతేనా? నువ్వే ప్రపంచంలో ఉన్నావు, కామరాజూ.

కా: నువ్వనేదేమిటి? అందవికారంగా ఉండేవాళ్లను చేసుకునే వాళ్లే నీతిగా ఉంటారనా?

రా: కాదు. అందానికీ నీతికీ ఏమీ సంబం

ధం లేదని. (గంట వినిపిస్తుంది) అదుగో గంట మోగింది. భోంచేద్దాం పద.

2

(శివయ్య యిల్లు)

సీతమ్మ: కూచోవమ్మా శేషమ్మక్కా, కూచోవే కనకం.

శేషమ్మ: కూచు నేటందుకేదీ? కిష్ట వేణమ్మ మనవరాల్ని తోట్లో పెట్టారా, వెళ్లకపోతే బాగుండదాయె. పోనీగదా అని పోతే ఎంతకీ పోనివ్వరుగదే. ఇప్పు డింటికి పోయి కొంపలో దీపం పెట్టి వంట యాడ వాలి.

సీ: దీపాలు పెట్టేవేళకు పోవచ్చులే. వెనకం టే ఒంటరిదానివి. ఇప్పుడు కనకం కాపరాని కొచ్చిందిగా. మీ పద్ధతులకు సరి పోతుందో లేదోగాని కనకం చక్కగా వంట చేస్తుంది. దాని కన్ని పనులూ చాత వును.

శే: ఎంత చాతయినా పైన కనిపెట్టి ఉండకపోతే చెయ్యలేదు, సీతమ్మక్కా; ఏదీ నీ కోడల్ని ఎప్పుడు తెస్తావు?

సీ: ఆవిడా వస్తుంది, నేడో రేపో. కాలేజీ మూయగానే మా వాడు అత్తవారింటికే పోతాడు. అక్కడ రెండురోజు లుండి పెళ్ళాన్ని తెస్తాడు.

శే: (వైరాగ్యంగా) ఏవోనబ్బా. ఈ ప్రపంచంలో ఎవరి కెవరు రాసిపెట్టి ఉన్నారో చెప్పలేంగద. మీ రాధాకిష్టుడు అంత చక్కనివాడు, వాడికంత అనాకారి పిల్లేమిటి? రాతకాకపోతే?

సీ: ఏదో, భగవంతుడిచ్చిన అందాని కెవరేం చేస్తాం? పిల్లమటుకు చాలా నెమ్మదీ, కలుపుగోలూనూ, టానిక్కులో, పౌడో తాగి కాస్త వొళ్లు చేసిందంటే అదీ బాగానే ఉంటుంది.

శే: నువు లక్షు చెయ్యిగాక. అనాకారి అనాకారే. చిక్కటంలో, ఒలవటంలో ఏముంది. చక్కనమ్మ చిక్కినా అందమే. ఈ జన్మకి వాళ్లిద్దరికీ రాసిపెట్టుందీ!

సీ: అదీ నిజమే. ఈ కనకం పుట్టినప్పట్నుంచీ మావాడికి దీన్నిద్దామనేగా అందరమూ అనుకున్నదీ? ఇవ్వగలిగాం? దానికి మా వాడు రాసిపెట్టుంటే ఇంకోవిధంగా ఎట్లా అవుతుందీ?

కనకం: అత్తయ్యా, ఒక తెకే ఇద్దరు ముగ్గురు మగాళ్ళు రాసిపెట్టుంటే ఏమవుతుందీ?

సీ: }
శే: } (ఒక్కసారిగా) ఛా!

సీ: ఏమిటే, ఆ మాటలూ!

శే: నా కిందుకేగా దీన్నెక్కడికన్నా తీసుకురావాలంటే భయం! (గొంతు తగ్గించి) చూశావుటమ్మా, సీతమ్మక్కా... కిష్టవేణమ్మ మనవరాల్ని చూడగానే ఇదం టుందీ, అది ఎదుటింటి సీతారామయ్య లాగా ఉందిట.

సీ: (నవ్వుతూనే) ఛీ, ఛీ, ఛీ; అట్లా అనొచ్చటే, కనకం.

కన: నేనట్లా అన్లేదత్తయ్యా. పిల్ల ముక్కూ, మూతీ చూస్తుంటే ఎవరో జ్ఞాపకం వస్తున్నారని అత్తయ్యంటే, అట్లా ఉండేవాళ్లు చాలామంది ఉన్నారన్నా సీతారామయ్యకూడా అట్లాగే ఉంటుం దన్నా.

సీ: ఓసి నీపిచ్చి పాడుగానూ; ఆమాట చాలదూ?

కన: (మూతి ముడుచుకుంటూ) అది కూడా తప్పేగాంవాలు. అసలు నేను నోరు తెరిస్తేనే తప్పూ...

శే: అట్లా అనుకున్నా మా బాగే.

★ భార్యా అరూపవతీ ★

తెలిసీ తెలీని మాటలు మాట్లాడేకన్న నోరు మూసుక్కూచోవటమే మంచిదీ! చీకటి పడుతోంది. ఇంటికిపోదాం పద;

సీ : అప్పుడే పోతారుట్రా ? వచ్చి కూచున్న క్షణంనుంచీ పోతాం, పోతామంటారేవిటీ...అయితేనూ, కిష్టవేణమ్మ కోడల్ని ఎల్లుండి నీళ్ళాడుతుందనంగా చూశాను. ఎంత కళగా ఉందనుకున్నా?

శే : ఇప్పుడుమటుకు? తెల్లచీరె కట్టుకుని దేవతల్లే ఉంది. అసలు బాలింత అందం వేరులెన్నూ.

సీ : అవునా? ఈపిల్లను చేసుకోవటానికి కిష్టవేణమ్మ కొడుకు ససేమిరా ఒప్పవన్నాడు. రేపు పెళ్ళి అనంగా ఇంట్లోనుంచి లేచిపోయినాడమ్మోవ్, దబ్బున కనుక్కుని రైలు స్టేషన్నుంచి పట్టుకుతీసుకొచ్చారు. ఏడుస్తూ పీటలమీద కూచున్నాడు. పెళ్ళాం అందగత్తె కాదని వాడి బెంగ. కార్యం చేసుకోమంటే సంవత్సరం తలాయించాడు. అదీ బలవంతానే చేశారు. కార్యమైన మర్నాటినుంచీ ఆ పెళ్ళామంటే ఎంత ప్రేమ; చెప్పటానికి వీల్లేదు. నిరుడు ఈ రోజుల్లోనే కాపరానికొచ్చింది అప్పుడే పిల్ల; అదృష్టం. వచ్చే ఏటికి మా కోడలి కడుపునకూడా దేవుడి దయవల్ల ఓ నలుసుపుడితే;

శే : మీవాడు ఇష్టపడే పెళ్లిచేసుకున్నట్టున్నాడే?

సీ : అవునమ్మా, పాపం. వాడేమీ పేచీ పెట్టలేదు. వాళ్ళ నాన్న ఈ సంబంధం చూసొచ్చి వాడితో మాట్లాడారు. వాడు వెళ్లి పిల్లను చూసివచ్చాడు. చేసుకుంటానన్నాడు. అంతే, పెళ్ళి అయిపోయింది. వాడిష్టపడి చేసుకుంటే ఏవమ్మా? అందరూ పెళ్ళికూతుర్ని చూసి నవ్వినవాళ్లే. వాడి స్నేహితులుకూడా వాణ్ణి ఏడిపించారు. అందరికీ అన్ని సమాధానాలూ చెప్పాడు కాని లోపల వాడికి బాధ ఉందని నా అనుమానం.

శే : ఏం చక్కదనాలో? కొరుక్కుతింటారా? మొగుడూ పెళ్ళాం సఖ్యంగా ఉండటం ముఖ్యంగాని అందచందాలేమిటి? ఆ ఇంజనీరు చూడరాదూ? దొరల్లే ఉంటాడు. పెళ్ళాం రంభ. ఇద్దరూ మాట్లాడుకోరు. మొగుడిదారి మొగుడిదీ, పెళ్ళాందారి పెళ్ళాందీనీ. పైకి గొప్ప కుటుంబం, ఛీ, పాడూ;

సీ : అంతేలే; ఆడది మగవాణ్ణి గుణంతో జయించాలి గాని అందం దేనికి పనికొస్తుంది ? కాకపోయినా ఆడదాని అందం ఎంతకాలం నిలుస్తుంది? మా చిన్న అమ్మమ్మ ఉండేదీ, పొట్టికోతి. అయితే ఏం? మా తాత ఆవిడ కూచోమంటే కూచునేవాడు; నుంచోమంటే నుంచునేవాడు. ఆవిడ మొగుణ్ని ఎట్లా వశం చేసుకుందో ఆవిడకే తెలియాలి; వాళ్లకు పధ్నాలుగురుసంతానం.

రాధాకృష్ణ : (అవతలినుంచి) అమ్మా!

సీ : అబ్బాయ్, వచ్చావుట్రా. మీ అత్తవారింటికి పోలా?

రా : సరసుకూడా వచ్చిందమ్మా? లోపలికి పద సరసూ.

సీ : ఓరీ; ముందుగా కార్డుముక్కన్నా రాసుకోరూ? ఇంకెవరైనా వచ్చారులే నీ వెంటా?

సరస్వతి: ఎవరొస్తారత్తయ్యా? అయినా దేనికి? నాకు తోడులేదు గనకనా?

రా : ఏం, కనకం? నేను ఈ బండికి వస్తున్నానని తెలిసినట్టుగా నువ్వూ ఇక్కడే వున్నావే?

సీ : రా, సరస్వతీ. ముందా రైలుబట్టలు విడిచేసి స్నానంచెయ్యి. పద, పద.

శే : ఏవయ్యా ? ఏవంటుంది నీ భార్య?

రా : ఏవంటుందీ? పుట్టింటో ఉండనంటుంది.

శే : అంతేలే. ఆడదానికి మొగుడైనట్టు మిగిలినవాళ్ళవుతారా? మాకోడలు చూడరాదూ. ఇట్లా పేరంటానికని బయల్దేరాం. బయల్దేరిన క్షణంనుంచీ ఇంటికి పోదామనే. ఆఫీసునుంచి మొగుడు వచ్చే సమయానికి తను ఇంట్లో ఉండకపోతానని దానికిబెంగ.

రా : (వేళాకోళంగా) అది చిన్నతనంనుంచీ కూడా బెంగమనిషే.

కన : మీ ఆవిడ నాతో మాట్లాడకుండా నే వెళ్ళింది చూశావా?

రా : దానికి కొస్త అతిశయంలే; తానే అందమైనదాన్నని. (నవ్వుతాడు)

శే : ఏం నవ్వుతావులే, నాయనా? నవ్విన నాపచేనే పండిందిట. చూస్తూఉండు చివరకు అదే మంచిదనిపిస్తుంది.

రా : ఎప్పుడో అనిపించటం కాదు. ఇప్పుడే అది నాకన్న మంచిది.

శే : పోన్లే; నాయనా; నువ్వా బుద్ధిలో ఉన్నంతకాలం ఏ ఇబ్బందీ ఉండదు.

సీ : (తిరిగి వచ్చి) చూడు, శేషమ్మక్కా; మా కోడలు కూడా వచ్చిందా? ఇక నువు ఇంటికి పోయి వంటచేసుకోవటం నాకిష్టంలేదు. మారాధ వెళ్లి మీఆయన్నూ, మీ అబ్బాయినీ పిలుచుకొస్తాడు. భోంచేసి పోదురుగాని.

శే : ఎందుకులెస్తూ? మళ్ళీ రావూ?

సీ : అట్లా కాదులే. నీకన్న పెద్దదాన్ని. ఈసారికి నే చెప్పినట్టు విను.

శే : (కొంచెం మెత్తబడుతూ) ఏవే కనకం?

కన : నీయిష్టం అత్తయ్యా.

సీ : ఇంకెవరి ఇష్టమూ లేదు. ఈ పూట భోంచేసి మరీ వెళ్లాలిసిందే. ఒరే అబ్బాయ్. నువు శేషమ్మక్కగారింటికి పోయి మగవాళ్లను భోజనానికి పిలిచిరా.

శే : ఎందుకులే. నే నెట్లాగూ ఇంటికి పోయిరావాలి. వాళ్లను నేనే పిలుచుకొస్తా. ఇప్పుడే రైలు దిగాడు, స్నానమన్నా చెయ్యలేదాయె. ఏవే కనకం? నువు కూడా వస్తావా?

సీ : సరేలే; మీ [illegible]



రాళ్ళం? అది ఇక్కడే ఉంటుందిలే. తొందరపనుంటే వెళ్ళి వెంటనే వాళ్ళను తీసుకురా!

శే: సరే, నే వెళుతున్నా. నువ్వుండవే కనకం.

సీ: నే వెళ్ళి పొయ్యి రాజేస్తా. కొస్త దీపాలు వెలిగిస్తావుటే; కనకం?

కన: అట్లాగే అత్తయ్యా. సిగిరెట్లు అల వాటు చేసుకున్నారా, బావగారూ?

రా: ఏం? అత్తగారూ, మొగుడూ లేకుండా చూసి ఒకటి తగలేద్దామనా? వాళ్లు రానీ చెబుతా.

కన: చెప్పకో నాకేం భయంలేదు. నిప్పెట్టుంటే ఇట్లా పారెయ్యి. దీపం వెలిగించాలి.

★ భార్యా రూపవతి ★

రా : ఈభాగ్యానికేనా ? - (నిప్పుపెట్టె గలగల్లాడించి) - ఇంద.

కన : నీకూడా అబ్బిందిగదా ఈదిక్కుమాలిన సిగిరెట్ల అలవాటూ?

రా : ఏం? మీ ఆయనకూడా కాలుస్తాడా?

కన : అది లేకపోతే ఎట్లా? డబ్బుకు డబ్బుదండగా...

రాధా: అయితే నీకిట్లాంటి వేమీ గిట్టవన్న మాట మరయితే; అతనితో కాపురం ఎలా చేస్తున్నావ్!

కన : పో, బావా!

రా : లేకపోతే మా పరుసునడుగు; సిగరెట్లు కాల్చేవాడితో కాపురం ఎలా చెయ్యాలో చెబుతుంది.

కన : ఏమీ అక్కరలేదు. నాకు సిగ్గు లేకపోతే ఆవిడకుండదా ఏం? కాదుగాని బావా, ఒకటడుగుతాను కోప్పడకుండా చెబుతావ్? చేసుకోవాలంటే ఇంతకంటె అందగత్తె దొరకలా?

రాధా : ఏదీ? నీబోటిఅందగత్తెలను మేం ఆనకపోతిమి! మానాన్న గాతికిపోయినాడని తెలియగానే మీనాన్న -

కన : నామాట కేమిట్లే? ప్రపంచంలో నేనూ మీ ఆవిడాఉన్నామా? ఇంకెవ్వరూ లేరా?

రా : చూడు, కనకం. నేను బీదవాణ్ణి కనక నామాట కేమిట్లే అంటున్నావు. మిగిలినవాళ్ళది మాత్రం అంతేగద; ఏమరూపో, నన్ను చూసి ఇషపడి చేసుకున్నదీ! నేనంటే లోపల ఎంతో గర్వపడుతుందీ! నాకేం లోటూ?

కన : లోటా? లోటా - (గొంతుతగ్గించి) ఎవరో వస్తున్నట్టున్నారు - (నిప్పు పుల్ల గీస్తుంది)

రా : ఎవరూ లేరు. ఏమిటో అనబోయావు?

కన : నీకు నిజంగా నన్ను చేసుకోవాలని ఉండేదా?

రా : ఒకవేళ ఉంటే ఏమయేది?

కన : ఏమయేదా? మావాళ్లు ఒప్పకపోతే నీతో లేచిపోయి అయినాసరే మద్రాసు వచ్చేదాన్ని. తరవాత పెళ్ళి దానంతట అదే అయేది.

రా : ఇప్పుడంతా మించిపోయింది గనక ఏదైనా చేసి ఉండేదాన్నని అనుకుంటావు. నిజంగా చెయ్యవలిసొస్తే చేసి ఉండేదానివి కావు. అంతసాహసం నీలో లేదు. నువ్వసలు పిరికిదానివీ, నిబ్బరంలేనిదానివీనూ అయినా నిన్ను చేసుకుందామని నా కెన్నడూ బుద్ధి పోలేదు.

కన: ఇంతమాత్రాన నాకేం లోటు లేదులే.

రా : లోటు, లేదని ఇప్పుడంటున్నావు గాని, ఇందాక నువు మాట్లాడిన మాటలు వింటే నీ జీవితంలో ఏదో లోటున్నట్టే అనిపించింది.

కన: నీలోటు గురించి విచారించా. అంతే.

రా : నాకేమీ లోటులేదు. నేను వెళ్లి స్నానంచేసి వస్తా.

కన : వెళ్ళిరా, వెళ్ళిరా;

రా : నా నిప్పెట్టె నాకిచ్చెయ్యి.

కన : ఇంద, తీసుకో (గట్టిగా అతని చేతిలో కొడుతుంది.)

(గుస గుసలు)

మం : "ఆ సీతమ్మకోడలు పరమ అనాకారిటగా ?"

రా : కట్నంకోసం గడ్డితిని చేశారు...

మం : సీతమ్మ కొడుకు అందంగా ఉంటాట్ట.

రా : అల్లాగా? అయితే వాడు దాంతో కాపరం చెయ్యకేం ?

మం : ఇదేనా నీకు తెలిసిందీ? ఆకోతంటే వాడికి వల్లమాలిన ఇష్టం.

రా : పాపం, ఇంకో ఆడదాని మొహం ఎరగడేమో...

మం : బాగా చెప్పావ్ !... ఏదన్నా వశీకరణమంత్రం వేసినా వేసిఉండొచ్చు..

రా : ఈమంత్రాలేవీ ఆగవులే. ఎప్పుడో వాడు వీటన్నిటినీ తెంచుకుని దేశంమీద పడతాడు.

మం : వాడంతట వాడు పడకపోతే వాణ్ణి ఎవరో ఒకరు పడేస్తారు...

రా : ఎవరో దాకా ఎందుకూ ? వాడి మేనమామకూతురు కనకం లేదూ ? అసలు దాని బుద్ధి మంచిదికాదు.

మం : అవున...వీడు రెండురోజులకొకసారి వాళ్లింటికి పోతూనే ఉంటాడు.

రా : అయినా ఎవరెట్లా చస్తే మనకేం ?

మం : అంతేలే. కాకపోతే ఏఁవిటి ?

(శివయ్య యిల్లు)

శి : ఒరే అబ్బాయ్...

రా : ఏఁవిటి, నాన్నా !

శి : నీతో ఒక్క విషయం మాట్లాడాలి. ఇట్లా వచ్చికూచో: పెద్దవాణ్ణి, తెలుసుకోవలసిన విషయం. నువ్వూ, నీపెళ్ళాం సఖ్యతగా ఉంటున్నారా ?

రా: లేకేం, నాన్నా? నన్నది దేవుడల్లే చూస్తుంది. నేను దాన్ని దేవతల్లే చూస్తాను

శి: నిన్నది దేవుడల్లే చూడటంవల్ల ఆటే నష్టంలేదు. నువు దాన్ని చివరల్లా దేవతల్లే చూడదలిస్తేనే చూడు. నెత్తిమీద ఎక్కించుకున్నట్టు ఎక్కించుకుని ఒక్కసారిగా కిందికి తొయ్యకు. నేను పాతకాలపువాణ్ణని నువ్వు అనొచ్చు - కాని మొగుడు పెళ్ళానికి తన ఆపేక్షను కొంచెం తగ్గించి చూపించటంవల్ల నష్టంలేదు. పిసినిగొట్టల్లే కొంత దాచుకో. ఎప్పటికైనా అవసరం వస్తుంది దానితో.

రా: ఎప్పటి మాటో కాదు, నాన్నా. ఇప్పుడే అవసరం ఉంది. మా పెళ్ళివల్ల నాకన్న దానికి ఎక్కువచిక్కున్నట్టు కనిపిస్తోంది.

శి: ఉంటే ఆపేక్ష చూపించుకో. కాని తరుచు ఆ కనకం అత్తవారింటికి దేనికి వెళ్ళొస్తావ్ ?

రా: ఆ శేషమ్మ, కొడుకూ చంపుకు తింటారు. ఒకరోజు రాకపోతే కనిపించటం లేదేమంటారు. కనకం సరే సరి. దాని అందంచూసి నేను మూర్ఛపోవాలని దాని ఆశ.

శి: దాని బుద్ధి మంచిదికాదు. కాపరానికి పోకముందే ఎవరో స్కూలు మేష్టరుకు ఉత్తరం రాసింది. తండ్రి చచ్చేట్టు కొట్టాడు.

రా: నే నట్లా బయటికి వెళ్ళొస్తా, నాన్నా.

శి: వెళ్ళిరా.

రా: (నడుస్తూ...స్వగతం) నాన్న ఏదో బాధపడుతున్నాడు. నేను పరుసును ఆపేక్షగా చూడటం ఆయనకే ఎబ్బెట్టుగా ఉంది. ఇక ఇతరుల కెట్లా ఉండాలి? పరుసు అనాకారి కావటం నన్నుగదా బాధించవలిసింది? వీళ్ళందరూ బాధపడతారు; దేనికీ? నాకు లేనిబాధ వీళ్ళకేం? లేక నాబాధే వీరందరిలోనూ ప్రతిబింబించి నాకు కనిపిస్తోందా? అసంభవం. లోకంలో ఎంతమంది పెళ్లాల్ని చూస్తున్నాను కాను. పరుసులాంటి భార్యలు ఎందరుంటారు? ఈ కనకంలాటి భార్య ఉంటేనేం, లేకపోతేనేం? తుచ్ఛురాలు ఆడకుక్క; దాని మొగుడో తేభ్యం. నా పెళ్లాం కన్న తన పెళ్లాం అందగత్తె అన్న సంగతి నేను చూసి ఏడవాలని వాడి ఆశ. కనకం చక్కదనం మూలంగానైనా నాకన్న తాను గొప్పవాణ్ణనిపించుకుందామని; చవట కుంక; తను క్షణం వీపు తిప్పితే అది నా చెయ్యి గిల్లే సంగతి వాడెరగడు;...కనకం బుద్ధి మంచిది కాదని నాన్న నాతో ఎందుకన్నట్టూ?

కనకానికీ నాకు ఏమి సంబంధం? నన్నేం చెయ్యమని? ఏమో! ఆయన ఉద్దేశం ఏదైనా కావచ్చు. నా జీవితానికీ కనకం సముద్రంలో కాకిరెట్ట......వీళ్ళింటికే వచ్చానా?

కన: ఏం బావా? ఈ వేళప్పుడొచ్చావు?

రా: మీ ఆయనున్నాడేమో.

కన: ఈవేళప్పుడుండడని నీకు తెలీనట్టు!

రా: ఇంకెవరున్నారు?

కన: ఎవ్వరూ లేరు. నువేం తక్కువవాడివా? ఏం, అయిన సమయానే వచ్చావు

రా: నాకోసమని ఎదురుచూస్తున్నట్టు మాట్లాడుతున్నావే?

కన: అబ్బో, నువ్వెక్కడ? అంత అపేక్షగల పెళ్ళాన్ని పెట్టుకుని నువ్వెవరికేసీ చూడవే; నిప్పెట్టుంటే ఇయ్యి దీపం వెలిగించాలి. చీకటి పడుతోంది

రా: పడనీ నాయుడు బావ చెప్పినట్టు, చీకట్లో చూడాలి నీకళ్లతళుకు...వెలుగులో నీమీద నిలవలేనే మనసు – ఆరిపేయవే దీపమూ!

కన: ముందర దీపం వెలిగించనీ తరవాత ఆర్పేద్దాం.

రా: అయితే నిప్పెట్టె ఇదిగో (నిప్పెట్టె అడిస్తాడు)

కన: ఇట్లా పడెయ్యి.

రా. దమ్ముంటే ఇట్లా వచ్చి తీసుకో.

కన: ఏం భయమనుకున్నావా?.. ఏమిటిది, బావా? చెయ్యొదులు

రా: వదలకపోతే?.....నన్నెన్నిసార్లు గిల్లావు కావు?

కన: అది వరసలాట్టం.

రా: ఇదీ అంతే అనుకోరాదూ?

కన: నీకిది అలవాటు లేదుగా?

రా: ఎవరన్నారూ?...అలవాటు చేసుకుంటూ తప్పేం?

కన: నీకిటువంటి పనులు గిటవనుకున్నానే. (అకస్మాత్తుగా గొంతెత్తి అరుస్తూ) ఏమిటది? చెయ్యి వదలమంటూంటే! ఇంట్లో ఎవరూ లేకుండా ఇదా నువు చేసే పని?

శే: కనకం, ఎవరే అదీ?...ఎవరే ఆ వెళ్ళిపోయ్యేదీ?

కన: (ఏడుపు గొంతుతో) ఇంకెవరత్తయ్యా? మా సీతమ్మత్తయ్య కొడుకు. దీపం వెలిగిద్దామని నిప్పెట్టె ఇమ్మంటే ఇచ్చేటట్టుగా దగ్గరికొచ్చి చెయ్యి పట్టుకున్నాడు. ఇవాళ లేచి ఎవరి మొహం చూశానో!

శే: వీడికి పుంతు బుట్టా! ఇందుకేనా రోజూ వస్తాడూ? డబ్బుకు గడ్డితిని కురూపి ముండను కట్టుకోవటమేం? ఊళ్ళోవాళ్ల కొంపలమీద పడటమేం? నే వెళ్లి ఆ సీతమ్మను నాలుగూ అడిగొస్తానుండు.

కన: (ఏడుపు తమాయించుకుంటూ) పోనివ్వండత్తయ్యా. మీ రెవరూ లేకుండా నే నింట్లోకి రానివ్వటమే పొరపాటూ. మేనత్తకొడుకు గదా అని చనువుగా ఉంటే ఇంత పనయింది.

శే: ఈసారి ఇంట్లో అడుగు పెట్టనీ మీ మామయ్యతో చెప్పి కాళ్లు విరగ్గొట్టిస్తా. నే నిప్పుడే వస్తా...ఇల్లు జాగర్త.

5

[శివయ్య ఇల్లు]

సీ: అమ్మో! ఆ శేషమ్మొచ్చి ఎంతెంత మాటలన్నదనుకున్నారు! నాకు తలకొట్టేసినట్టయింది వీడు మొదటినుంచీ ఆ కనకం పేరు చెబితే నే మండిపడేవాడు గదా, వీడికి దాంతో ఎందుకంట?

శివయ్య: అది బుద్ధిమంతురాలనా? అయినా వీడసలు వాళ్లింటికి దేనికి? నేను సాయంకాలం కూడా చెప్పా. నాతో మాట్లాడుతూనే వాడక్కడికి పోయుండాలి

సీ: ఆ శేషమ్మ మనవాణ్ణి తిట్టి ఊరుకుందా? సరస్వతినికూడా తిట్టింది. డబ్బుకోసం మనం వాడికి కోతినిచ్చి చేశాంట. వాడేమో, అందరి కొంపలు తీస్తున్నాట్ట. సరస్వతి, పాపం ఇందాకటినుంచీ కంటికీ, మింటికీ ఏకధారగా ఏడుస్తోంది

శివ: అహోరించినట్టుంది. వాడింకా ఇంటికి రాలేదుగా?

సీ: లా, ఎటువెళ్ళాడో ఏమో.

శివ: వాడితో నేను మాట్లాడతాలే. నువు దాన్ని సముదాయించు.

సీ. అదుగో! వాడేనల్లే ఉంది. మీకు పుణ్యం ఉంటుంది. వాడితో పెద్దగా మాట్లాడకండి.

శివ. నువు పద. ఏంరా? నే చెబుతూనే ఉంటినిగదా, ఆ శేషమ్మగారింటి కెందుకెళ్ళావ్?

రాధా: ఏం? ఫిర్యాదు చేశారా?

శివ. చెయ్యరూ? వెధవపనులు చేస్తేనూ? శేషమ్మొచ్చి అందర్నీ శాపనార్థాలు పెట్టిపోయిందిట.

రా: ఎంత సాహసం; ఆ కనకం నోరు మూసుకుంటుందనుకున్నానే;

శివ: అది నోరు మూసుకోవటమేమిటి? నువొచ్చి దాని చెయ్యి పట్టుకున్నావని అదే అత్తగారితో ఫిర్యాదు చేసిందిట. ఎవరూ లేని సమయంలో నన్నింట్లోకి రానివ్వటం తనదే పొరపాటయిందన్నదిట!

హాస్పిటల్లో తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న రోగి ఆదుర్దాగా డాక్టరు నడిగాడు.

"డాక్టర్! నేను బతికే యోగమన్నా వుందా?"

"ఓ మీకేం భయం లేదు. తప్పకుండా బతుకుతారు. ఈ రోగం వచ్చిన వాళ్లలో ప్రతిపదిమందికి తొమ్మిదిమంది తప్పకుండా చనిపోతారని లెక్కలు తెలుపుతున్నాయి. ఇప్పటికి నా చేతులో తొమ్మిది మంది దాటిపోయారు. మీరు పదోవారు గనుక నిస్సందేహముగా బతుకుతారు."

రా: నన్ను చాటుగా ఇన్ని రోజుల నుంచి గిల్లుతున్న మాట చెప్పలేదన్న మాట; అవకాశం చిక్కినా నేను తనమీద పడనందుకు నన్ను చాతగాని వాడికింద కట్టేసి మాట్లాడిన సంగతీ చెప్పలేదన్న మాట.

శి: ఇవన్నీ నిజమైతే మాత్రం ఎవరు నమ్ముతార్రా?

రా: ఇదంతా నే నందరికీ దండోరా వెయ్యబోతున్నానా?

శి: నువ్వసలు అక్కడికి పోవటం దేనికిరా?

రా: అది పొరపాటే, నాన్నా...నా మనస్సు గాడిలో నడవకుండా ఉంది.

శి: పోయి నీ పెళ్ళాన్ని ఓదార్చు. శేషమ్మ దాన్నికూడా నానా మాటలూ అందిట.

రా: (మండిపడి) దాన్నేమన్నది? ఎందుకనాలిసొచ్చింది?

శి. అనాకారి పెళ్ళాన్ని చేసుకుని నువు ఊళ్ళోవాళ్ళ కాపురాలు తీసేస్తున్నావుట.

రా: (పళ్ళు బిగబట్టి) ఆ శేషమ్మ కుళ్లు తోడేస్తాను. నిజంగానే ఆ కనకం కాపరం తీసేస్తాను. ఇది నెల రోజుల్నించి ఆడే నాటకమంతా బయట పెట్టేస్తాను

సర: (వెనకనుంచి, ఏడుపు గొంతుతో) ఏవండీ? మాట;

రా: (మృదువుగా) ఏం, సరసూ?

సర: ఎక్కడికి పోతున్నారు?

రా: మళ్ళీ ఇప్పుడే వస్తాను.

సర: వొద్దు వచ్చెయండి. వెళితే నామీద వొట్టే.

రా: నీకు తెలీదు, సరుసూ...

సర: నా కంతా తెలుసు. మీరు లోపలికి వచ్చెయ్యండి.

రా: ఆ ముండ నన్నంటే అన్నది. నిన్నెందుకనాలి? దానికే మధికారం ఉంది?

సర: నన్నంటే నాకేం బాధలేదులెండి.

రా: నీకు లేకపోతే నాకుంది;

సర: నా కంతేచాలు, లోపలికి రండి.

రా: నేను మంచివాణ్ణని కాదు, సరుసూ; కాని ఈ కనకం విషయం ఇట్లా నడిమయాన విడవటం నాకు బాగాలేదు.

సర: ఆ కనకం పోకడలన్నీ నేను ఇన్నాళ్ళూ చూస్తూనే ఉన్నాను. ఒక ఆడదాని సంగతి ఇంకో ఆడదానికి తెలియటాని కెంతకావాలి. మీ కావిడమీద ఇష్టమేమోనని నోరు కట్టేసుకున్నాను. ఒకప్పుడు మీకు ఇద్దామనుకున్న మనిషికూడా ఆయెను.

రా: కనకమంటే నా కిష్టమా? నా కాలిగోరుమీద ఉండే ఆపేక్షకూడా నాకు దానిమీద లేదు.

సర: అందుకనే ఇంతటితో పోనివ్వండి. లోపలికి రండి; నామాట వినండి.

6
(హాస్టల్)

రాధాకృష్ణ: ఏం కామరాజూ? నాకన్న ముందే వచ్చేసినట్టున్నావే? ఇంటిదగ్గిర తోచలేదాయేం?

కామ: తోచటమేమిటి? ఇంటినుంచి పారిపోయి వచ్చాను.

రా: ఏం?

కా: అదంతా చాలా గ్రంథం ఉందిలే. నీకు శలవులు కులాసాగా గడిచాయా?

రా: అదేకులాసా. చిన్న అపవాదొకటి మీద వేసుకుని మరీ వచ్చాను.

కా: కొంపతీసి ఆడదానిగొడవేనా?

రా: ఏం అట్లా అడిగావ్?

కా: మరేంలేదు. నేనూ ఒక చిన్న పాడుపని చేశాలే.

రా: నేను చేసినంత పాడుపని అయుండదు. ఏంచేశావ్?

కా: ఏంచేశానని చెప్పను? ఒక పిల్లకు ఉత్తరం రాశాను.

రా: ఏం జరిగింది?

కా: ఏం జరుగుతుంది? ఆ ఉత్తరం తీసుకుపోయి వాళ్ళనాన్నకి చూపించింది:

రా: ఓరి నీ ఖర్మకాలా! అంత మనసు తెలుసుకోని పని చేశావా?

కా: నన్నేం చెయ్యమంటావు, రాధా? నాకెంత ప్రోత్సాహం ఇచ్చిందో నువ్వూహించలేవు. ఆడవాళ్లెందుకుచేస్తారీపనులు? నాకర్థం కావటం లేదు. నీకు తెలిస్తే కాస్త చెప్పూ.

రా: నువు ఆ మనిషినిగురించి అపోహపడ్డావు. ఎవరేం చేస్తారు?

కా: నేను అపోహపడ్డానే అనుకో. నేను రాసిన ఉత్తరం తీసుకుపోయి వాళ్ళనాన్నకి చూపించకపోతేనేం? చించి అవతల పారేస్తే సరిపోలా? నన్ను అంతగా ప్రోత్సహించిన మనిషి నా అవమానంచూసి సంతోషించాలని అంత ఉబలాటమేం?

రా: అదంతా ఉబలాటంకాకపోవచ్చు. "నేనెంత పతివ్రతనో చూడు" అని అందరికీ చెప్పుకునేటందుకు నువు, మంచి అవకాశం ఇచ్చావు? జారవిడవలేకపోయింది.

కా: ఆడదాని పాతివ్రత్యాని కింత విలవా? నాకు ఏ రైలుకిందనన్నా పడదామనిపించింది. ఎవరి మొహమూ చూడలేకపోయాను. ఇంటినుంచి పారిపోయి వచ్చానంటే నమ్మ. ఈగాయాన్ని కాలం మాన్పవలిసిందే. పైగా ఏమిటో తెలుసా? ఆ మనిషిని నేను నిజంగా ప్రేమించాను. ఆమె నాకళ్ళకి దేవతల్లే కనిపించింది. ఆమెను తలుచుకున్నప్పుడల్లా నాలో ఎన్నడూ లేని సద్భావాలన్నీ కలిగేవి. ఇందుకే కాబోలు కవులంతా ప్రేమను ఘనంగా పొగిడారనికూడా అనుకున్నాను. ఫలితం చూడు!

రా: నీబాధ నాకర్థమయింది. నాలో లేంది నీలో ఇంకోటి కూడా ఉందన్నమాట—అంతరాత్మ.

కా: నీకు మాత్రం అంతరాత్మ లేదా ఏం?

రా: ఉందిగాని నీకున్నటువంటిది కాదు. నువు చేసినటువంటి పనే నేనూ చేశాను. నాకు అవమానం జరిగింది. కాని నేను తలవొంచలేదు. ఎవరి మొహం చూడటానికీ నాకు సిగ్గనిపించలేదు. నాకల్లా ఒకటే బాధకలిగింది. అదేమిటంటే నా భార్యనుగురించి, నేనదివరకే నీతో చెప్పాను. నా భార్య అందకత్తెకాదు. దాని అనాకారితనానికి ఇతరులనుంచి దాన్ని రక్షించటానికి బదులు ఇతరులను శిక్షించనిచ్చాను. అనాకారి పెళ్లాన్ని చేసుకుని ఇతరుల అందంకోసం ఎగబడుతున్నావన్నారు—తుమ్మలు;


కా: నే చేసిన తప్పే నువూ చెయ్యటం చిత్రంగా ఉంది. నేనంటే ప్రపంచజ్ఞానం లేనివాణ్ణి, ఇమేజినేషన్ లేనివాణ్ణి, పొరపాటుపడ్డాను. నువెల్లా పొరపడ్డావోయ్?

రా: నేను పొరపళ్లేదే! నన్ను పరాభవించిన మనిషి నాకు క్షమాపణ ఇచ్చింది, పరిహారం ఇస్తానన్నది. నేను సమాధానం కూడా చెప్పలేదు.

కా: భలేవాడివి. ఆ మనిషి అందగత్తేనా?

రా: ఆ!

కా: నువేం మనిషివో నాకర్థం కావటంలేదు... ★



35

ఎమరాల్డా కిటికీలోకి చూసింది. గ్విర్లాను గుర్తుపట్టి భయ కంపితురాలయింది. ఆమె పట్టునుంచి విడిపించుకోడానికి గటిగా పెనగులాడింది. కాని ఆ వృద్ధురాలి గుప్పిట విడిపించుకోలేకపోయింది. ఎముకలవలెనున్న ఆమె వ్రేళ్లు ఎమరాల్డా మణికట్టులపై ఎర్రని వాతలు పెడుతున్నాయి. గోడయే చేతులు చాచి జిప్సీని బంధించినట్లుంది.

కొంతసేపు పెనగులాడి అలసి ఎమరాల్డా గోడకు చేరబడిపోయింది. మృత్యుభయం ఆమె నావహించింది. జీవితంలోని మాధుర్యం, ఆనందం, యవ్వనం, సూర్యకాంతి, ప్రేమ, ఫీబస్ అంతా ఆమె మనఃపథంలో గిరగిర తిరగనారంభించింది. తరువాత మతాధికారి, ఉరి స్తంభం, మృత్యువు జ్ఞప్తికి వచ్చాయి.

మళ్లీ వికటాట్టహాసం వినవచ్చింది. యువతికి భీతితో శరీరమంతా గగుర్పొడిచింది. మెల్లిగా తలెత్తి వృద్ధురాలివంక చూసింది. "నేను నీకేమపకారం చేశాను?" అని దీనంగా ప్రార్థించింది.

"జిప్సి! జిప్సీ" అని మాత్రం వృద్ధురాలు గొణిగింది. తరవాత ఇలా అంది. "ఏమపకారమా? చెప్తా విను. నాకో ముద్దుల కూతురుండేది పసిబిడ్డ. బంగారుబొమ్మ. నా బిడ్డని అపహరించారు. కిరాతకులు నాబిడ్డని చంపి తినేశారు. ఏమపకారమని అడుగుతావేమిటి?"

కట్టు కథలో మేకపిల్ల తోడేలుతో అన్నట్లంది ఎమరాల్డా "అప్పటికి నేను పుట్టనేలేదేమో!"

"పుట్టే వుంటావు" అంది సిస్టర్ గ్విర్లా. "అప్పుడు ఆ గుంపులో నువ్వూ ఉండిఉంటావు. సరిగ్గా నీయీడే ఉంటుంది. పదిహేనేళ్ళయింది అపహరించి పదిహేనేళ్లనించి నేను క్రుంగిపోతున్నాను. పదిహేనేళ్లుగా భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. పదిహేనేళ్లుగా నాతల ఈ గోడలకేసి కొట్టుకుంటున్నాను. నాబిడ్డని అపహరించి చంపి తినేశారు జిప్సీలు. అసలు నీకు హృదయం అనేది ఉందా? నీబిడ్డే అనుకో! ఆలోచించు అదెంతఘోరమో! అప్పుడు నాబిడ్డని చంపుకుతిన్నారు. ఇప్పుడు జిప్సీలబిడ్డని నేను చంపిస్తాను. చచ్చిపోతుంటే కళ్లారా చూస్తాను పాపం! ఈయ్యాలలో ఆదమరిచి నిద్రపోతోంటే లేపనైనా లేపలేదు. ఎత్తుకుపోయారు. నేనక్కడ లేను. ఇప్పుడు రమ్మను నీ జిప్సీలని. నువ్వు చచ్చినతరవాత నిన్ను వండుకుతినమను." ఆమె వెర్రిగా నవ్వడం మొదలు పెట్టింది.

అప్పటికి తూర్పు తెల్లవారుతోంది. మసకవెలుగులు వ్యాపిస్తున్నాయి.

ఎమరాల్డా ప్రార్థించింది. "అమ్మా! నన్ను దయగాడు. వాళ్లు వస్తున్నారు. నేను నీకెప్పుడూ ఎటువంటి అపకారమూ చెయ్యలేదు. నన్ను వొదిలి పెట్టు."

"నా బిడ్డని నాకియ్యి."

"నన్నొదిలి పెట్టు."

"నా బిడ్డని నాకియ్యి."

ఎమరాల్డాకి ఆశ అంతరించింది. గోడపై తలవాల్చి నిలబడింది.

"ఏం చెయ్యను? నువ్వు నీబిడ్డకోసం అల్లాడుతున్నావు. నేను నా తలిదండ్రుల్ని వెతుక్కుంటున్నాను."

"ఇదిగో ఇటు చూడు" అంది గ్విర్లా. ఎమరాల్డా అటు చూసింది. నేలవంక చూపుతూ గ్విర్లా అంది "ఆ బుల్లి ముఖమల్ చెప్పు నాబిడ్డది. నాకు మిగిలింది అదొక్కటే...దాని జత చెప్పు

మూలం :
విక్టర్ హ్యూగో

అనువాదం :
సూరంపూడి సీతారామ్

★ ఘంటారావం ★

ఎక్కడుందో తెలుసా? తెలిస్తే చెప్పు. ఎక్కడున్నా సరే వెళ్ళి తెచ్చుకుంటాను."

అప్పటికి వెలుగు తెల్లనయింది. కూపంలో ఒక మూల చెప్పు చూసింది ఎమరాల్డా. ఉలిక్కిపడి మరొకమారు చూసింది. "ఏదీ! చూడనీ" అంది. "ఆగు! ఒక చెయ్యి వొదులు."

గ్విర్లా ఒక చెయ్యి వొదిలింది. ఎమరాల్డా మెడవెనుక వ్రేలాడుతున్న సంచి తీసింది. అందులో రెండో చెప్పు తీసింది.

గ్విర్లా ఆనందాతిరేకంతో అరిచింది. "నా బిడ్డ! ఏగ్నెస్! ఏదీ" అంటూ గ్విర్లా ఒక చేత్తో ఆ చెప్పు అందుకుంది. రెప్పపాటులో పోల్చిచూసుకుంది. కిటికీ ఊచలలో ముఖం పెట్టి అంది "నా బిడ్డా! ఏదీ నీముఖం చూడనీ" అంది.

"అమ్మా! నువ్వేనా!" అంది ఎమరాల్డా.

"అయ్యో! ఎంత ప్రారబ్ధం. ఇదుగో నాబిడ్డ. కాని నిన్ను నా ఒడిలోకి తీసుకోలేనుకదా!" అని బిగ్గరగా విలపించింది. ఎమరాల్డా ముందుకు వచ్చింది. ఇద్దరూ కిటికీకి ఇరుప్రక్కలనుండే చేతులతో ఆలింగనం చేసుకున్నారు. తల్లి బిడ్డను నొసటిపై ముద్దు పెట్టుకుంది.

ఉన్నట్టుండి యువతిని విడిచిపెట్టి తల్లి కిటికీఊచలు పట్టుకుని ఊగిసలాడించింది. కాని అవి చలించలేదు. తన కూపం లోపలికి వెళ్ళి విడిఉన్న ఒక నాపరాయి తీసుకువచ్చింది. నాలుగైదు దెబ్బలతో ఊచలు పక్కపక్కలకు వంగాయి. ఎమరాల్డా కిటికీ ఊచలసందునుంచి లోపలికి వెళ్ళింది. తల్లి తన బిడ్డను గాఢ పరిష్వంగంలో బంధించింది. తరవాత పసిబిడ్డ నెత్తుకున్నట్లు ఆ యువతిని చేతులపై ఎత్తుకుని ముద్దులు పెట్టుకుంటూ ఏడ్వసాగింది. "నా బిడ్డ దొరికింది. ఇదుగో నా బిడ్డ! భగవంతుడు నా ప్రార్థన విన్నాడు. నా బిడ్డని జిప్సీలు తినెయ్యలేదు. జిప్సీలు నిజంగా దేవతలు..." అంటూ ప్రలాపించసాగింది. కూతురు పాదాలు చేతులు వీపు కన్నులు ఒళ్ళంతా ముద్దులతో నింపివేసింది. యువతి వలిగిపోతున్నా ఆనందంతో "అమ్మ" అంది.

"మళ్ళీ అను. ఆగు. మనం ఇక్కడనించి వెళ్ళిపోవాలి. మన వూరు వెళ్ళిపోదాం. మనవూళ్లో ఒక ఇల్లుకట్టుకుని మనిద్దరం ఒకే పక్కలో పడుకుని..." ఈ విధంగా ఊహాలల్లుకుని ప్రలాపించింది. ఈ సమాగమంలో ఇద్దరూ పరిసరాలనే మరిచిపోయారు. ఉన్నట్టుండి గుర్రాల డెక్కల చప్పుళ్లు విని ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. అప్పుడు యువతికి తెలివివచ్చింది. "అమ్మా" అంటూ భీతితో తల్లిని కౌగలించుకుంది. "అమ్మ పోలీసు లొస్తున్నారు."

"అమ్మో! మరిచిపోయాను. నీకోసం వెతుకుతున్నారు. నువ్వు ఏం నేరంచేశావు?"

"నేరమేమిటో తెలియదమ్మా! కాని నాకు ఉరిశిక్ష వేశారు."

"ఉరిశిక్షే!" అంటూ తల్లి స్తంభించిపోయింది.

"అవును. నన్ను పట్టుకుని ఉరితీస్తారు. నన్ను తీసుకుపోడానికి వస్తున్నారు. నన్ను రక్షించమ్మా!"

కొంతసేపు నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. తరవాత తేరుకుంది "లేదు లేదు. పొరపాటు. పదిహేనేళ్లు తపించి తపించి నిన్ను కనుక్కున్నాను. ఇప్పుడు ఒక్కక్షణం నిన్ను విడిచిపెట్టను. దేవు డింత నిర్దయుడు కాడు.—"

గుర్రాల డెక్కల చప్పుళ్లు ఆగాయి. తల్లి కిటికీలోనుంచి చూసి గబుక్కున తల లోపలికి లాక్కుంది. "ఆమూల దాక్కో. వాళ్ళకి కనపడవు. నడు" అంటూ ఎమరాల్డాని ఒక మూల గోడ కొదిగి నిలబెట్టింది. "ఊపిరైనా విడవకు" ఆమె గదిలో అటూ ఇటూ పిచ్చెత్తినట్లు జుట్టు పీక్కుంటూ తిరుగ నారంభించింది.

ట్రైటన్ క్లాడ్ గొంతుక వినవచ్చింది. "ఇటు! ఇక్కడ! ఇలా రండి ఫీబస్" అంటున్నాడు.

ఫబస్ పేరు వినేసరికి ఎమరాల్డా కదిలింది.

"కదలకు కదలకు" అంది తల్లి.

కిటికీవద్ద మనుష్యుల మాటలు వినవచ్చాయి. తల్లి కిటికీవద్దకు వెళ్ళి అడ్డుగా నిలబడింది. వీధి అంతా అశ్వికులు నిండిఉన్నారు. ఒక సైనికాధికారి ఆమెముందుకు వచ్చి అన్నాడు. "మీ కొక జిప్సీ యువతిని ఒప్పగించారట. ఎక్కడ?"

"మీరు చెప్తున్న దేమిటో తెలియడంలేదు."

"బలే! ఆ ముసిలాడు మన్ని బోల్తాకొట్టించినట్టున్నాడే" అన్నాడొకడు.

"ఏడి?"

"లేడే! జారుకున్నాడు."

"నిజం చెప్పు. నీకోయువతి నెవరో ఒప్పగించారు. నిజమేనా?"

"ఓ! అదా!" అంది తల్లి. "అవును. ఒక యువతిని నన్ను ఎవడో వచ్చి పట్టుకోమన్నాడు. పట్టుకుంటే అది నా చెయ్యి కరిచి పారిపోయింది"

"అబద్ధం చెప్పకు. నేనెవ్వరో తెలుసా?"

"ఎవ్వరైనా నాకొకటే నేను చెప్పింది నిజం."

"అయితే తప్పించుకుందన్నమాట! ఏపక్కకి పారిపోయింది?"

"ఆవీధిలో వెళ్ళింది."

"నడవండి వెనక్కి" అన్నాడు ఫీబస్.

"ఆగండి. ఆ ఊచలల్లా ఎందుకు వంగిపోయాయి?"

"అవెప్పుడూ అంతే."

"అరె! దానిముఖం మాడు. కంగారుపడిపోతోంది ఎందుకు?"

అందరూ అనుమానంతో చూశారు. కాని ఫీబస్‌కి విసుగు వచ్చింది. "లాభంలేదు. ఎక్కడికి పోయిందో వెతకండి. నే నింక ఇంటికి వెడుతున్నాను. మీరు వెతకండి."

ఫీబస్ గుర్రమెక్కాడు. అశ్వికులందరూ కుడివైపు వీధిలో సాగిపోయారు. ఫీబస్ ఇద్దరు సైనికాధికారులూ మిగిలారు. ఫీబస్ ఆయిద్దరికీ ఆజ్ఞలిచ్చి బయలుదేరాడు.

అశ్వికులందరూ వెళ్ళిపోయినతర్వాతకూడ ఫీబస్ కంఠం వినపడేసరికి ఎమరాల్డాకి ఆశ కలిగింది. అతడు తనను రక్షించగలడనుకుంది. "ఫీబస్! ఫీబస్!" అంటూ బిగ్గరగా పిలుస్తూ కిటికీవద్దకు వెళ్ళింది. ఫీబస్ అప్పటికే ఎడమచేతివైపు వీధిమలుపు దాటి పోతున్నాడు. అతడి కామె పిలుపు వినపడలేదు. కాని మిగిలిన సైనికాధికారు లిద్దరూ ఆమెను చూశారు. ఆడుపులి తల్లి ఆమెపై కురికి పొదివి పట్టుకుని గది ఆ చివరకు తీసుకు పోయింది.

"ఆ! చిక్కాయిబోనులో రెండెలకలు" అన్నాడొకడు.

ఒకడు చప్పట్లు చరిచి బాట కావలివైపున నిలబడి చూస్తున్న వాడి నొకణ్ణి పిలిచాడు. అతడి చేతిలో పెద్దతాడొకటి ఉంది.

"ఇదుగో ఈ బోనులో ఉంది మంత్రకత్తె తీసుకుపోయి ఉరి తీసెయ్యి" అని ఆజ్ఞ ఇచ్చాడు.

రాతి ఉరిస్తంభంవైపు చూపుతూ "ఇక్కడేనా?" అని అడిగాడు.

"అవును."

అతడు లోపలికి తొంగిచూశాడు.

"ఇద్దర్లో ఎవరండి?"

"ముసల్ది కాదు. పడుచుది. ఊ! త్వరగా కానీ."

కూతుర్ని గదిలో ఒకమూల కూర్చోబెట్టి తల్లి కిటికీవద్దకు వచ్చి అడ్డుగా నిలబడింది. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. వస్తే ఒడిసి పట్టుకోడానికి రెండు చేతులూ కిటికీలోనుంచి చాపి గోళ్లు చూపించింది తల్లి.

ఒకడు ముందుకు వచ్చి ఆమెనుచూసి వెనక్కి తగ్గాడు.

"భయపడుతున్నావా దాన్ని చూసి?"

"అహహాఁ లేదండి"

అతడు దగ్గరికి రావడం గమనించింది తల్లి.

"ఏం కావాలి?"

"నీకోసం కాదు. నీ వెనకాలుంది దానికోసం. దాన్ని మర్యాదగా అప్పగించు."

"ఇక్కడెంకెవ్వరూ లేరు."

"ఉంది. నాకు తెలుసు."

"ఉంటే తీసుకెళ్లు" అంటూ ఆమె గోళ్లూ పళ్లూ చూపించింది.

"లోపలి కెలా వెళ్లడం?" అన్నాడు ఒక సైనికాధికారిని చూసి.

సైనికాధికారి కిటికీవద్దకు వెళ్ళాడు. "మర్యాదగా ఆమెని విడిచిపెట్టు. నీకెందు కది?"

"అది నా కూతురు"

"నీ కూతురైతే నాకేం? ఇది రాజుగారి ఆజ్ఞ"

"రాజుగారి ఆజ్ఞ అయితే నాకేం?"

"లాభం లేదు. గోడ పడగొట్టండి."

మహాకాయు డొకడు వచ్చి ఉరితాడు అంగుకున్నాడు. ఒకడు పలుగు పట్టుకువెళ్ళి కిటికీకింద ఒక్కరాయి విడగొట్టాడు. తల్లి ఇది చూసి గదిలో రోషంతో తిరగనారంభించింది. గదిలో విడిగాఉన్న ఒక నాపరాయి ఎత్తి కూలీపైకి విసిరింది. కాని అది కిటికీముందే పడిపోయింది.

అప్పటికి బాగా తెల్లవారింది. రోలండ్స్ టవర్ చుట్టూ చోద్యం చూడ్డానికి గుంపు చేరింది.

తల్లి కూతురు కడ్డంగా చేతులు చాపి కూర్చుంది. కూతురు ఫీబస్ పేరే మననం చేస్తోంది. తల్లి పరిస్థితి గమనించి బిగ్గరగా అరవనారంభించింది. ఆమె కేకలకు గ్రీవ్ చౌకు దద్దరిల్లిపోతోంది. సైనికాధికారిని చూసి అరవనారంభించింది. "నీకు బిడ్డలు లేరూ? నా బిడ్డ నీకేం హానిచేసింది. నీ బిడ్డని ఉరిదీస్తే నీ కెలా ఉంటుంది? అయినా నా బిడ్డ నెలా తీసుకుపోతావో చూస్తాను. రా. దగ్గరికి రా నీపని పట్టిస్తాను."

కిటికీకింద రాయి ఊడిపోగానే తల్లి ఒక్కదూకులో వెళ్ళి అక్కడ అడ్డు నిలిచింది. శిథిలమైన కిటికీఅంచున తల కొట్టుకుంటూ బిగ్గరగా ఆర్తనాదం చెయ్యసాగింది.

"ఊఁ! లోపలికి దూకండి. దాన్ని గెంటెయ్యండి" అన్నాడు సైనికాధికారి.

తల్లి ఆఖరుసారి ప్రయత్నంచేసింది. సైనికాధికారివంక చూస్తూ తన దీన చరిత్ర విన్నవించుకుంది. పదిహేనేళ్లు ఈ కూపంలో మ్రగ్గిమ్రగ్గి చివరికి దొరికిన కూతుర్ని తీసుకుని పారిస్ నుంచి వెళ్ళిపోగలదని చెప్పింది. ఆమె దీనచరిత్ర వినేసరికి అతడి హృదయం కరిగింది. నిట్టూర్పువిడిచి మహాకాయునితో అన్నాడు: "లాభం లేదు. ఇది రాజాజ్ఞ. నీపని నువ్వు పూర్తి చెయ్యి. నేను వెడుతున్నాను" అంటూనే అతడు దారితీశాడు.

సిపాయిలు తల్లిని గెంటి గది ప్రవేశించారు. తల్లి కూతురుపైబడి గాఢంగా కౌగిలించుకుంది. కూతురు "అమ్మా!" అని బిగ్గరగా అరచి స్మృతితప్పి పడిపోయింది. సిపాయిలు తల్లిని బలవంతాన కౌగిలినుండి పెరికి యువతిని పట్టుకుని బయటికి తీసుకువచ్చారు. మహాకాయుడు స్మృతి తప్పిన యువతిని భుజంపైన వ్రేలవేసుకున్నాడు.

ఆ సమయంలో దూరాన నాటర్‌డామ్ చర్చి గోపురాలపైనుండి ఇద్దరు వ్యక్తు లీ తతంగాన్ని గమనిస్తున్నారు.

మహాకాయు డామె నొక చేతపట్టుకుని మరొకచేత ఉరితాడు పట్టుకుని ఉరిస్తంభంవైపు నడిచాడు. అక్క డొకడు స్తంభానికి ఉచ్చుగట్టి వ్రేలాడతీశాడు. స్తంభాని కొక నిచ్చెన వెయ్యబడింది. మహాకాయుడు యువతిని భుజంపైనే వేసుకుని నిచ్చెన మెట్లెక్కుతున్నాడు. రోలండ్స్ టవర్‌లోనుంచి భయంకరమైన ఆర్తనాదం వినవచ్చింది. అందరూ తల లటు తిప్పి చూశారు. తల్లి తల గోడకు కొట్టుకొని నెత్తురు ధారలై కారగా స్మృతితప్పి పడిపోయింది. ఒకరిద్దరు ఆమెను సమీపించి చూశారు. ఆమె చచ్చి పడిఉంది.

36

క్వాసిమోడో గదిలో చూసి యువతిని కానక క్రోధోద్రిక్తుడైనాడు. చర్చి అంతటా వెర్రెత్తినట్టు తిరగడం మొదలుపెట్టాడు. చర్చి అదిరిపడేలా అరుస్తున్నాడు. జుట్టు పీక్కుంటున్నాడు. సరిగ్గా అదే సమయానికి సిపాయిలు చర్చి ప్రవేశించారు. సిపాయిలు యువతి సహాయం నిమిత్తం వచ్చారని భ్రమపడి చర్చిఅంతా శోధించడంలో వారి కతడు సహాయపడ్డాడు. చర్చి మూల మూలలా వెతికినా యువతి కనపడలేదు. ఆమె అక్కడుంటే తప్పకుండా సిపాయిల చేతికి అత డొప్పగించవలసి వచ్చేది. సిపాయిలు విసిగి వేసారి వెళ్ళిపోయినతరవాతకూడా క్వాసిమోడో వెతికినచోటే వెతుకుతూ చర్చి అంతా నూరుసార్లు కలయతిరిగాడు. చివరికి నిరాశచేసుకున్నాడు. ఆమె అపహరించబడిందని నిర్ధరించుకుని ఒక స్తంభంవద్ద కూలబడ్డాడు. చర్చిలోనూ, చుట్టుప్రక్కలా అప్పటికి ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

కొంతసేపటి కతడు లేచి మెల్లిగా గోపురమెక్కాడు. ఆమె నివసించిన గది అంత దూరంలో ఉందనగా అతడికి తిరిగి ఆశ తలెత్తింది. ఏమో! ఆమె అక్కడే క్షేమంగా ఉందేమో! లేక ఏ దేవతో ఆమె నింతవరకూ దాచి ఇప్పు డక్కడకు తిరిగి చేర్చి ఉండకూడదా! నిద్రపోతున్నదేమో! ఆమె సుఖనిద్ర పాడుచెయ్యకూడదు అనిపించిం దతనికి. కాని తీరా వెళ్ళేసరికి ఆమె గదిలో లేకపోతే, అతడికి ధైర్యం చాలలేదు. ఉన్నచోటే గోడకు చేరబడి నిలబడ్డాడు. కొంతసేపటికి ధైర్యం తెచ్చుకుని అడుగులు వేశాడు. గది ఖాళీగానే ఉంది! తడబడుతున్న అడుగులతో వెళ్ళి పడకయెత్తి కింద చూశాడు. దుఃఖం పెల్లుబికి వచ్చింది. చరాలున లేచివెళ్ళి గోడకు గబగబ తల కొట్టుకున్నాడు. గాయాలు తగిలి నెత్తురు కారింది. స్పృహ తప్పి పడిపోయాడు.

తిరిగి మెలకువవచ్చి చుట్టూ చూశాడు. ఆమె పడుకున్న పడకను, ఆమె తిరిగిన నేలను మాటిమాటికీ ముద్దు పెట్టుకున్నాడు. కొంతసేపటికి చేతులపైనా మోకాళ్ళపైనా ప్రాకుకుంటూ గది దాటి వచ్చాడు. అవతల కూలబడి గదివైపు శూన్యదృక్కులతో చూస్తూ కూర్చున్నాడు.

యువతి నెవరపహరించి ఉంటారని క్వాసిమోడో ఆలోచించాడు. క్లాడ్ ఫ్రాలో జ్ఞప్తికి వచ్చాడు. గోపురద్వారం తాళంచెవి అతడి ఒక్కడిదగ్గరే ఉంది. యువతిని క్లాడ్ బలాత్కరించడం క్వాసిమోడో ప్రత్యక్షంగా చూసినదే. క్లాడ్ ఫ్రాలో ఆమె నపహరించాడని రూఢి పరుచుకొన్నాడు అయితే అతడికి

★ ఘంటారావం ★

క్లాడ్‌పైన అసూయగాని క్రోధంగాని కలగలేదు. ఇద్దరిపట్లా అతడికి జాలి కలిగింది. జరిగినదానికి దుఃఖం కలిగింది.

అప్పటికి తెల్లవారుతోంది. ఆ సమయంలో గోపుర సోపానాలపైన అలికిడయింది. క్వాసిమోడో అటు చూశాడు. క్లాడ్ మెల్లిగా మెట్లెక్కి వస్తున్నాడు. అతడి ముఖం భయంకరంగా ఉంది. ప్రక్కనే నిలబడిన క్వాసిమోడోనికూడా అతడు గమనించలేదు. తిన్నగా మెట్లెక్కి గోపురం మిద్దెపై నిలబడ్డాడు.

అతడి ఆకారాన్ని చూసి క్వాసిమోడో కొంతసేపు ప్రాన్పడిపోయాడు. తరవాత మెల్లిగా క్లాడ్ వెళ్ళినదారినే అనుసరించాడు. అతడి హృదయంలో ఏమి జరుగుతుందో అనేభీతి, కోపం ఉబికి వచ్చాయి. మెట్లచివర నిలిచి క్లాడ్‌వంక చూశాడు. తరువాత అత డేదిక్కుగా చూస్తున్నాడో గమనించాడు. అడుగులు చప్పుడు కాకుండా వెళ్ళి క్లాడ్ వెనుక నిలబడ్డాడు. క్లాడ్ ఏకాగ్రదృష్టితో ఒకేచోట చూస్తున్నాడు.

వేసవి ఉదయాన గోపురశిఖరంపైనుంచి చూస్తే పారిస్ నగరం అతిరమ్యమై కనపడుతుంది. అప్పుడది జూలైమాసం. ఆకాశం నిర్మలంగా ఉంది. పడమటి అంచుపైన తారకలు అప్పుడే వెలుగులో అంతరిస్తున్నాయి. అప్పుడే సూర్యభగవానుడు ఉదయాద్రిపై వెలుగుతున్నాడు. పారిస్ నగరం మేల్కొని ఒళ్లు విరుచుకున్నట్లుంది. మెల్లిగా చల్లనిగాలి వీస్తోంది.

నాటర్ డామ్ చర్చిముందు దూలం పేరుకొన్న సీసపుముద్దలు రక్తం చూసి జనం అక్కడ మూగుతున్నారు. గ్రీవ్ చౌకులో ఉరిస్తంభంవద్ద చాలమంది జనం పోగైనారు. శవాల నప్పుడే సీన్ నదిలో పార వేశారు.

క్లాడ్ దృష్టి ఉరిస్తంభంపైనే లగ్నమైఉంది. యువతి నపహరించి ఏంచేశాడో అడిగి తెలుసుకోవాలని క్వాసిమోడో తహతహలాడుతున్నాడు. చావుబ్రతుకుల మధ్య ఏదో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైనట్లు క్లాడ్ ప్రాణమంతా కళ్ళలోకి తెచ్చుకుని చూస్తున్నాడు. ఆ చివర మిద్దెపైన ఒక శిల్పంఉంది. ఆ శిల్పంపై ఒక కాలూని నిలబడ్డాడు క్లాడ్. అతడి భంగిమ, ముఖవికారం చూసి క్వాసిమోడో కంపించిపోయాడు. అతడుకూడా గ్రీవ్ చౌకువంక చూశాడు. అదే సమయానికి ఉరిస్తంభానికి వేయబడిన నిచ్చెన మెట్లెక్కుతున్నాడు మహాకాయుడు. అతడి భుజంపై తామరతూడుగువలె ఒక యువతి వ్రేలాడుతోంది. క్వాసిమోడో కన్ను పొడుచుకుచూశాడు. జిప్సీ యువతిని గుర్తించాడు.

యువతి మెడకు ఉచ్చు తగిలించబడింది. క్లాడ్ మరింత ముందుకు వంగిచూశాడు.

మహాకాయుడా యువతిమెడకు ఉచ్చు తగిలించి నిచ్చెన దిగాడు. దిగి వెంటనే నిచ్చెననొక్క తాపు తన్నాడు. ఉచ్చు గిరగిర తిరిగింది. ఉచ్చులో యువతి విలవిల తన్నుకుంది.

క్లాడ్ కనుగ్రుడ్లు గిరగిర తిరిగాయి. అతడి కంఠంనుండి భయంకరాట్టహాసం వినవచ్చింది. అది ఒక రాక్షసుడు నెత్తురు త్రాగి వికటాట్టహాసం చేసినట్లుంది. క్వాసిమోడోకీ వెర్రినవ్వు వినపడలేదు కాని అతడి ముఖభంగిమ గమనించాడు. క్వాసిమోడో

కోపంతో గ్రుడ్డివాడైనాడు. వెనక్కొక అడుగు వేసి అప్పైన ముందుకు లంఘించి క్లాడ్‌ని ఒక్కతోపు తోశాడు. క్లాడ్ భయంతో ఆర్తనాదం చేశాడు. పడిపోతూ నీరుపోయే గొట్టాన్ని గట్టిగా పట్టుకున్నాడు. పట్టుకుని అరవబోయాడు. పైకి చూసే సరికి క్వాసిమోడో భయంకరాకృతి కనపడింది. క్రిందికి చూశాడు. అగాధమంత క్రిందున రాజమార్గంలో జనులు అవగింజల్లా కనపడుతున్నారు. మధ్యలో అక్కడక్కడ శిల్పాలు గోడలలోనుంచి మెడలు చాచి కబళించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనపడ్డాయి. వాటిపై పడితే తల బ్రద్దలు కాక తప్పదు. అవి తప్పినట్లయితే నేలపై పడి ప్రాణం అంతరించక తప్పదు. మెల్లిగా గొట్టం పట్టుకుని పైకెగబ్రాకడానికి క్లాడ్ ప్రయత్నించాడు. కాని చేతులలో సత్తువ చాలలేదు. విలవిలలాడుతున్న అతడి కాళ్లు శిల్పాలకి కొట్టుకొని గాయాలు తగులుతున్నాయి.

క్వాసిమోడో చేయి అందిస్తే క్లాడ్ అందుకోగలిగేవాడే. కాని అతడు చేయి అందివ్వలేదు. క్వాసిమోడో చావులోకి చూశాడు; యువతిని చూశాడు; ఉరి స్తంభం చూశాడు. అతడి దృష్టి అక్కడే నిలిచింది.

క్లాడ్ పట్టు గట్టిగా దొరక్క ప్రయాసపడుతున్నాడు. సీసపు గొట్టం వొంగడం మొదలు పెట్టింది. ఒకసారి కిందికి చూశాడు. తరవాత పైకి చూశాడు. చూడగానే భయంతో కళ్లు మూసుకున్నాడు. మరొక క్రూర శిలావిగ్రహంలా క్వాసిమోడో స్తంభితుడై శిలావిగ్రహంపైనుండి చూస్తున్నాడు. అతడి కంటినుండి నీరు ధారలు కట్టింది. క్లాడ్ ప్రయత్నించినకొద్దీ గొట్టం వొంగి బీటలువారసాగింది.

క్రింద వీధిలో కొందరు జనం ఆగి నాటర్ డామ్ చర్చి గోపురంపైన ఈ విశేషం అర్థంకాక తేరిపార చూస్తున్నారు.

"అదేమిటది! పొద్దున్నే అదేం సరదా! ముసలాడికి పిచ్చెక్కినట్లుంది అది పట్టుకు వేళ్లాడుతున్నాడు. చెయ్యి జారిందంటే కిందపడి చావవలసిందే" అనుకుంటున్నారు.

క్లాడ్ బలంగా గొట్టంపట్టుకుని శరీరాన్ని పైకి లేవనెత్తాడు. గొట్టం పుటుక్కున విరిగింది. వెర్రికేకతో పడిపోయాడు క్లాడ్. క్వాసిమోడో చూస్తూ ఊరుకున్నాడు. క్లాడ్ తలక్రిందులుగా పడ్డాడు. వీధిలో మధ్యగా పడ్డాడు. పడి మరి కదలలేదు. క్వాసిమోడో పడినంతవరకూ అతణ్ని చూసి తరువాత తలెత్తి చావులో ఉరిలో నిర్జీవియై వ్రేలాడుతున్న యువతిని చూశాడు. "ఇంక నాకీలోకంలో ఏమీలేదు" అనుకున్నాడు క్వాసిమోడో.

37

ఆరోజే సాయంకాలం మతాధికారులు వచ్చి క్లాడ్ శవాన్ని తీసుకుపోయారు. అప్పుడు క్వాసిమోడో మాత్రం చర్చిలో కనపడలేదు. ఈ విషయమై నగరంలో అనేక ప్రవాదలు వ్యాపించాయి. క్లాడ్ మరణించగానే అతడి ఆత్మనపహరించి క్వాసిమోడో రూపంలో వేచిఉన్న సైతాన్ అంతర్థానమైనాడని కొందరన్నారు. ఈ కారణంవల్ల బిషప్ క్లాడ్ ఫ్రొలోని సమాధి చెయ్యలేదు.

మహారాజు పదకొండో లూయీ మరుచటి సంవత్సరమే ఆగస్టులో చనిపోయాడు.

గ్రింగైర్ మేకను కాపాడుకుని ప్రసిద్ధ కవీశ్వరుడైన ఖ్యాతి తెచ్చుకున్నాడు. అన్ని విద్యలూ నేర్చి పొట్ట పోషించుకోలేక తిరిగి నాటక రచనలోపడి ఖ్యాతి తెచ్చుకున్న గ్రింగైర్ అది విధి విలాసం అన్నాడు. కెప్టెన్ ఫీబస్ కూడా బలీయమైన విధికి తలొగ్గక తప్పలేదు—అతడు వివాహం చేసుకున్నాడు.

క్లాడ్ చనిపోయినరోజున క్వాసిమోడో నాటర్ డామ్ చర్చిలో కనపడలేదు. ఆతరువాతకూడా అతడు మనిషికంట పడలేదు.

ఎస్మరాల్డాను ఉరితీసిన రోజున, ఆమెను రోజంతా అలాగే ఉంచి రాత్రికి ఆమె శవాన్ని ఆచారం ప్రకారం మాంట్ ఫాంకూ ప్రేతభూమికి తీసుకుపోయారు. మాంట్ ఫాంకూ ఆ కాలంలో ప్రసిద్ధిచెందిన ప్రేతభూమి. అక్కడ నిర్మించబడిన కట్టడం విలక్షణమైనది. చిన్న గుట్టపైన కట్టబడినందువల్ల అది నగరంలో చాలా దూరానికి కనపడుతుంది. ఆ గుట్టపైన పదిహేనడుగుల ఎత్తున నలభై అడుగుల పొడవున ముప్ఫై అడుగుల వెడల్పున చతుర్భుజాకారంలో ఒక పెద్దవేదిక నిర్మించబడింది. దానిపై పదహారు రాతి స్తంభాలపైన పైకప్పు నిర్మించబడింది. పైకప్పునుంచి ఇనపగొలుసులనేకం వ్రేలాడగట్టబడినాయి. ఉరితీయబడిన వారినీ గొలుసులకు వ్రేలాడదీస్తారు. వేదిక దిగువన రెండు పెద్ద ఉరి స్తంభాలు, ఒక్క పెద్ద రాతిసిలువ నిర్మించబడినాయి. ఆ కప్పుపై నెప్పుడూ కాకులు విహారం చేస్తూఉంటాయి.


పదిహేనో శతాబ్దం ఆఖరు దశకే ఈ బ్రహ్మాండమైన వికృత సమాధి శిథిలావస్థకు వచ్చింది. గొలుసులు త్రుప్పుపట్టాయి. దూలాలు చీకి చెదలుపట్టాయి. వేదికపై గడ్డి మొలిచింది. ప్రేతాలు సంచరించే ప్రదేశమనే భీతివల్ల ప్రజ ఆవంక తొంగిచూడరు. వేదికపై ఒకప్రక్క శిథిల కంకాళాలు కొన్ని గుట్టగా పడిఉన్నాయి. ఎందరెందరో ద్రోహులు, క్రూరులు దుష్టులు, అమాయకులు స్త్రీలు పురుషులు తమ అస్థికలనీ వేదికకు సమర్పించారు.


తన అపూర్వ సౌందర్యంతో పారిస్ నగరవాసులను సమ్మోహపరిచిన యువతి ఎస్మరాల్డా ఉరితియ్యబడిన రెండేళ్ళకు ఈ వేదిక పరిశోధించబడింది. ఆ సమయంలో ఒకే గొలుసుకు వ్రేలాడుతున్న రెండు అస్థిపంజరాలు వింతగొలిపాయి. ఒకటి ఒక స్త్రీది, అక్కడక్కడ చీకిన గుడ్డపేలికలా ఎముకలనుబట్టి వ్రేలాడుతునాయ్ని. మెడలో మాత్రం రంగు రంగుల పూసలహారం వ్రేలాడుతోంది. ఆ అస్థిపంజరాన్ని కౌగలించుకుని మరొక అస్థిపంజరం కనపడింది. అదొక పురుషుని కంకాళం. ఒక కాలు మరొక కాలు కంటె పొట్టి. వెన్నువంగి అతడు గూనివాడని తెలుపుతోంది. అతడి మెడ చూస్తే ఉరితియ్యబడలేదని స్పష్టమయింది. అక్కడకు వచ్చి ఆ స్త్రీ పరిష్వంగంలోనే మరణించి ఉంటాడు. ఆ అస్థిపంజరాలను తాకగానే ఎముకలు పొడిపొడైపోయి రూపం అంతరించింది.

(సమాప్తం.)

సినిమాలలో బ్యాక్‌గ్రౌండ్ సౌండ్స్ రాను రాను తలనొప్పి పుట్టించేటంత యిబ్బందిగా తయారు అవుతున్నాయని ఒక విమర్శకుని వ్యాఖ్య.

అవును—మన వెనుక సీట్లలో కూర్చున్నవారు నూతన వధూవరులైతే మరీయిబ్బందిగావుంటోంది.





కోలని
కలువ

ఫోటో: ఆర్ పి.
రంగారావు,
(సికింద్రాబాదు.)

బొమ్మరిల్లు

అలుసు

కవిరావు

అలుసుగా నన్నైతె
అంటావుగాని,
ఎన్ని చేసినగాని
నాన్నారి నసవు
    గాలిపడగకు చిన్న
    కాగితమ్మడిగితే
    కస్సుమంటూ ఒంటి
    కాలిపై లేస్తావు;

    తెల్లకావులు వ్రాసి
    తెగపాడు చేస్తుంటె
    ఎన్నడైనా నాన్న
    నన్నానటే అమ్మ ?
        అలుసుగానన్నైతె
        అంటావుగాని.

నాన్నారి బుక్కుపై
చిన్నిపెన్సిలుతోడ
'అ, ఆ' లు వ్రాస్తుంటె
ఆగ్రహిస్తుంటావు;

పగలు రాత్రియు అదే
పనిగ యేమేమిటో
నాన్నారు వ్రాస్తుంటె
నా కర్థ మవుతుంద ?
    అలుసుగా నన్నైతె
    అంటావుగాని.

'నాన్నారు చదువు చు
న్నారు గోలేమి'టని
గదిలోని కేగితే
గదురు కుంటావు గద;

పెద్దగా నాన్నారు
పద్దెమ్మలను చదివి
రద్దిచేయర నేను
దిద్దుకొనుచుండగా ?
    అలుసుగా నన్నైతె
    అంటావుగాని.

కొల్లగా గ్రంథాలు
అల్లుతా రంటావు
కమ్మగా నీలాగు
కథచెప్ప రేమిటే;

అంతులేనీ వ్రాత
అదియేమిటే అమ్మ !
నిజముగా చెప్పవే
నీ కర్థమవుతుంద ?

    అలుసుగా నన్నైతె
    అంటావుగాని
    ఎన్ని చేసినగాని
    నాన్నారి నసవు.

[ఆధారము: రవీంద్రనాథ టాగూర్]

పెళ్లి మర్యాద

సి. విశ్వనాథం

ఆరోజున మా చెల్లాయి పెళ్ళి. ఇల్లంతా చుట్టపక్కాలతో చాలా హడావుడిగా వున్నది. ఒకరి మాట ఒకరు వినిపించుకోకుండా ఎవరి సందట్లో వాళ్లు వున్నారు.

నేను అప్పుడే స్నానం పూర్తి చేసుకొనివచ్చి యిస్త్రీచేసిన బుష్ కోటు ప్యాంటు తొడుక్కుని అద్దం ఎదుట నిలబడి తల దువ్వుకుంటున్నాను. కొంచెందూరంలో మా నాన్నగారూ మా అమ్మా ఏదో మాట్లాడుకుంటున్నారు.

"ఏమండీ! యింకా యిక్కడే వున్నారా? పెళ్లివారు అలిగి కూర్చున్నారు. వారికి 8 గంటలయినా కాఫీ పంపలేదటగా!" అంటూ హడావుడిగా శాస్త్రులుగారు ప్రవేశించారు.

"ఏమి చెయ్యమంటారండీ! పాలవాళ్లు యింకా రాలేదు. ఇప్పుడే మా వెంకడిని పంపా చూచిరమ్మని" అన్నారు నాన్నగారు.

"అరె! 8 గంటలయినా పాలు రాలేదా? ఆశ్చర్యంగా వుందే. అయినా యివి పెళ్ళిళ్ళరోజులు గదా? పాలవాళ్లు ఎక్కువడబ్బుకు కక్కూర్తిపడి యింకొకళ్ళకి పోస్తా వుంటారు, మీరు ముందే జాగ్రత్త పడాలిసింది. ఇప్పుడనుకుంటే ఏం లాభం? త్వరగా యింకెక్కడయినా పాలుదొరుకుతే తెప్పించండి. అసలే పెళ్ళివారు కోపంగావున్నారు. మరీ ఆలస్యంచేస్తే వాళ్లు వూరుకునేలా లేరు."

"మీరు వెళ్లండి శాస్త్రులుగారూ! నే చూస్తా. ఒరే! అబ్బాయ్! చూడు నాయనా! ఆ పుల్లయ్యగాని 4 శేర్లు పాలు పోస్తాడేమో కనుక్కురారా!" అన్నారు నాన్నగారు.

నేను తలదువ్వుకొనటం పూర్తి చేసి సైకిలువేసుకొని పుల్లయ్యయింటికి వెళ్ళి అడిగితే, అప్పటికే ఎవరో పోయించుక్కువెళ్లారని కబురు చల్లగా చెప్పాడు. మరి రెండుమూడు చోట్లకు వెళ్లితే, అక్కడా ప్రొద్దు ఎదురయింది. నేను నిరాశతో తిరిగి యింటికి వస్తూండగా విడిదిలో ఏదో గొడవ జరుగుతున్నట్లు వినిపించింది. లోపలికివెళ్ళి చూశాను.

"ఏమో పెద్దమనిషి వనుకున్నాను. 9 గంటలయినా కాఫీ ఫలహారాలే యివ్వలేకపోయావు. ఇంత దరిద్రపు సంబంధం అనుకో లేదు." అంటూ మా నాన్నగారి మీద కేకలేస్తున్నాడు పెండ్లికొడుకు తండ్రి.

"బావగారూ? యివి చేతులు కావు, కాళ్లు అనుకోండి. పాలవాళ్లు యింతవరకు అయిపులేరు. ఇంకో అరగంట ఆగితే పాలు యింకెక్కడయినా తెప్పించి కాఫీ సిద్ధపరిచి పంపిస్తాను. ఇప్పటికి దయ

★ పెళ్ళిమర్యాద ★

తలచండి."అని నాన్నగారు ఎంతో దీనంగా బ్రతిమాలుకుంటున్నారు.

"ఇప్పటికే తలనొప్పులతో బాధ పడుతుంటే యింకో గంటా రెండు గంట లంటారేమిటి ? అల్లా కుదరదు. వెంటనే కాఫీ పంపిస్తే సరే సరి! లేకపోతే మా దారిని మేము పోతాం. కాఫీ యివ్వటానికే గతి లేదనుకోలేదు." అంటూ పెళ్లి కొడుకు తల్లి* మరీ చిందులు త్రొక్కుతోంది.

"అక్కగారూ! మా ఖర్మం కాలి మీచేత యిన్నిమాట లనిపించుకోవలసి వచ్చింది. పాలవాళ్లు యింత దగా చేస్తా రనుకోలేదు. ఇప్పుడే మా కుర్రాడు పాలకోసం వెళ్ళాడు, మరెక్కడయినా దొరుకుతే పట్టుకురావటానికి. ఒక అరగంట ఆగండి, అంతా సిద్ధమవుతుంది." అని మా నాన్నగారు అన్నారో లేదో, పెళ్లికొడుకు తండ్రి మరీ రెచ్చిపోయి, "మరో గంటా అరగంటా ఆగటానికి మా వల్లగాదు. ఇప్పటికే మా ప్రాణాలు తలనుండి తోకకు దిగజారినై, చూస్తారేమిట్రా సామాన్లు సర్దుకోక" అంటూ పెద్దపెద్ద కేకలు వేస్తూ కల్లుత్రాగిన కోతిలా చిందులు త్రొక్కటం సాగించాడు.

అప్పటికే అంతామూటా ముల్లే సర్దుకుంటున్నారు. ఆయన కేకలకు హడలిపోయి త్వరత్వరగా మూటలు కట్టేస్తున్నారు. నా ప్రాణం చివుక్కుమంది. కాఫీ కోసం యింతముఖం వాచిపోయిన వాళ్ల నెక్కడా చూళ్ళేదు. అయిన సంబంధం కాఫీ గొడవ మూలంగా ఆగిపోతుందేమో ననే ఆదుర్దాతో పెళ్లికొడుకు దగ్గరకు వెళ్లి "బావగారూ! ఇబ్బందులనేవి అందరికి వస్తాయి. మీరు తొందరపడటం భావ్యంగాదు. మీ నాన్నగారితో మీ రయినా చెప్పిచూడండి, ఒక అరగంట ఆగమని. యీ లోపల అంతా సిద్ధంచేస్తాము" అని పెళ్ళికొడుకు మనస్సు కరిగేటట్లు బ్రతిమాలుకున్నాను.

పెండ్లికొడుకు మనస్సు మంచి దవటంవల్ల వాళ్ళ నాన్నగారి దగ్గరకు వెళ్ళి "నాన్నగారూ! పెద్దలు అంతగా బ్రతిమాలుతుంటే కోపగించుకోవటం తగదు. ఏదో వాళ్ళకి యిబ్బంది కలిగింది. మనం సర్దుకోక పోతే ఎట్లా" అన్నాడు.

"నువ్వూరుకోరా! కుర్రవెధవ్వ నీకేం తెలుసని నాకు బుద్ధులు చెప్ప వచ్చావ్? ఒరే! సుబ్బన్నా! సామాన్లు బళ్లల్లోకి ఎక్కించవేరా! దేబల్లే చూస్తూ కూర్చున్నావేం" అన్నాడు ఆయన మరింత అగ్గి అయిపోయి.

"ఆ! ఆ! తొందరపడకండి రామయ్యగారూ! ఇంత చిన్న విషయానికే పెళ్లి వదులుకునిపోవటం న్యాయంగాదు. వాళ్లు అంతగా బ్రతిమాలుతుంటే త్రోసివేయడం అంత మంచిదిగాదు. దయ తలచం"డని శాస్త్రులుగారూ మరికొందరు పెద్దలు బ్రతిమాలగా పెండ్లికొడుకు తండ్రి కొంతశాంతించి" ఒక అరగంటలోకల్లా కాఫీ ఫలహారాలు రాకపోతే పూరుకునేది లేదన్నాడు.

మా నాన్నగారు ఖిన్న వదనంతో అక్కడినుండి వెళ్లిపోయారు. నేనుకూడా వారి వెనకాలే వెళ్లాను. నేను వెళ్లేటప్పటికి వంటింట్లో మా అమ్మ దిగాలుపడి కూర్చున్నది. ఒకమూల పొయ్యిమీద అన్నం ఉడుకుతోంది. మరో ప్రక్క పులుసు,పప్పు కూరలు తయారవుతున్నయ్. వాటికి కొంచెం దూరంలో కాఫీ డికాషన్ పాలకోసం ఎదురుచూస్తోంది. దానికి వుస్మా గిన్నెలు కాపలా కాస్తున్నయ్

'నన్ను చూచిందే తడవుగా ఏరా నాయనా ఎక్కడా పాలు దొరకలేదా, వట్టి చేతులతో వచ్చావు?" అంది మా అమ్మ.

"లేదేఅమ్మా! పుల్లయ్యయింట్లో ఎవరో పోయినందుకు వెళ్లారుట యింకెక్కడా దొరకలేదు" అన్నాను.

"ఏం చేస్తాం ఇంతకీ మన ఖర్మ ...ఖర్మ" అంటూ తల బాదుకొని అక్కడనుండి లేచిపోయింది మా అమ్మ.

నాకేమీ పాలుపోలేదు. అయినసంబంధం గదా అని యింత ఖర్చుపడి అంతా సిద్ధంచేసిన తరువాత కాఫీకోసం చెయ్యిజారిపోతోందే అనే దిగులుతో అక్కడే

పిచ్చివానిలా అటూయిటూ తిరుగుతున్నాను.


అట్లా తిరుగుతున్న నాకు హఠాత్తుగా అప్పుడే వార్చిన గంజిగుంట నా దృష్టిలో పడింది. దాన్ని చూచిందే తడవుగా నా మెదడులో తళుక్కున మెరుపులా ఒక వుపాయం తట్టింది. వెంటనే అందర్నీ బయటికి పంపించి, వంట బ్రాహ్మణుని చేత డికాషను వడపోయించి, అందులో పాలలాగ తెల్లగావున్న ఆ గంజి సమపాళంగా కలిపించి యింతపంచదార కూడా కలిపించాను. అక్కడితో కాఫీ సిద్ధమయిపోయింది. ఫలహారాలు ఒక కావిడిలోను, మరొక కావిడిలో కాఫీ పెట్టించుకొని వంటబ్రాహ్మణుని చేతపట్టించుకొని విడిదిలోకి వెళ్లాను.

కాఫీ ఫలహారాలను చూడగానే పెండ్లివారి ముఖాలు చాటంతయినై. పాలు రాలేదన్నవారు యింత తొందర్లో కాఫీ ఎట్లా సిద్ధపరచారా అని అనుకొన్నారు, పెళ్ళికొడుకు తలిదండ్రులు.

వంట బ్రాహ్మణుడు అందరికీ ఫలహారాలు పెట్టి కాఫీయిచ్చాడు.

"ఎవరు కాచారోగాని కాఫీ చాలా రుచిగావుంద"ని స్వంత యింట్లో ఒక కప్పునిమించి త్రాగని వారుకూడా ఆరోజున ఒక్కొక్కళ్లూ రెండు మూడుగ్లాసుల కాఫీ పట్టించేశారు.

వాళ్ళని చూస్తుంటే నాకు నవ్వాగిందికాదు. పైకి నవ్వితే వాళ్లేమయినా అనుకుంటారేమోనని బయటికివచ్చి కరువుదీరా నవ్వాను. నా నవ్వు మా నాన్నగారు చూచినట్లున్నారు "ఎందుకురా నవ్వుతావని" అడిగారు. నేను జరిగింది చెప్పాను. మా నాన్నగారుకూడా నవ్వి "అసాధ్యుడివిరా! పరువు నిలబెట్టావని" పొగిడి చక్కటి వెస్టెండ్ రిస్టువాచి ఒకటి కొనిపెట్టారు. ★



చైన్ నగర్ కే చార్ బేకార్ !

కొద్దికాలం క్రిందట, ఉత్తర భారత దేశంలో, రెండు పర్వతాల మధ్య ఓ గ్రామం వుండేది. దాని పేరు చైన్ నగర్. అక్కడ నివసించేవారు, కల్లాకపట మెరుగని వారు; వళ్లు వంచి కాయకష్టం చేసే వారు. ఎవరి పని వారు చేసుకొని, ఎవరిజీవితం వారు గడుపుతున్నారు. కనుక, వారి కెటువంటి బాధలూ లేవు.

అక్కడివారు వళ్లు దాచుకో కుండా పని చేస్తారు; కాబట్టి; అక్కడ జబ్బులూ లేవు, మందులూ లేవు. డాక్టర్లూ లేరు. అక్కడి వాళ్లంతా ఆనందంగా హాయిగా, సుఖంగా బ్రతుకుతున్నారు. కాబట్టి; కోర్టులూ లేవు, ప్లీడర్లూ లేరు, జైళ్ళూ లేవు. అక్కడి వాళ్లంతా సాధుస్వభావం కలవారు కాబట్టి, అక్కడ దొంగతనాలు లేవు. పోలీసులూ లేరు, తుపాకులూ లేవు,

ఆధారం: సుదర్శన్
అనుసరణ: "వల్లభ్"

కత్తులూ లేవు, కటార్లు లేవు. అక్కడి వాళ్లంతా జితేంద్రియులు కాబట్టి అక్కడ వేశ్యాగృహాలూ లేవు, కల్లు సారాయికొట్లూ లేవు. అక్కడి వాళ్లు అతిథిసత్కారాన్ని తమ ధర్మంగా భావిస్తారు; కనుకనే అక్కడ ధర్మసత్రవలూ లేవు, హోటళ్ళూ లేవు. అక్కడ కాయ కష్టానికి సంబంధించిన ఒహటీ రెండు చట్టాలు మినహా మరో చట్టం అంటూ లేదు. ఆ చట్టంకూడ యిది ఒక్కటే! — చేసేవాడిని తిననీయి, తిరిగేవాడిని తిరగనియి! వాడే ఆకలితో మలమలమాడి చస్తాడు. అందరూ పనిచేసుకునేవారే! కాని, వొహ నల్గురుమాత్రం పనిపాటా లేకుండా తిరిగేవారు వున్నారు. వారు ఆకలితోనే చస్తున్నారు; ఇతరుల దయాదాక్షిణ్యానికి బ్రతుకుతున్నారు. చివరికి వారినికూడ అక్కడినుంచి దూరంగా తమిలారు. ఓనాడు, ఇక మిగిలింది అక్కడ పనిచేసుకునేవాళ్లే!

కాని, సైతాన్‌కు అక్కడి అసభ్యప్రపంచం నచ్చలేదు. ఇక్కడి వాళ్లని సభ్యులుగాను, నాగరికులుగాను, చేయాలని అది తీర్మానించుకుంది. వారిని ఔన్నత్యానికితీసుకుపోవాలని, వారికి స్వర్గంలోని దారులు తెరవాలని అనుకుంది.

2

ఆమరునాడు సైతాను సైగతో, ఓ అందమైన యువకుడు, వ్యాపారి, చైన్ నగర్‌లో కాలు పెట్టాడు. గ్రామాన్నంతా ఓసారి కలయచూచాడు. చూచినతరువాత-'విచారం! మీరంతా అసభ్యులు, అనాగరికులు. పల్లెటూరి గబ్బిలాయిలు! ఈ నిస్సహాయస్థితిలో మీరు ఎలా బ్రతుకుతున్నారో, తెలియకుండా వుంది!' అన్నాడు.

వచ్చేవారం — బొమ్మరిల్లు సీరియల్:

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారి

"కర్పూర ద్వీప యాత్ర"

"మబ్బు పట్టకుండా ఉంటే ఇవ్వాళ రాత్రే కాస్త పొద్దుపోయేదాకా మేలుకొని కళ్లువిప్పి ఆకాశంవంక చూడండి. చీకటిరాత్రి కావాలె!

"నక్షత్రాలమీదగుండా ఆకాశంమీద రెండుదారులుగా చీలి పాలుపోసినట్లుగా వెలుతురు కనబడుతుంది. అదే పాలపుంత అనీ, కాశీరామేశ్వరాలదారి అనీ అంటారు. అందులో ఒకచోట దట్టంగా కాంతిమేఘమువలె కనబడుతుంది. అదే కర్పూరద్వీపము!

"ఇంకా జాగ్రత్తగా అందులో చూడండి. నాన్న పడుకున్నట్లు, పక్కనే అమ్మ కూర్చున్నట్లూ కనిపిస్తారు. ఆ చుట్టుపక్కల ఇంకా చాలా చిన్నచిన్న చక్కని చుక్కలు మిళుక్కు మిళుక్కుమంటూ కనిపిస్తవి. అవి చుక్కలు కావు. కర్పూర ద్వీపంలో ఉండే పిల్లలూ పిల్ల వాళ్లూను.

"మనలను ఈలోకంలో కన్నారనుకునే అమ్మా నాన్నా మనల్ని కన్న అమ్మా నాన్నా అనుకున్నారా? ఎబ్బే! కానేకాదు!

"అసలు మనమంతా ఆ కర్పూరద్వీపంలో ఉండే ఆది దంపతుల పిల్లలమే. వాళ్లకు మనలని చూడాలని మోజుపుట్టినప్పుడు రమ్మని పిలుస్తారు. మనమంతా కర్పూరద్వీపంలో ఆడుకొంటూ పడవెక్కి వచ్చిన పిల్లలమే!........."

పిన్నలకు పెద్దలకు, స్త్రీపురుషులకు, పండితపామరులకు అందరికీ సుబోధకంగా చెప్పబడిన కథ. మన పూర్వసంస్కృతినీ, భారతీయుల ఆధ్యాత్మిక ఔన్నత్యాన్నీ ప్రతిబింబించగల ఈ పుణ్యగాధ పాఠకులకు విజ్ఞానదాయకము, ఆనందదాయకమూ కాగలదని మా విశ్వాసం. —సంపాదకుడు.

ఇది విని అక్కడివాళ్లంతా ఆశ్చర్యంతో ఆ వ్యాపారస్తునివంక ఎగాదిగా చూచారు.

వ్యాపారస్తుడు - 'నేను తిరగని చోటంటూ లేదు. అనేక వస్తువులను చూచాను. కాని, యిటువంటి పల్లెటూరిని మాత్రం చూడలేదు. మరీ యింత నాసిరకం...' అన్నాడు.

ఇదంతా విని, అక్కడివాళ్లు - 'ఈ విషయం మాకు తెలియదే? ఇప్పుడైనా, మేము బాగుపడగలమా? నాగరికతను నేర్చుకోగలమా?' అనడిగారు.

వ్యాపారస్తుడు - 'నాకు నల్గురు మనుష్యుల్ని అప్పచెప్పండి! నాలుగు రోజులలో మిమ్మల్ని నాగరికుల్ని చేస్తాను. కాని, వాళ్ళు నల్గురూ పనీ పాటా లేనివాళ్ళయి వుండాలి' అన్నాడు.

చైన్ నగర్‌లో పనీ పాటా లేని వాళ్ళు ఒక్కడూ లేడు. అక్కడి



"బుగ్గని చుక్కేది అక్కా"

—ఫోటో: టి. జగన్నాథ్ ఆచార్య (న్యూఢిల్లీ)

చైన్‌నగర్ కే చార్ బేకార్!

వాళ్లంతా నిరాశచెందారు-'అరె! మీకు పనీపాటా లేనివాళ్లు అవసరం వస్తారని మాకేం తెలుసు తెలిసివుంటే, ఆ నల్గుర్ని ఇక్కడ నుంచి తరిమేవాళ్లం కాదుగదా!' అన్నారు, వారు ముక్తకంఠంతో.

కాని, వ్యాపారస్తుడు నిరాశ చెందలేదు. అతడు వారిలోనుండే ఓనల్గుర్ని యెన్నుకున్నాడు. వారికి మంచి మంచి బట్టలుయిచ్చి, కట్టుకొని పూరంతా తిరిగి రమ్మన్నాడు. మీకు చేసే పని యిదేనన్నాడు.

ఇక ఆ నల్గురూ పూళ్ళో తిరగ సాగారు. కాని, కొద్దిదినాలకే వారు విసిగిపోయారు. విసుగుతోనే - "మాకేదైనా పని యివ్వండి! మేం పనీ పాటా లేకుండా తిరగలేం!' అన్నారు, ఓనాడు.

వ్యాపారస్తుడు చిరునవ్వు నవ్వుతూ, వారివంక చూచి నెమ్మదిగా - 'మీరు పెద్దమనుష్యులు పెద్దమనుష్యులు పని చేయరు. పనిచేసేవాళ్లు కూలీలు, అంతే!' అన్నాడు.

నల్గురు 'పెద్దమనుష్యులు' యిది విని, ఆనందంతో తబ్బిబ్బయిపోయారు - 'నీవు ఎంత దయామయుడివి! నీవు మమ్మల్ని పెద్దమనుష్యుల్ని చేశావు. ఇప్పుడు నిజంగా మాకు పనిచేయాల్సిన అవసరం ఏముంది? మా పనుల్ని యితరులు చేస్తారు. కాని, వాళ్ళకు యివ్వటానికి మాదగ్గర డబ్బుకూడ లేదే! ధాన్యం అంతకంటే లేదు.' అన్నారు ఏకకంఠంతో.

వ్యాపారస్తుడు ఓసారి నవ్వి - 'మీరు పెద్ద మనుష్యులు! పెద్ద మనుష్యులు తమ పనుల్ని యేమీ యివ్వకుండానే చేయించుకుంటారు. అదీకాకుండా నేనున్నానుగా, మీ ఖర్చు భరించటానికి!' అంటూ, కాసేపాగి మళ్లీ అన్నాడు. 'ఈ పూళ్ళోవాళ్లని పిలిచి, మీకోసం నాలుగు భవనాలను తయారుచేయమనండి! దానికయ్యే ఖర్చును నేను భరిస్తాను.'

-మరునాడు చాలామంది పొలంలోని పనిపాటలు మానేసి భవనాలు కట్టటంలో మునిగిపోయారు.

భవనాలు తయారయాయి. ఈ భవనాలు చాల విశాలంగా, అందంగా వున్నాయి. వీటిని చూస్తుంటే మనస్సు ఆనందంతో

పుష్పాంగిపోతుంది. కాని, ఆ యేడు పంటలు దెబ్బ తిన్నాయి. వ్యాపారస్థుడు రూపాయిలను యిచ్చాడు. కాని, రూపాయిలకు పొట్టనిండటం లేదు. 'ఇప్పుడేదిరా బాబు దిక్కు!' అని లబోదిబోమంటూ యేడవసాగారు.

వ్యాపారస్థుడు ఓ పెద్దమనిషిని పిలిచి - 'కొంతమందిని నౌకర్లుగా పెట్టుకో! వారిని బయటకు పంపి చౌకగా ధాన్యాన్ని కొను! ఇక్కడకు తెప్పించి, ప్రియంగా అమ్ము! వచ్చిన లాభం నీదే!' అన్నాడు.

ఆ పెద్దమనిషి అలాగే చేశాడు. బయటనుంచి వచ్చిన ధాన్యాన్ని తినటం యిదే మొదటిసారి, ఆ వూరికి. వారంతా - 'ఈ మనిషి ఎంత మంచివాడూ? ఈయన లేకుండా వుంటే, మనం, మనపిల్లలు ఆకలితో మలమలమాడి చావాల్సి వచ్చేదికదా?' అన్నారు.


ఇప్పుడు వాళ్ళకి బయట వస్తువులు చాలబాగావున్నాయి. ధాన్యం తెప్పించే ఆ పెద్దమనిషి, యింకా అనేకవస్తువులను తెప్పించసాగాడు. కొద్దిరోజుల్లోనే అతడు ధనికుడయ్యాడు అనేక రకాల దుకాణాలను తెరిపించాడు. వాటిల్లో తన గుమాస్తాలనుకూచోపెట్టాడు. కాని, అతడు తన చేతులతో ఏపనీ చేయడు. అతడిపనులను యితరులు చేసి పెడుతున్నారు.

3

మరు యేడు పంటలు చేలమీద వున్నప్పుడు, లేడులువచ్చి పంటలను నాశనం చేశాయి. వ్యాపారస్థుడు వూళ్ళో వాళ్ళందరిని, సెంటరులో సమావేశపరచి - 'ఈవిధంగా యీ జంతువులు మీ పంటల్ని నాశనం చేస్తాయి. కనుక, మీరు వొప్పుకుంటే, నా మనిషి మీ పొలాల లోకి జంతువులు రాకుండా కాపాడతాడు.' అన్నాడు.

షైన్ నగర్‌లోని వాళ్ళంతా - 'చూచావా యీ మనిషి ఎంత దయామయుడో! ఈయన లేకపోతే, మనపొలాల్ని కాపాడేవాళ్ళెవరు?" అన్నారు.

ఆ మరునాడు వ్యాపారస్థుని మరో 'పెద్దమనిషి' కొంతమంది చేతికి కర్రలిచ్చి పొలం కాపలాకి



హంపి వద్ద తుంగభద్ర —ఫొటో: టి. సత్యనారాయణ, (పిప్పర.)

చైన్ నగర్ కే చార్ బేకార్!

పంపాడు. పంట చేతికివచ్చినప్పుడు, ఆ మనుష్యుల్ని పిలిచి - 'నగం పాలు మనయింటికి తీసుకురండి! నగంపాలు వారికి వుంచండి!' అన్నాడు. నగంపాలు యింటికి వచ్చినతరువాత, మూడు పాళ్ళు తాను వుంచుకొని, ఒకపాలు నౌకర్లకు పంచాడు ఆ పెద్దమనిషి.

చైన్ నగర్ లోని ప్రజలు రెండో సారిగా యితరుల రక్షణ పొంది ఆనందం అనుభవించారు. 'మనం ఎంతయిచ్చాం, యివ్వకుండా వుంటే యెంతభాగాన్ని జంతవులు పాడు చేసేవి!' అని ఆలోచించలేదు వారు. కాని, వారికి వచ్చిన వాటా వారికి సరిపోదు. దానితో దొంగతనాలు ప్రారంభమయ్యాయి. పొలాలను రక్షించే పెద్దమనిషి - 'ఒకవేళ, మీకు అవసరమైతే, మీ యిళ్లకుకూడ కాపలా పెడతాను. ఆ తర్వాత దొంగతనాలు జరిగితే ఆ బాధ్యతనాది!' అన్నాడు.

వూళ్లో వాళ్ళంతా అందుకు సంతోషంతో వొప్పుకున్నారు.

ఇళ్ళదగ్గర, దుకాణాల దగ్గర పారా యిస్తున్నారు. దొంగతనాలు ఆగిపోయాయి. కాని, దొంగనాపేందుకయిన ఖర్చు, దొంగ మెత్తుకు పోయేదానికంటె యెక్కువయింది.

ఈవిధంగా రెండో 'పెద్దమనిషీ' వ్యాపారంకూడ రోజురోజుకి వృద్ధి అవుతూ వుంది. కొద్దిరోజుల్లోనే, అతడు భవనాలకు భవనాలు కట్టేశాడు. కాని, అతడు తనపని తాను చేయడు; అతని పను లన్నింటిని యితరులు చేసి పెడతారు.

చైన్‌నగర్ లో ఓరోజున అంతా బీదవాళ్ళే! కాని, తినేందుకు యెటువంటి లోటూ లేదు. ఇప్పుడు వ్యాపారం జరుగుతోంది; కాని తినేందుకు యేమీ లేదు. దాని ఫలితంగా తగవులు ప్రారంభమయ్యాయి. ఆ ప్రేమలు, ఆ సహజత, ఆ పవిత్రత ఎక్కడికి పోయాయో తెలియదు. ఇప్పుడు వొకరి సంగతి మరొకరికి పట్టదు. మాటమాటకీ, కత్తులు నూరుకుంటున్నారు. చైన్‌నగర్ లో బ్రతకడం కష్టమైపోయింది. వ్యాపారస్తుడు యిదంతాగమనించి 'మీరు దీనికి తగిన చికిత్స చేయకపోతే, మీ ప్రాచీన కళానైపుణ్యం, యీ నగరం అన్నీ భస్మీపటలమై పోతాయేమోనని నాకు భయంగా వుంది. కనుక, యిలాంటిసంఘటనలు జరగకుండా చూడలేరు?' అన్నాడు.

వూళ్లోవాళ్ళంతా వ్యాపారస్తుని వంకచూచి, తలవంచుకొని నెమ్మదిగా - 'ఏదైనా మీరే చేయండి! మేమేం చేయగలం?' అన్నారు.

వ్యాపారస్తుడు - 'సరే! మేం ఆలోచిస్తాం' అన్నాడు, అదో రకంగా మొహంపెట్టి.

ఆరోజునే ఓ రైతుకి, ఓ వడ్డీ వ్యాపారస్తునికి తగాదా వచ్చింది. వడ్డీ వ్యాపారస్తుడు 'ఇతని అధీనంలో నావి యిరవై శేర్లు ధాన్యం వున్నాయి.' అంటాడు. రైతు అతనిని వ్యతిరేకిస్తూ - 'ఇతడు చెప్పేది అబద్ధం. నేను కేవలం పదిశేర్లు మాత్రమే యివ్వాలి.' అంటాడు. ఈవిధంగా యిద్దరూ పోట్లాడుకుంటున్నారు. ఒకర్నొకరు తిట్టుకుంటున్నారు. ఓ దుకాణదారుడు యీవార్తను తీసుకుపోయి, వ్యాపారస్తునికి చెప్పాడు. వెంటనే ఆ వ్యాపారస్తుడు ఓ మనిషిని పంపి వారిద్దర్నీ పిలిపించి, మూడో 'పెద్దమనిషి'తో వారి తగాదా తీర్చమని చెప్పాడు.

4

ఆ పెద్దమనిషి వారిద్దరిదగ్గర వివరాలు తెలుసుకొని, రైతుతో - "నీవు వడ్డీ వ్యాపారస్తుని దగ్గర 20 శేర్లు ధాన్యమూ తీసుకున్నావు. పైగా ఎదురుతిట్లను తిట్టావు, కనుక

అతనికి 25 శేర్లు ఇవ్వాలి." అన్నాడు.

వడ్డీ వ్యాపారస్తుడు సంతోషంతో ఎగిరి గంతేసి—"ఎటువంటి తీర్పు చెప్పారు? 20 శేర్లు యివ్వమంటే నీలిగాడు. ఇప్పుడు 25 శేర్లు యివ్వాల్సి వచ్చింది," అన్నాడు.

రైతు 25 శేర్లు యివ్వాల్సి వచ్చింది.

ఇప్పుడు ఆ పెద్దమనిషి, ఆ వడ్డీ వ్యాపారస్తుని వంక చూచి—"అతడు యిరవై శేర్లు తీసుకున్నాడని చెప్పటానికి నీ దగ్గర ఆధారాలేమైనా వున్నాయా? మరి అతడు పదిశేర్లే తీసుకున్నానని చెపుతున్నాడు" అని అడిగాడు.

ఆ వడ్డీ వ్యాపారస్తుడు తలవంచుకున్నాడు. అతనిదగ్గర ఆధారాలేమీ లేవు.

పెద్దమనిషి—"నీకు పదిశేర్లు మాత్రమే ముట్టగలవు. కాని, నీవు అతణ్ని తిట్టావు. నీవు తిట్టినట్టు నా దగ్గర ఆధారాలువున్నాయి. నీకు తిట్టటానికి యెట్టిహక్కులూ లేవు. మరి యేమంటావు?" అనడిగాడు.

వడ్డీ వ్యాపారస్తుడు కిందవంక చూస్తూ వుండిపోయాడు. అతని దగ్గర జవాబేమీ లేదు.

పెద్దమనిషి—"కనుక, పది శేర్లకు ఐదుశేర్లు జుల్మానాగా తీసుకోబడతాయి. ఐదుశేర్లు నీకు యివ్వడబతాయి." అన్నాడు గంభీరంగా.

అతడేమీ జవాబివ్వలేక పోయాడు.

రైతు సంతోషంతో వుబ్బి తబ్బిబ్బయి—"మంచి తీర్పు! పదిశేర్లు తీసుకోకపోయాడు. ఇప్పుడు ఐదు శేర్లే తీసుకోవాల్సి వచ్చింది." అన్నాడు.

ఇది విన్నవాళ్లంతా సంతోషంతో—"మనం ఎంత అదృష్టవంతులమంటేనూ? ఈ పెద్దమను

చైన్‌నగర్ కే చార్ బేకార్!

ష్యులు లేకపోయినట్టయితే, మనం ఒహార్నాహారం తన్నుకొని చచ్చే వాళ్ళం!" అనుకున్నారు.

ఈ విధంగా మూడో పెద్ద మనిషి సమస్య పరిష్కారమైంది. కొద్ది రోజుల్లోనే పెద్దపెద్ద భవనాలను కట్టేశాడు. అతడు కూడ తాను స్వయంగా ఏ పనీ చేయడు. అతనిపనులను యితరులే చేసి పెడుతూ వుంటారు.

ఇంకా నాలుగో పెద్దమనిషి వున్నాడు. వ్యాపారస్థుడు అతని కోసం అనేకమార్గాలను వెతికాడు. ఎంత వెతికినా ఎంత తన్నుకున్నా ఉపాయమేదీ దొరికిందికాదు. చివరకు ఓడిపోయి, తనను పంపిన సైతాన్‌దగ్గరకు వెళ్లి, యీ మూడు సంవత్సరాలనుండి జరిగిన కథనంతటినీ వినిపించి— "గ్రామంలోని మూడువంతులభూమి మన స్వాధీనమయింది. అయినా, యింకా నాలుగోవాడు మిగిలివున్నాడు. వాడిపనికూడ పూర్తయితే, ఆ వూళ్లో ప్రతివొక్కడూ మన దగ్గరకు రావాల్సిందే! మనకు బానిసగా బ్రతకాల్సిందే!

సైతాన్ తన ఏజెంటు వీపు తట్టుతూ సంతోషంతో కనుబొమలు యెగరేస్తూ— "వెళ్ళి ఒక మరపెట్టు! ఆ తరువాత నేను చూచుకుంటాను" అంది.

5

ఏడురోజుల్లో చైన్ నగరానికి చేరువలో, ఓ బహిరంగ స్థలంలో మర పెట్టారు. ఓరాత్రివచ్చి సైతాన్ దాంట్లో కాసతనశక్తినిపోసింది.

ఆ మరునాటినుండి గోధుమలు, సజ్జలు, శనగలు— అన్నీ అక్కడ పిండిచేయబడుతున్నాయి. ఆ పిండి చాల సన్నగావుంది. అంత సన్నని పిండిచూచి వూళ్ళోవాళ్లు దంగైపోయారు. అంత సన్నని పిండి వారిదివరకెన్నడూ చూడలేదు. ఆ మరునాటినుండి చైన్‌నగరంలోని పిండిచేసే, తిరుగళ్లన్నీ వ్యర్థమయ్యాయి. ఆ మరునాటినుండి అనాధలు, ఆకలితో అలమటించి ఆసువులు బాయసాగారు. కాని, మిగతావాళ్లంతా సంతోషంగా వున్నారు. తమ అదృష్టానికి తమలోతామే మురిసిపోయారు!

నాలుగో పెద్ద మనిషి ఓ ఎత్తైన అరుగుమీద కూచొని హుక్కా తాగుతున్నాడు. అతడు సాయంత్రానికి చేతినిండా రూపాయిలు తీసుకొని యింటికి బయలుదేరతాడు. అతడు వ్యాపారస్తుని సలహాతో యింకా కొన్ని యంత్రాల్ని అమర్చాడు. ఈ విధంగా సైతాన్ దయా దాక్షిణ్యాలతో నాలుగో పెద్దమనిషికూడ ధనికుడయ్యాడు. అతడూ తనపని తాను స్వయంగా చేసుకోడు, ఇతరులే చేసిపెడతారు.

చైన్ నగరం యిప్పుడు కూడ అదేవిధంగా ఆ రెండుపర్వతాల మధ్య నేవుంది. అక్కడ చూడతగిన కట్టడాలు యెన్నో తయారయ్యాయి. అక్కడ కోర్టులు వున్నాయి, కచేరీలు వున్నాయి, ధర్మసత్రవలు వున్నాయి పెద్దపెద్ద మిల్లులు వున్నాయి; భవనాలు వున్నాయి. నగరానికి మధ్యలో చౌకులో ఆ వ్యాపారస్తుని డబ్భై అడుగుల యెత్తు విగ్రహంవుంది. ఇప్పుడు ఎవరైనా యాత్రికుడు ఆ వూరుమీదగుండ వెళుతూవుంటే చూచి విస్తూపోతాడు; ఆనంద పరవశుడూ అవుతాడు. కాని యిప్పుడక్కడక్కడ చట్టం మారిపోయింది మొదట పనిచేసేవాళ్లంతా తినగలిగేవారు; పనీపాటా లేకుండా తిరిగేవారు మల మల మాడి చచ్చిపోయేవారు. కాని, యిప్పుడు పనీపాటా లేని 'పెద్ద మనుష్యులు' హాయిగా, ఆనందంతో బ్రతుకుతున్నారు; పనిచేసేవారు తిన తిండి లేక మలమలమాడి చస్తున్నారు. అంతే!……

ఆ రేళ్లకొడుకుని వెంటబెట్టుకొని పట్టణవాసపు దంపతులు ఒక సారి బజారుకు వెళ్లి, ఆ కొట్టూ, యీ కొట్టూ తిరిగి ఏవేవో సరుకులు కొన్నారు. సరుకులు కొనుక్కోవటం ఐపోయాక కొడుకుకోసం వెతుక్కొంటే, వాడు కనుపించలేదు. తప్పిపోయిన కొడుకు కోసం ఆ దంపతులు బెంగపడి వూరంతా వెతికారు.

వెతకగా, వెతకగా చివరికి 'అడల్ట్స్ ఓన్లీ' చిత్రం ప్రదర్శిస్తున్న ఒక సినిమా హాలు దగ్గిర, ఆటచూసి బయటకు వస్తున్న జనప్రవాహంలో ఈ కుర్రాడు కనిపించి, "మీరు కూడా యీ ఆటకి వస్తారనుకున్నాను: రాలేదేం?" అని అడిగాడు.

నిర్దోషి

ఆ నాడ దివారం. ఉదయంగంట ఎనిమిది దాటినా భూపతి కూర్చొని యేదో నోట్సు వ్రాసుకొంటున్నాడు. చెల్లెలు స్వరాజ్యంవచ్చి అన్నయ్యా! నాన్న రమ్మంటున్నారని చెప్పి వెళ్ళింది.

నాన్నగారంటే భూపతికి చాలా భయం. తెల్లారేసరికే నాన్న రమ్మనడంతో భూపతి కపుడున అగ్గిపడ్డట్టయింది. తడబడుతున్న కాళ్లతో తొందర తొందరగా పెరడుకెళ్లి పళ్లు శుభ్రంచేసి; మెల్లగా అడుగుపై అడుగువేస్తూ నాన్నగారి గది చేరాడు.

తండ్రి పరంధామయ్య ఆంధ్ర దినపత్రికచూస్తూ ఓమారు భూపతి కేసి చూచాడు. భూపతి గుండె ఆగినంత పనయింది.

పరంధామయ్య పత్రిక మడచి టేబుల్పై వేస్తూ ఏరా! నిన్న నువ్వెక్కడికెళ్లావ్?" అని అడిగాడు.

"నేనాండి! నేను! బడికెళ్ళాను." అన్నాడు తడబడుతూన్న పెదవుల్తో భూపతి

"సాయంత్రం ?"

"ప్రవేటు కెళ్లాను."

"ఏం చెప్పాడు మాస్టరు?"

"ఏం చెప్పలేదండి తెలుస్కొగా వుందని అభ్యాసా లిచ్చి చేసుక రమ్మన్నాడు.

భూపతి యీ మాటనేసరికి పరంధామయ్యకు మండిపోయింది. "యేర ' యెవరివద్ద యీ నాటకం? నిజంగా నీవు ప్రవేటుకెళ్లావా?" అంటూ కండ్లు మరింత పెద్దవిచేసి అడిగాడు.

యస్. గోపాలరెడ్డి

"అవునండి నిజంగానే!"

"వెధవా? అబద్ధాలాడుతావ్ ?"

"లేదండి. కావలిస్తే పంతులికి కబురుచేసి చూడండి."

"ఎంత ధైర్యంరా? నిన్న పరశురాం లైన్ సర్కసుకు మొదటి ఆటకెళ్లి తర్వాత అబద్ధాలు కూడా ఆడతావా ?"

"లేదండి."

"లేదా ? తిరిగీ అబద్ధాలా ?"

"నిజంగా లేదండి. యెవరో గిట్టనివారు కొండాలాడివుంటారు. నిన్న నేను సర్కసుకే పోలేదండి."

"ఆహాహా ! యెక్కడినుండి దిగావురా హరిశ్చంద్రుడవ్ ? సరే.. యీ పుస్తకం యెవరిదో చెప్పు ?"

ఆ పుస్తకం చూచేసరికే భూపతికి గుండె ఆగినంత పనయింది. ఆపుస్తకం తనదే! యింగ్లీషునోట్సు యది యిచ్చటికెట్లా వచ్చిందో అర్థంకాలేదు భూపతికి.

"యిదో యీ జాబు కూడా చదువు" అంటూ పరంధామయ్య ఓ జాబు కూడా యిచ్చాడు. అందులో యిలా వుంది.

మ-రా-రా-శ్రీ, భూపతిగార్కి-

అయ్యా !

నిన్న మొదటి ప్రదర్శనము ముగియగనే మా పాకీవాడికి గ్యాలరీలో యీ పుస్తకం దొరకింది.

నాకిచ్చాడు. నేను పరికించగా అడ్రసు యుండుటగాంచి దీనిని యింగ్లీషునోట్సు లాగుండినది. తమ యింటికి పంపుతున్నాను. లోపలి పేజీలలో తమ యింటి శెలవు.

శ్రీనివాసన్
మేనేజరు
పరశురాంలైన్ సర్కస్.

అని వ్రాసివుంది. భూపతికి యేమి చెప్పాలో తోచలేదు. అలా నిలుచుండి పోయాడు.

"యిప్పుడు తెలిసిందా తమ యోగ్యత. ప్రవేటు కనివెళ్లి పరశురాం సర్కసు కెళ్లడమా? పైగా అబద్ధాలు ఆడడం? యివన్నీ యెవరికొఱకు వెధవా? పెట్టు రెండు డజన్ల గుంజీలు" అన్నాడు పరంధామయ్య ఉక్రోషంతో.

భూపతి యేదో చెప్పుదామని నోరు కదపబోయాడు.

"ఛీ! గాడిదా! పెట్టు శీఘ్రం" అని తండ్రి అనడంతో నోరుమూసుకొని యిరవైనాల్గు గుంజీలు తీశాడు... "సరి...యికపై జాగ్రత్తగా మసలుకో: వెళ్లు;" అనడంతో భూపతి తిన్నగా అవమానంతో తలవంచుకొని బయట పడ్డాడు.

యింతలో చెల్లెలు రాజ్యంవచ్చి "అన్నాయ్! నీ కొఱకెవ్వరో అబ్బాయి వచ్చాడు. గదిలో కూర్చోబెట్టానంది.

భూపతి తిన్నగా గదిచేరాడు. క్లాస్ మేట్ గోపీ కూర్చొనున్నాడు. గోపీని చూడగనే భూపతికి మింగేయాలన్నంత కోపం వచ్చింది. కానీ పెదిమలు కదపలేక పోయాడు.

"క్షమించరా! భూపతీ! నిన్న నీవద్ద యింగ్లీషునోట్సు తీసుకెళ్లాను. రేపు ఆదివారం గదా! అని కడత్రోవనే సర్కసుకెళ్లాను. సర్కసు వదలడంతో; ఆ రద్దీలో నీ నోట్సు అచ్చటే వదిలేశాను. తెల్లారి గమనం రావడంతో సర్కసుడేరా కెళ్లి విచారించగా మీ యింటికి పంపినట్లు తెలిపారు. చేరిందో లేదో? కనుక్కుపోదామని వచ్చాను అన్నాడు గోపీ.

భూపతి పొంగి వస్తూన్న దుఃఖాన్ని అణచుకొంటూ మెల్లగా "చేరిందన్నాడు."

గదిలోని సంభాషణంతా వింటూన్న స్వరాజ్యం తుఱ్ఱున వెళ్లి తండ్రికి చెప్పడంతో పరంధామయ్యకు యేడవాలో నవ్వాలో తెలియలేదు. వెంటనే భూపతిని పిలచి రెండురూపాయలిచ్చి; సాయంత్రం సర్కసుకెళ్లి రమ్మన్నాడు. ★

ఎందుకు? ఏమిటి?

1. పాలపుంత చాలా పాతవింత

బాగా చీకటిగావున్న రాత్రివేళ తల పైకెత్తి చూడండి. ఆకాశం ఒక పెద్ద సభామందిరం లాగా కనిపిస్తుంది. అనేకకోట్ల నక్షత్రాలు గుంపులు గుంపులుగా సభకు హాజరై, నిశ్శబ్దంగా ఏదో విచిత్రం చూస్తున్నట్టు కనిపిస్తాయి.

ఈ విడివిడి నక్షత్రాలేకాక, ఆకాశాన్ని మధ్యగా రెండుగా చీల్చుకుంటూ ఈ కొసనుంచి ఆ కొసకు ఒక తెల్లటి వెలుగుమబ్బు కూడా కనిపిస్తుంది. దీన్నే పాలపుంత అంటారు. దీన్నే కర్పూర ద్వీపం అన్నా అనొచ్చు. దీనిమీదనే వచ్చేవారంనుంచీ ఒక చక్కని నవల పిల్లలకోసం ప్రచురించబోతున్నాము.

ఈ పాలపుంత ఎన్నో వేల ఏళ్లనుంచీ ఎన్నో వేలమంది మనుషులు చూస్తూవచ్చిన పాతవింతే గాని కొత్త వింత కాదు. ఈ పాలపుంత నిజంగా ఏమిటి? మామూలుగా చూస్తే, మెరుస్తున్న మబ్బులాగే కనిపిస్తుంది. కాని మంచి దూరదృష్టి కల టెలిస్కోపుల సహాయంతో చూడండి. అనేక నక్షత్రాలు, లెక్కపెట్టలేనన్ని నక్షత్రాలు కనిపిస్తాయి. ఇవి మామూలుగా కనిపించే నక్షత్రాలకన్న ఇంకా ఎంతో దూరంలో ఉన్నాయన్నమాట. అందుకనే అవి అంత దగ్గిరదగ్గిరగా ముద్ద కట్టుకు పోయినట్టు కనిపిస్తాయి. అందులో ఒక్కొక్క నక్షత్రం ఒక్కొక్క సూర్యుడు లాంటిది.

ఆకాశంలో అక్కడక్కడ చెదురుగా ఇటువంటి మెరుస్తున్న మబ్బుతునకలు కనిపిస్తాయి. ఇవి కూడా పాలపుంతలాగే అనేకకోట్ల నక్షత్రాల సముదాయాలు. అన్నిటిలోకీ ఈ పాలపుంతే వింతగా కనబడుతుంది.

ఆకాశం అనే నల్లటిఅమ్మాయి, నక్షత్రాలనే మణులు, రవ్వలు పొదిగిన వడ్డాణం పెట్టుకుని ఉన్నట్టు కనిపిస్తుంది కదూ ఈ పాలపుంత!




రాజకపూరు నిర్మించిన "బూట్ పాలిష్"లో రతనకుమార్ బూట్ పాలిష్ చేస్తున్న దృశ్యం.



వాహినివారి "పెద్దమనుషులు"లో తిక్క శంకరానందస్వాములుగా రేలంగి, అతని వితంతుసోదరిగా జయలక్ష్మి.

★

పెద్దమనిషి అంటే మామూలుగా ఉన్న అర్థాన్ని తలక్రిందులుగా చేసే పెద్దమనుషుల్లో ఒకడుగా కుటుంబరావు, అతనిభార్యగా రాజ్యలక్ష్మి "పెద్దమనుషులు"లో ఒకదృశ్యం.



"నిరుపేదలు"

(ఒక పరిశీలన)

గోకుల్ పిక్చర్స్‌వారి "నిరుపేదలు" ఈ నెల 2 వ తేదీన ఆంధ్రదేశంలో విడుదలఅయింది. నిరుపేదల జీవిత కష్టాలను చూపిస్తూ ఇదివరలో వచ్చిన చిత్రాల కంటె ఇది చాలా విషయాల్లో ఉత్తమంగా ఉంది. కథకునియొక్క, నిర్మాతల యొక్క లక్ష్యశుద్ధి కథా కథనంలో బాగా వ్యక్తమవుతున్నది. ఏ నిరుపేదల కష్టసుఖాలను నిర్మాతలు చూపించదలచున్నారో ఆ నిరుపేదలు ఈ చిత్రాన్ని చూసి, తమ ప్రతిబింబాన్ని పూర్తిగా కాకపోయినా, చాల వరకు పోల్చుకోగలరనడంలో సందేహం లేదు.

ఈ చిత్రం ఈ నెల 8 వ తేదీన మైలాపూరు, కామధేను థియేటరులో పత్రికా ప్రతినిధులకు, పలువురు సినిమా ప్రముఖులకు చూపించబడింది. దర్శకుడు తాతినేని ప్రకాశరావు; కథ కె. ప్రత్యగాత్మ; సంభాషణలు అనిశెట్టి; సంగీతం టి. వి. రాజు; కెమెరా బి. ఎస్. రంగా; ఎ. నాగేశ్వరరావు, జమున, ఆర్. నాగేశ్వరరావు, రమణారెడ్డి, కుటుంబరావు, సురభి బాలసరస్వతి, సుధాకర్ అడుసుమిల్లి శేషగిరిరావు మున్నగువారు నటించారు.

వానలు లేక, పంటలు పండక, క్షామానికి లోనై, అనేకులు పేదరైతులు జీవనోపాధి వెదుక్కుంటూ తమ ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి వలస వెళతారు. వీరిలో నారాయణ (నాగేశ్వరరావు) అనే యువకు డుంటాడు. దారిలో అతని ముసలి తండ్రి చనిపోగా ఒంటరివాడవుతాడు. నారాయణకు ఎక్కడా పని దొరకదు. సొమ్మసిలిపడిపోగా వృద్ధుడైన ఒక రిక్షావాలా అతన్ని తన యింటికి తీసుకుపోయి ఆహారమిస్తాడు. నారాయణ ఆ రిక్షావాలా ద్వారా తనుకూడా ఒక రిక్షా సంపాదించి, దానివల్ల పొట్టపోసుకుంటూ, వృద్ధుని కోరిక మీద అతని యింట్లోనే నివసిస్తూ ఉంటాడు. వృద్ధుడికి కమల (జమున) అనే కూతురు (రిక్షావాలా కూతురికి ఇంత నాజూకు పేరు బాగా లేదు—), రాముడు (సుధాకర్) అనే చిన్నకొడుకు ఉంటారు. కమల, నారాయణ పరస్పరం ప్రేమించుకుంటారు. వృద్ధుడుకూడా వీళ్లిద్దరికీ పెళ్లి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని భావిస్తూ ఉంటాడు.


ఇలా ఉండగా నారాయణకు ఒక ఆలోచన కలుగుతుంది. రోజుకి అర్థ రూపాయి చొప్పున తను కష్టించి సంపాదించే డబ్బులో భాగం రిక్షా యజమాని (ఆర్. నాగేశ్వరరావు) కెందుకు పోవాలని, తనే ఒక రిక్షా కొనుక్కుంటే ఈ నష్టం ఉండదనీ ఆలోచిస్తాడు. రిక్షాఖరీదు 150 రూపాయలు. దీనికోసం రాత్రింబగళ్లు ఎడతెగని కష్టంచేసి అయిదు నెలల్లో 145 రూపాయలు సేకరిస్తాడు. ఈ డబ్బు మొదటినుంచీ రిక్షా యజమాని ధర్మయ్యదగ్గరే దాస్తాడు. చివరికి తనడబ్బు ఇప్పించమని అడుగుతాడు. ఈ డబ్బుతో నారాయణ రిక్షా కొనదలిచాడని తెలిసి ధర్మయ్య "ఇక్కడ నీ డబ్బేం లేదు. పో"మ్మంటాడు. చెమటోడ్చికూడబెట్టిన డబ్బు ఇలా అన్యాక్రాంతంకాగా, ఈ అన్యాయాన్ని పోలీసులవద్దకూడా

ఎన్నార్

ఋజువుచేసుకోలేక, నారాయణ ఆరాత్రి దొంగతనానికి పూనుకుంటాడు. ధర్మయ్య యింట్లో ప్రవేశించి తనకు రావలసిన డబ్బు మాత్రమే తస్కరించి వెళిపోతుండగా ధర్మయ్యకు దొరికిపోతాడు. నారాయణకు రెండునెలల జైలుశిక్ష పడుతుంది. ఈలోగా వృద్ధుడైన రిక్షావాలా జబ్బుపడి, అతడు, కమలా, రాముడూ కష్టాలపా లవుతారు. ధర్మయ్య సహాయం చేస్తాడని కమల అతని వద్దకు సంజవేళ వెళ్ళగా, అతడు ఆమెని చెరచాలనే ఉద్దేశ్యంతో పదిరూపాయలిస్తాడు. ఆ డబ్బుతో తండ్రికి పథ్యం అవీ కొనుక్కు వెడుతుంది. తండ్రి ఆమెశీలాన్ని శంకించి, ఆ మనోబాధతో వెంటనే మరణిస్తాడు. గూడెంవాళ్ళంతా కమల వ్యభిచారిణి అని నిందిస్తారు. బూట్ పాలిష్ వృత్తితో డబ్బు సంపాదిస్తున్న రాముడు కారుకిందపడి ఆస్పత్రిలో చేరుతాడు. ఈ కష్టాలు భరించలేక కమల రైలు కింద ఆత్మహత్య చేసుకోబోతే [illegible] సమయానికి జైలునుంచి విడుదలయిన నారాయణ కమలను రక్షిస్తాడు. కమల సుశీల అని అంతా గ్రహిస్తారు. ఆస్పత్రిలో కాలు ఆపరేట్ చేయబడిన రాముణ్ణి నారాయణా, కమలా కలుసుకుంటారు. రాముడు తనకు పరిహారంగా కారు యజమాని ఇచ్చిన 800 రూపాయలు తన అక్క పెళ్ళికి కట్నంగా నారాయణకు ఇచ్చివేస్తాడు. దానితో రిక్షా కొనుక్కుని ఆశ సఫలం చేసుకోమని నారాయణకు రాముడు సలహాయిస్తాడు.

రిక్షావాళ్ళ జీవితానికి సంబంధించినంత వరకూ, చిన్నచిన్న వివరాల దగ్గిర్నించీ సహజత్వం బాగా పోషించబడింది. రిక్షావారి దుస్తులు, మేకప్, వారు నివసించే గుడిసెలు చాలా సహజంగా ఉన్నాయి. ఏ పాత్రనూ 'గ్లామరైజ్' చెయ్యకుండా యథాతథంగా చూపెట్టారు. రిక్షావారి మనస్తత్వం చిత్రణకూడా వాస్తవానికి దగ్గరగా ఉంది. నారాయణ కొత్తగా రిక్షా చేతబట్టుకుని రావడం చూసి, పాతరిక్షావాళ్ళు అతన్ని తరిమివెయ్యడానికి చూస్తారు. ఒక్క బేరంవస్తే పది మంది మూగి తమలో తాము కీచులాడుకుంటారు. తోటివాడు కష్టాల్లో ఉన్నప్పుడు చేతనైన సానుభూతి చూపి, ఓపిన సహాయం చేస్తారు. వీరిలోనూ ఒక "విద్రోహి" (రమణారెడ్డి) ఉంటాడు. నారాయణ కొంత బతికి చెడినవాడు కనుక, సొంత రిక్షా సంపాదించాలనే కోరిక అతనికి సహజంగా కలుగుతుంది. మధ్య తరగతి మనిషి తనకు సొంతయిల్లు ఉంటే బాగుండునని కోరుకోవడంలాంటిదే నారాయణకోరిక కూడాను. దీన్ని గొంతెమ్మకోరిక అని మిగతా రిక్షావాళ్లు ఎగతాళి చేస్తారు. కాని నారాయణ తన పట్టుదల నెరవేర్చుకునేదాకా శ్రమిస్తాడు.

మానసిక చిత్రణంకోసం డైరెక్టరు కొన్ని మంచి దృశ్యాలు ప్రవేశపెట్టారు. నారాయణ రిక్షా కొంటానన్నప్పుడు ధర్మయ్య భావాలను, తను రిక్షా కొనుక్కుని పొందబోయే ఆనందాన్ని ఊహించుకుని నారాయణ, అతన్ని పెండ్లాడి తను పొందబోయే సంతోషం ఊహించుకుని కమలకనే జాగ్రత్స్వప్నాలు చిత్రించిన పద్ధతి బాగున్నది. పేదవారిఎదుట రూపాయలు స్త్రీ మూర్తులు దాల్చి నృత్యం చేయడం మంచి అంశమే గాని అదికూడా మనోప్రపంచంలోనే జరిగినట్లు చూపించవలసింది. ఆ నృత్యం యథార్థంగా స్టేజిమీద జరిగినట్లుచూపడం, ఆ స్టేజి కృత్రిమంగా ఉండడం లోపంగా [illegible]



“శ్వాన్ లేక్” అనే రష్యన్ బాలేఆధారంగాతీసిన సోవియట్ చిత్రంలో ప్రైమా బాలెరినా అయిన గలినా ఉలనోవా

★

అదే చిత్రంలో, మాంత్రికునినుంచి తప్పించబడిన హంస ఓడెట్టా, రాజకుమారుడు సీగ్‌ఫ్రీడ్.



★ "నిరుపేదలు" ★

ఈ చిత్రం బాక్సాఫీసు సూత్రాలను ధిక్కరించి తీయబడింది. కాని కథా రచనలో మాత్రం కొన్ని పాతఫార్ములాలు జొరబడ్డాయి. వీటివల్ల చిత్రంపొడుగు ఎక్కువై కథ పల్చబడి, పోనుపోను విసుగు పుట్టిస్తుంది. కమలను ధర్మయ్య లోబరుచుకోన జూడడం, ఆమె శీలాన్ని తండ్రీ, ఇతరులు శంకించడం, ఆమె ఆత్మహత్యాప్రయత్నం ఇవన్నీ వృథా. బుల్‌బుల్ (సురభి బాలసరస్వతి) కథలో నిర్వహించిన పాత్ర ఏమీ లేదు. రాముడు కారుకింద పడడం వగైరా కూడా అతికినట్లే ఉంది. వీటన్నిటివల్లా చిత్రంలో మెలోడ్రామా పాలు ఎక్కువై, చిత్రం పొడుగైనట్లు అనిపించింది.

శీలవతియై ఉండి కూడా నలుగురిచేతా శంకించబడిన స్త్రీ మన స్సత్వంమీద డైరెక్టరు ప్రకాశరావుగారి అభిప్రాయాలు చిత్రంగా ఉన్నాయి. అమాయిక అయిన కమల తన్ను ఇరుగుపొరుగువాళ్లేదో అనగానే, నిజంగా తప్పుచేసిన వ్యక్తి పొందినంత మనస్సంక్షోభం పొందింది. నిజంగా నిరపరాధిని అయిన స్త్రీ ఆత్మవిశ్వాసం కోల్పోక తన నిర్దోషిత్వం క్రమేణా నిరూపించుకో జూస్తుంది గాని తక్షణం ఆత్మహత్యకు ఉపక్రమించదు.

అయితే ఈ చిత్రంలో బలమైన 'డ్రామా,' సంఘర్షణ ఉండడంవల్ల పై లోపాలు బాధించవు. సొంత రిక్షా కొనుక్కోవాలనే నారాయణ కోరికకూ, అతడిలాగే అందరు రిక్షావాళ్లూ కొనుక్కుంటే తన నోట్లో దుమ్ము పడుతుందనే ధర్మయ్య భయానికీ గల సంఘర్షణవల్ల 'డ్రామా' ఏర్పడుతున్నది. అయితే ఒక చిన్న సూచన. ఇలా ధర్మయ్య భయపడడానికి వాస్తవంగా ఆధారం లేదు. ప్రతి మధ్యతరగతివాడూ ఇల్లు కొనుక్కోడం అసంభవమైనట్లే, ప్రతి రిక్షావాడూ రిక్షా కొనుక్కోడం అసంభవమే. అందుచేత ధర్మయ్య భయం సహేతుకమైనది కాదు. కూలివాళ్లు శ్రమసాధనాలను చేజిక్కించుకోవడం పెట్టుబడిదారుకు భయకారణమవుతుందనేది నిజమే. అయితే కూలివాళ్లు సామూహికంగా సంఘటిత పడినప్పుడే శ్రమ సాధనాలు వారికి చేజిక్కడం, వారి సామూహిక సంఘటనను చూసి యజమాని భయపడడం జరుగుతుంది. వెయ్యిమంది నారాయణలు విడివిడిగా రిక్షాలు కొనుక్కున్నప్పటికీ మరొక వెయ్యిమంది బాడుగతీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు కనుక ధర్మయ్య రిక్షాలవ్యాపారం మూలపడే అవకాశం లేదు. అందుచేత నారాయణ తోటి రిక్షావాలాలను సంఘటించి, సహకారపద్ధతిమీద, అందరూ కూడబెట్టిన డబ్బులోంచి రిక్షాలను కొనివేసే ఆలోచన చేస్తే ధర్మయ్యకు నారాయణ నిజమైన శత్రు వయ్యేవాడు. తనమట్టుకు తాను రిక్షా కొనుక్కోదలచిన నారాయణ పైవిధంగా చేస్తే, అతని పాత్ర మరింత ఉదాత్తమై భాసించేది. అప్పుడు ఏర్పడే డ్రామాకు సాంఘిక విశిష్టత (Significance) రెండింతలయ్యేది. ఏది ఏమైనా, ఇంత విస్తృతావకాశాలు కలిగి, ఆలోచన రేకెత్తించే కథ నిర్మించిన ప్రత్యగాత్మగారు అభినందనీయులు.

నటీనటులందరూ బాగా నటించారు. నాగేశ్వరరావు, జమున, రిక్షావాలా ఖాసిమ్‌గా నటించిన అడుసుమిల్లి శేషగిరిరావు, గుమాస్తా కుటుంబరావు, ఆర్. నాగేశ్వరరావు, సుధాకర్ అందరూ ప్రశంసార్హులు.

అనిశెట్టి సుబ్బారావుగారి సంభాషణలు చిత్రవిజయంలో ప్రధాన పాత్ర వహించాయనడంలో సందేహం లేదు. సంగీతం బాగున్నది. పాటల సంఖ్య తగ్గిస్తే కథలో టెంపో చెడకుండా ఉండేది. ప్రేక్షకులకు పాటలు లేందే చిత్రం రుచించనిపక్షంలో, మన నిర్మాతలు వినోదకరములైన పాటలే పెట్టక ఏడుపుపాట లెందుకు పెట్టి వినిగిస్తారో తెలియదు.

* * *

"నిరుపేదలు" చిత్రంలోంచి సుమారు వెయ్యి అడుగుల ఫిలిము సెన్సార్లు కత్తిరించారట. ఇలా కత్తిరించబడిన భాగంలో నిరపాయకరమైన "కీప్ లెఫ్ట్" అనే ట్రాఫిక్ బోర్డు దృశ్యం కూడా ఉందట. ఇదేదో కమ్యూనిస్టు నినాదమని సెన్సార్లు భయపడినట్టున్నారు. త్వరలో ఇటువంటి ట్రాఫిక్ పలకలను రోడ్లమీదినుంచి కూడా తొలగించాలని సెన్సార్లు ప్రభుత్వానికి సలహా యిస్తారేమో తెలియదు. సైనికులకు కవాతు నేర్పేటప్పుడు ఉపయోగించే "లెఫ్ట్ - రైట్" అనే మాటల్లో 'వామపక్షమే సరియైనది' అనే ధ్వని వుంది కనుక అదీ నిషేధించవచ్చును. ఒకానొక పార్టీ జెండా రంగు ఎరుపు కనుక ప్రభుత్వ కార్యాలయాల్లో ఎర్ర సిరా వాడకం నిషేధించవచ్చును. ఇలా పోతే సెన్సార్లు ఎక్కడ తేల్తారు! (ఎర్రసిరా నిషేధించడానికి ముందు ప్రభుత్వ కార్యాలయాల్లో

ఇటాలియన్ చిత్రం "ఆనా"

ఒకవారంకిందట "ఆనా" అనే మంచి ఇటాలియన్ చిత్రం మద్రాసు వచ్చింది. ఇది ఇంగ్లీషులో పునర్నిర్మించబడినచిత్రం. "బిట్టర్ రైస్"లోని ప్రముఖతార సిల్వానో మంగానో ఇందులో ఆనా అనే నర్సుగా నటించింది. ఆనా యౌవన ప్రారంభదశ అవినీతికి ఆలవాలమైన ఒక నైట్‌క్లబ్‌లో గడిచింది. ఆమెకొక ప్రియుడుంటాడు. అతని పిడికిలినుంచి బయటపడి నిర్మలజీవితం గడపడానికి ఆమె ప్రయత్నిస్తుంది. ఆంద్రే అనే ఒక ఉన్నతవంశీకుడు ఆమెను, ఆమె అతణ్ణి ప్రేమించుకుంటారు. ఆమె తన పూర్వప్రియుణ్ణి విడిచిపెట్టి ఆంద్రేను వివాహం చేసుకోవాలనుకుంటుంది. దీనికి ఆమె పూర్వప్రియుడు అడ్డం వస్తాడు. అతణ్ణి ఆంద్రే తీవ్రంగా గాయపరుస్తాడు. ఆనా నిష్కళంకమైన ఆంద్రే జీవితంలో, తను కళంకంలాగా ప్రవేశించడాని కిష్టంలేక, చివరికి ఒక ఆస్పత్రిలో నర్సుగా చేరుతుంది. తన జీవితం బాధితుల సేవకు అంకితం చేస్తుంది. మానవసేవలో ఆమెకు మనశ్శాంతి లభిస్తుంది. ఆంద్రీఆమెను తిరిగి తన్ను వివాహం చేసుకుని సుఖించమని అడుగుతాడు. కొంతసేపు ఆమె ఆస్పత్రి విడిచిపోవాలనే నిర్ణయానికి వచ్చినా, చివరికి మానవ సేవాదర్మమే ఆమెను జయిస్తుంది.

ఈ చిత్రం తక్కిన ఇటాలియన్‌చిత్రాల సంప్రదాయంలోనే ఉన్నది. వ్యక్తిగతమూ, సంకుచితమూ అయిన సౌఖ్యాభిలాషకూ, సమాజగతమూ, విశాలమూ అయిన ఆనంద సముపార్జనకూగల సంఘర్షణ కథావస్తువులో ప్రబలంగా చూపబడింది. వ్యక్తికి నిజమైన ఆనందం సంఘంలో, దాని కష్టసుఖాల్లో తాదాత్మ్యం పొందినప్పుడే లభిస్తుందనేది నిరూపించబడింది. ఇది కేవలం సిద్ధాంతంగా కాక ఒక నైట్‌క్లబ్ స్త్రీ యొక్క జీవిత సహజ పరిణామంగా చిత్రించబడింది.

హాలివుడ్ చెత్తచూసిన తర్వాత ఈ చిత్రం చూస్తే ఎంత 'రిలీఫ్' కలుగుతుంది! హిచ్‌కాక్ చిత్రాల్లో ఉన్న టెక్నిక్, వాటిలో లేని మానవత్వపు విలువలు, సౌకుమార్యం ఈ చిత్రంలో ఉన్నాయి. హాలీవుడ్ చిత్రాల్లో ఎక్కువభాగం మనుష్యజాతిమీద రోత పుట్టిస్తాయి. ఈ చిత్రం మనిషిమీద విశ్వాసాన్ని పునఃప్రతిష్ఠితం చేస్తుంది. "ఆనా" లోని కథా వస్తువు వంటిది ఇదివరలో పలువురిచేత పలురకాలుగా చిత్రించబడింది. అయితేనేం, ఈ కొత్త చిత్రణలో కావలసినంత ఆకర్షణ ఉన్నది. ప్రతి చిన్న ఉపపాత్ర దగ్గిర్నించీ ఒక వ్యక్తిత్వంతో, సజీవంగా భాసిస్తుంది.

ఇంగ్లీషు డబ్బింగ్ దోషభూయిష్ఠంగా ఉండడం, ఈ చిత్రం విడుదలయిన థియేటరులో తెర దారుణంగా ఉండడం శోచనీయం. ★

ఉండుకున్నటువంటి 'రెడ్ టేపిజం'ను కూడా కొస్తంత రద్దుచేయిస్తే జనం బతికిపోతారు.)

ఇటీవల విడుదలయిన తెలుగు చిత్రాల్లో అసభ్యములైన అంశాలు కొన్ని కనిపిస్తున్నాయి. వీటిని అనుమతించినప్పుడు లేని ధర్మభీతి "కీప్ లెఫ్ట్" దగ్గిర, "నిరుపేదలు" లోని మరి రెండు పాటలదగ్గిర ఎందుకు రావాలో అర్థం కావడంలేదు.

* * *

త్వరలో చిత్రాలు నిర్మించే పద్ధతి ప్రోత్సహించ దగినదేకాని, సత్వర నిర్మాణం కోసం టెక్నికల్ విలువలను, ఇతర్రా నిర్దుష్టతను బలిచెయ్యడం వాంఛనీయం కాదు. ఒకే చిత్రం మూడేళ్లలో తీయవచ్చును, మూడునెలల్లోనూ తీయవచ్చును. మూడేళ్లలో తీసినంత మాత్రాన చిత్రం బాగుంటుందనీ, మూడునెలల్లో తీసినందువల్ల బాగుండదనీ ఎవరూ చెప్పలేరు. అయితే మూడు నెలల్లో తీసే చిత్రం బాగుండాలంటే, మూడేళ్ళ పేపర్‌వర్కు మొదలైన తతంగం చెయ్యాలి. స్క్రిప్టు మీద ఎక్కువకాలం, శ్రమ, శ్రద్ధ వెచ్చించడంవల్ల, అసలు షూటింగ్ చకచకా, ఒడుదుడుకులు లేకుండా జరిగిపోవడానికి వీలవుతుంది. మన చిత్రరంగంలో దీనికి వ్యతిరేకంగాజరిగింది. స్క్రిప్టు అతిత్వరలో తయారవడమో, లేక షూటింగ్ జరిగినన్నాళ్లూ తయారులో ఉండడమో, షూటింగ్ మాత్రం ఎక్కువనాళ్లు పట్టడమూ జరిగింది. నేపాళ మాంత్రికుడి ప్రాణం వాడి గడ్డంలో ఉన్నట్టు, చిత్రానికి ప్రాణం స్క్రిప్టులో ఉంది. ఈ స్క్రిప్టు రచన ఎన్నాళ్ళు పట్టినా దండగ కాదు. ★

గ్రంథస్వీకారం

తెలుగు పాపాయి

బాలగేయాల సంపుటి; రచయిత: శ్రీనివాసకాశ్యప; వెల 0-8-0; ప్రతులకు బాలసరస్వతీ బుక్ డిపో, కర్నూలు. అందంగా, పిల్లలకు ఆకర్షవంతంగా ముద్రించబడిన ఈ చిన్న పుస్తకంలో 12 గేయాలున్నాయి. పిల్లలు చదువుకోవడానికీ, పాడుకుని ఆనందించడానికీ ఈ పాటలు చాలా బావుంటాయి.

అధర్వణాచార్యుడు

రచయిత సాహిత్య విద్యాప్రవీణ దురిశేటి వేంకటరామాచార్యులు (నూజివీడు); వెల 1-0-0; ప్రతులకు ఎర్రోజు మాధవాచార్యులు, అప్పారాయ గ్రంథమాల, నూజివీడు. నన్నయ సమకాలికుడుగా, భారత అనువాద కర్తగా ప్రసిద్ధుడైన అధర్వణాచార్యుని ప్రజ్ఞకు జోహారుగా, ఆయన రచించినా డనబడు ఆంధ్రభారతం అగ్నికాహుతి యైనందుకు బాష్పాంజలిగా ఈ పద్యకావ్యం వ్రాయబడింది. రామాచార్యులుగారి ఉదాత్తభావనాశక్తి, హుందాగా నడిచే పద్యాల నిర్మాణప్రాగల్భ్యం, ధారాశుద్ధి ఈ ఖండకావ్యం అంతటా గోచరిస్తున్నాయి.

కాశీయాత్ర

రచయిత శ్రీమత్ సభాపతి స్వాముల వారు; వెల 1-4-0; ప్రతులకు కుమారన్ సెంటమిజ్ పబ్లిషింగ్ హౌస్, 40, సభానాయిగర్ స్ట్రీటు, చిదంబరం, ఎస్. ఆర్; లేక శ్రీ వైద్యలింగ స్వామిగళ్, నాగరత్రం, బెనారస్. కాశీయాత్ర, ఉత్తర, దక్షిణ హిందూస్థాన పుణ్యతీర్థయాత్ర చేయగోరేవారికి ఉపయుక్తంగా రచించబడినది ★



భరణివారి "చక్రపాణి"లో సి. ఎస్. ఆర్, టి. జి. కమలాదేవి.


★

మిల్లుకార్మికుడు దుర్మరణం పొందడంతో ఆపద వచ్చిపడింది.
నేషనల్ ఆర్ట్స్ థియేటర్ వారి "తోడు దొంగలు"లో గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎన్ టి రామారావు.



క్లేర్ బహుమతులు

"ఫిల్మ్‌ఫేర్" పత్రికవారు గత సంవత్సరం ఆగస్టులో జరిపిన బాలట్ ఫలితంగా అధికసంఖ్యాకుల ఓట్లు పొందిన సినిమా వ్యక్తులకు అయిదు ట్రోఫీలు ఈ నెల 22 వ తేదీన బొంబాయిలో బహూకరించబడనున్నాయి. వోటింగులో పాల్గొన్న సుమారు 26000 మంది ప్రేక్షక జనులనుంచి స్త్రీ పురుష లిద్దరిని ఎన్నుకొని వారిచేత ఈ బహుమతు లిప్పిస్తున్నారు. ట్రోఫీలు ప్రముఖ శిల్పి ఎన్. జి. పన్సారే చేత కంచుతో నిర్మించబడినవి. ఒక నరకి నృత్యభంగిమం చూపిస్తున్న ఈ ట్రోఫీలు అన్నీ ఒకే మోస్తరువి. "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రికలో సినిమా విమర్శకు చాలాగా బహుకాలం పనిచేసి గత సంవత్సరం మార్చి 11 న కీర్తిశేషురాలైన క్లేర్ మెండోంకా పేరు మీదుగా ఈ బహుమతులకు "క్లేర్" అని పేరు పెట్టారు. అమెరికాలో చలనచిత్రకళను ప్రోత్సహించడానికి ఏటేటా "ఆస్కార్" బహుమతు లివ్వబడతాయి. ఆదే పద్ధతిలో భారతదేశంలో సినిమా రంగంలో ఉత్తమప్రజ్ఞ కనబరచిన వ్యక్తులను ప్రోత్సహించడానికి ప్రేక్షకుల వోటింగును అనుసరించి ఈ "క్లేర్" బహుమతులను "ఫిల్మ్‌ఫేర్" వారు ఏటేటా ఇస్తారట ★



బొంబాయి సినిమాపత్రిక "ఫిల్మ్‌ఫేర్" సినిమారంగంలో ఉత్తమ ప్రజ్ఞ కనపరిచిన అయిదుగురు వ్యక్తులకు ఈనెలలో బహూకరించనున్న ట్రోఫీ లో ఒకటి


'బాలే' కాలిజోళ్ల బహుమానం

గత వారం సంచికలో ప్రకటింపబడినట్లు సోవియెట్ బాలెరినా మయా ప్లెసెట్‌స్కాయా శ్రీమతి తారాచౌదరికి తన కాలిజోళ్ళను బహూకరించినందుకు, ఈమె స్వీకరించినందుకు నొచ్చుకుంటూ, ఇది మనజాతికి అవమానమని బళ్ళారి వాస్తవ్యులు ఎమ్. ఎస్. శాంతికుమార్ ఉత్తర లేఖలో ఆక్షేపణ తెలిపారు.

ఈ కాలిజోళ్లు మామూలుగా వాడుకునే కాలిజోళ్లు కాదు 'బాలే' నృత్యం చేసేటప్పుడు ఉపయోగింపబడే ప్రత్యేకమైన జోళ్లు 'బాలే' నృత్యపద్ధతిలో ఈ ప్రత్యేకమైన జోళ్లకు విశిష్టపాత్ర ఉన్నది. మన సంప్రదాయంలో కాలిగజ్జెలు ఎంత ప్రధానాలంకరణమో, పాశ్చాత్యులకు ఈ జోళ్లు అంత ప్రధానం. వాటిని బహూకరించడంలో తప్పేమీ లేదు. ఇవి బహూకరిస్తూ శ్రీమతి చౌదరితో బాలెరినా ఇలా అన్నది: "నాకు కీర్తిని, ప్రజాదరాన్ని ఆర్జించి పెట్టిన, నాకు ప్రియాతిప్రియమైన ఈ జోళ్ళకంటె మంచి బహుమానం మీకు ఇవ్వలేను మీ ఉత్తమకళకు, మీ దేశపు ఉన్నతకళా ఈసంప్రదాయాలకు వినయ విధేయతలతో చిన్న కానుక సమర్పించుకుంటున్నాను"

ఈ కానుకను శ్రీమతి చౌదరి కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరించింది. ★

రోహిణీవారి "ప్రతిజ్ఞ" శతదినోత్సవానికి బెజవాడలో సభ జరిగినప్పటి దృశ్యం



★ పరీక్ష ★

(9-వ పేజీ తరువాయి)

"పోనీండి - పాపం...ఏం చేస్తాడు?"

"పాపం—పుణ్యం...సరే."

నీరసంగా కణతలు నొక్కుకుంది రమ. జ్వరం వొదిలినట్లు ఉంది - కప్పుకున్నవన్నీ ప్రక్కకి తోసి, నెమ్మదిగా లేచి కూర్చున్నది రమ.

"తెలివొచ్చిందా?—ఎలా ఉంది?"

అత్తయ్య వొచ్చి తనని లేవదీసింది.

ఏలా ఉంది? - ఎలా? ఆలోచనలో పడింది రమ.

"కొంచెం కాఫీ తాగు..."

"వొద్దు—తాగాలని లేదు."

నిజంగా త్రాగాలనిపించలా..నోరంతా చేదు కట్టినట్లు ఉంది.

"అలా అనకు-నీరసంగా ఉంటుంది..."

తనని కుర్చీలో కూర్చోపెట్టి ఆమె వంట ఇంటిలోకి వెళ్ళింది.

"నీరసంగా ఉందా రమా?"

వొచ్చి అడిగాడు ప్రకాశం.

"ఆఁ...."

"జ్వరం తగ్గిందికదూ?"

"ఆఁ..."

కొంచెం ఊరుకుని, "ఒకటడిగేదా?" అన్నాడు ప్రకాశం.

ఏమిటన్నట్లు చూసింది రమ.

"జ్వరం ఎందుకని వొచ్చింది?"

"ఏమో..."

"నాకు తెల్సులే..."

"ఏం?"

"రాత్రి - కోపం వొచ్చింది..."

రమ మాటలాడలేదు.

"కదూ?"

"లేదు - "

"అన్నీ అబద్ధాలు..."

చిరునవ్వు నవ్వాడు ప్రకాశం. కొద్దిసేపు ఎవ్వరూ మాటలాడలేదు. ఇంతలో కాఫీ తెచ్చి ఇచ్చింది అత్తయ్య. కష్టంగా త్రాగి, కుర్చీలో జేరబడ్డది రమ.

"నిద్రపోతావా?"

"ఏదో చేస్తాను - మీరు వెళ్ళండి..."

హటాత్తుగా వొచ్చిన ఈ కాఠిన్యానికి అర్థం తెలియక తెల్లబోయి చూస్తున్నాడు ప్రకాశం.

"ఏమిటి- రమా అది?"

"నిజం - ఒకసారి చెప్తే తెలీదూ?... వెళ్ళిపొండి."

ఆమె కళ్ళు ఎర్రబడ్డాయ్. ప్రకాశం కొంచెం భయపడ్డాడు.

"ఏమిటెరమా నువ్వనేది?"

"మిమ్మల్ని వెళ్ళమని - కొంచెం పౌరుషమైనా లేదేం? - వెళ్ళి చదవండి..."

ఛర్రున లేచి వెళ్ళాడు ప్రకాశం. తెల్లవారేసరికి రమ వొంట్లో తేలికపడ్డది. కాని, చాలా ముభావంగా, మౌనంగా ఆమె పనులు చేసుకుంటూన్నది.

ఆ రోజంతా ఆమె ప్రకాశం గదివైపు పోలేదు. సాయంత్రం కాఫీ తీసుకుని వెళ్ళింది. టేబిల్ మీద పెట్టి వెనుదిరుగబోతోంటే చెయ్యిపట్టుకొని ఆపి, "ఎందుకా పరుగు?" అన్నాడు.

"మీకు తెలుసు" అన్నది రమ.

"ఆఁ...అదే ఆలోచిస్తున్నాను. నిన్న రాత్రి నువ్వు అనిన మాటలన్నీ తెలిశా, తెలీకా అని..."

"అక్షరాలా తెలిసే అన్నాను...నీరసంగా ఉన్నా తల పనిచేస్తోనే ఉంది..."

"వెళ్ళు..."

రమ వచ్చేసింది.

* * *

నెల—పరీక్షలయిపోయాయి.

ఈ నెలా, రమ ప్రకాశంతో మాటలాడలేదు. ప్రకాశం రమతో మాటలాడలేదు. చదువుకోనీ—అనుకున్నది రమ. కానీ - అనుకున్నాడు ప్రకాశం.

పరీక్షలయిన రోజున ప్రకాశం చాలా ఉత్సాహంగా వొచ్చాడు.

"ఎలా రాశారు?" అన్నది రమ.

"చాలా బాగా రాశాను-" అని, వ్యంగ్యంగా, "అయినా, రిజల్ట్సు వొస్తేగాని, నీకు నమ్మకం కుదరదుగా!" అన్నాడు ప్రకాశం.

దెబ్బతిన్నట్లయి, "నే నలా అనను..." అన్నది రమ.

"నువ్వేమీ అనవులే!" అన్నాడు ప్రకాశం.

రాత్రిదాకా మళ్లా రమ ఆ ఛాయలకి పోలేదు. రాత్రి అతను మాటలాడలేదు.

* * *

"వాడు పేసయేడే!...

రంగారావు పేపరుపట్టుకుని వంటఇంటికి పరిగెత్తేడు—"ఏక్లాసు?" అందిరమ.

"ఫస్ట్!" అన్నాడు రంగారావు.

అంతా చాలాఉత్సాహంగా ఉన్నారు-రమతప్ప.

సాయంత్రం ప్రకాశం ఇంటికిరాగానే, "నీకోసం చూస్తున్నానురా! బాగా పేసయావు!" అన్నాడు రంగారావు మహదానందంతో.

"తెలిసింది"అన్నాడు ప్రకాశంపొడిగా.

తెల్లబోయాడు రంగారావు ఆ జోదా వినతకే...మరుక్షణం సర్దుకుని, "దీన్ని సాధించడానికైనా, కష్టపడాలిలే..." అన్నాడు

"తెలుసును" అని, ఊరుకున్నాడు ప్రకాశం.

* * *

"జన్మతరించిందిగా!"

కటువుగా అన్నాడు ప్రకాశం.

"ఫస్టుక్లాసు వొచ్చింది—ఇంక నీకు అనుమానం లేదు. ఎలాగో, నన్ను చదివించి, పేస్ చేయించావు"

రమ మాటలాడలేదు.

"అయితే, నాకు పౌరుషం ఉండనే అంటావు!"

....

"కొద్దిగా తెలివితేటలు కూడా..."

"నేను ఏమీ అనలేదు—"

"వొద్దులే—మరిచిపోకు. ఆనాడు మహా యిల్లాలు ఓడిపోయిన భర్తకి పసుపుముద్ద స్నానానికి పెట్టిందట...ఈనాడు—"

"మీ కాళ్లమీద పడతాను - దయఉంచి ఊరుకోండి..."

"ఛీ!...పౌరుషం గురించి ఉపన్యాసం ఇవ్వాలి కాని, అలాగ కాళ్లు బేరానికి వొస్తే ఎట్లా?"...అర్థ వ్యంగ్యంగానే అన్నాడు ప్రకాశం.

రమ మాట్లాడకుండా కూర్చుంది.

"పోనీ - ఒక్క నిజమైనా తెల్సింది... నన్ను ప్రేమించగలవని అనుకుంటూ ఉండే వాడిని...నువ్వూ, వీళ్ళందరితోనూ, నా లోపాలమీద వాలిపోడవగలవని తెల్సింది..."

"అదే మీరు గ్రహించినదీ, గ్రహించ గలిగినదీ..."

వాడిగా అన్నది రమ.

"అది నిజం—" అన్నాడు ప్రకాశం ఓర్చుకుంటూ.

"గొప్ప నిజం గ్రహించారు...ఎన్ని పరిస్థితులకి లొంగి అలా ప్రవర్తించానో ఒక్కసారి ఆలోచించారూ?"

"పైకి కనిపిస్తూనే ఉందిగా!"

"అదే మీకు కనిపించినది. నేను మిమ్మల్ని పొడుచేస్తూన్నానని మామగారి బాధ. నాకు తెల్సు - తెల్సు - మీరు తప్పక ఓేసాతారని. కాని - అలా ప్రవర్తించక తప్పక వచ్చింది. అన్నివిధాలా ప్రయత్నించాను. కాని, మిమ్మల్ని మార్చలేకపోయాను. చివరికలాగ చేశాను..."

"నువ్వనేది—"

"మీరు నమ్మలేకపోవొచ్చును...ఇంటికి వెళ్ళడానికి వీలులేదు - ఇటు మీరు.. మీ మనస్సు నొప్పించేందుకు అంత ఆలోచించాను. మీరు ఒక్క క్షణంలో అంతా నిశ్చయం చేసుకున్నారు"

"తప్పంతా నాదేనంటావు!"

"నేనలా ఏమీ అనలేదు - నిజం గ్రహించమంటున్నాను. నా పరిస్థితి కొంచెం మాషమంటున్నాను. మనం నిజంగా పంతాలు పట్టిఉంటే మీదే విజయం. కాని, భార్యాభర్తలు పంతం పట్టేంత సమానత్వం, అభిమానం లేకపోయాక, నేనేం చేసినా పొరబాటే!"

ప్రకాశం మాట్లాడకుండా కూర్చున్నాడు. కొద్ది నిముషాలు గడిచాక, "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నది రమ.

"నాన్నని గురించిలే ..నిన్నేమైనా అన్నారా?"

కొంచెం సందేహంగా అడిగాడు ప్రకాశం.

"ఏమీ అనలేదు—" అన్నది రమ.

"అదో అబద్ధంలే—ఆ విషయంలో నిస్సందేహంగా నేను పొరబడ్డాన్నే కథ ఇంతదాకా వొచ్చింది. ఆయనకి నువ్వంటే చాలా అభిమానం అనుకునేవాడిని" అన్నాడు ప్రకాశం.

"ఆ అభిప్రాయం ఇప్పుడు మారడానికి కారణం ఏమీ లేదు" తొందరగా అన్నది రమ.

"నాకు కల్లోంపషం తప్ప—"

"ఉంటే అసలు మార్చుకోకూడదు... ఆయనకి ఏదో ఉద్దేశం ఉంది మీ డిగ్రీ గురించి...కొంచెం మనసు గట్టి పరుచుకుని ఇలా ప్రవర్తించివుంటారు..."

"ఇదంతా నీమీదా, నామీదా అభిమానమే నంటావు!"

"ఆయన చేసినదంతా మనసులో ఉంచుకుని ఆలోచిస్తే అలాగే అనిపించదూ?"

ఆ విషయం ఇంక ఆలోచించకూడదు ...అనుకున్నాడు ప్రకాశం...ఆలోచిస్తూ ఊరుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది రమ మెల్లిగా.

"జరిగిన పరీక్షనిగురించి..." వాడిగా అన్నాడు అన్నాడు ప్రకాశం.

"ఏమిటని?" వింతగా అడిగింది రమ.

"గెలిచినది ఎవరని..."

ఇద్దరూ నిశ్శబ్దంలో పడ్డారు. ★

యోగాసనములు-దేహారోగ్యము

7. వజ్రోళి, భూసమాధి మొదలగు క్రియలు యోగాంగములు కావు

యోగాంగముల నభ్యసించువారు ఈ వ్యాసమందలి విషయములను ధారణచేసుకొని అభ్యాససమయమందు ఆచరణలో బెట్టి పరిశీలించినచో అనేక అపోహలు తొలగిపోగలవు. యోగాభ్యాసమువలన అపాయము కలుగుననియు, మనస్థిమితము చెడి వెర్రి పుట్టుననియు జరుగుచున్న ప్రచారాభాసమునకు సక్రమమైన ఆచరణమే తగు సమాధానమని నా విశ్వాసము. సాంఖ్య మతాదులను నిరసించినట్లే యోగమునుకూడా నిరసించుట జరిగినది. బ్రహ్మసూత్రములలో స్మృతి పాదములో "ఏతేన యోగః ప్రత్యుక్తః" అని చెప్పబడినది. వీరవైష్ణవులు శ్రీ వైష్ణవులు తమకు భక్తిప్రపత్తులే ప్రధానమనియు యోగాంగ సాధనలు నాథమునుల కాలమందే నామావశిష్టములైనవనియు చెప్పిరి. ఇప్పుడు మేము యోగులమని చెప్పుకొనుచూ యోగాంగసాధనలు కాని కొన్ని విశేషములను ప్రదర్శించి కృత్రిమ యోగమహిమను చాటువారినికూడ ఖండించి వారికి పాఠము చెప్పటవసరము.

సకల యోగశాస్త్ర దర్శనములు, ఉపనిషత్తులు, సంహితలు, యోగవాసిష్ఠాది గ్రంథములందును యోగాంగము లెనిమిది మాత్రమేనని స్పష్టముగా ప్రకటించుచున్నది. అవి "యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణా, ధ్యాన, సమాధులు."

ఇది యిట్లు స్పష్టముగా చెప్పబడినప్పటికినీ కొందరు వజ్రోళి, అమరోళి, సహజోళి మొదలగు క్రియలుగూడ యోగాంగములని భ్రమించి, ప్రచారము చేయుచున్నారు. ఈ క్రియలను అతి ప్రయాసమునకోర్చి అభ్యసించి, బహిరంగ సభలయందు అంతరంగిక సభలయందు ప్రదర్శించి తాము యోగసిద్ధులని ప్రచారము చేసుకొనుచున్నారు. ఇట్టి ప్రచారమువలననే యోగాంగములు హీనస్థితికి దిగజారినవి.

వజ్రోళి మొదలగు ప్రదర్శనములను చూసి చాలమంది ముగ్ధులై ప్రదర్శకులను దైవభావముతో ఆరాధించి యథోగతి పాలగుచున్నారు. వజ్రోళి మొదలగు క్రియలు యోగాంగములలో చేరినవి కావని పాతంజల దర్శనము రెండవపాదమునందు (29వ సూత్రము) గమనించినచో స్పష్టపడగలదు.

హఠయోగ ప్రదీపికలో వజ్రోళి మొదలగు క్రియలు చెప్పబడిన మాట నిజమే. కాని అందిట్లు చెప్పబడినది:

"మేదః శ్లేష్మాధికః పూర్వం షట్కర్మాణి సమాచరేత్ | అన్యస్తు నాచరేత్తాని దోషాణాం సమభావతః" (హఠయోగ ప్రదీపిక 2 వ ఉపదేశము 21 వ శ్లోకము)

అనగా - ఎవరు యమాది ఎనిమిది యోగాంగముల నభ్యసించి చిత్తస్థైర్యము నలవరచుకొని జీవాత్మ పరమాత్మల యొక్కయు, ప్రపంచము యొక్కయు ఆంతరంగిక తత్త్వములను తెలుసుకొని పరవైరాగ్యముతో, పరజ్ఞాన పరాభక్తులతో నిరంతరము దైవధ్యానముతో జీవనమును

టి. కృష్ణమాచారి

గడుపగోరుదురో, అట్టివారు ఉబ్బసము చెడకొవ్వు పెరుగుదల మొదలగువానివలన పీడితులైనచో, వారుమాత్రము వాని నివారణకుగాను షట్క్రియలను, అనగా "ధౌతి, బస్తి, నేతి, త్రాటిక, నౌలి, కపాలభాతి" యను క్రియల నాచరించవచ్చునని యర్థము. ఈ తత్త్వమును గ్రహింపనేరని యన్యులీక్రియల నాచరింపరాదు. అన్యు లాచరించినచో అపాయము గలుగునని స్పష్టపరచబడినది. అయినను అర్థౌచిత్యములను విడనాడి అద్భుత ప్రదర్శనలనుజూసి షట్క్రియలను పాశములకు కొందరు లోనగుట విషాదకరము. ఇట్టి భ్రమవలన వాస్తవములైన యోగాంగములు పాడగుచున్నవని చెప్పుటకు చింతించుచున్నాను.

ఇట్లే వజ్రోళి మొదలగు ముద్రలను "చక్కగ బ్రహ్మచర్యము నవలంబించువారే" యభ్యసించవలెనని హఠయోగ ప్రదీపిక విధించినది. బ్రహ్మచర్యము నవలంబించనివా రభ్యసించరాదని నిషేధించినది. వజ్రోళి మొదలగు క్రియలు కేవల ఐహిక భోగములను ప్రసాదించు కొన్ని అనిత్యమగు సిద్ధుల నిచ్చునే గాని మానసిక స్థైర్యము, ఆత్మజ్ఞానము, ఆయుర్వృద్ధి మొదలగు నిత్యమగుఫలముల నీయజాలవని స్పష్టపరచబడినది. చిత్తస్థైర్యము, దృఢారోగ్యము, ఆత్మతత్త్వజ్ఞానము, పరభక్తి, పరమశాంతులే యోగాభ్యాసము యొక్క లక్ష్యములని యోగదర్శనములలో విశదపరచబడినది.

"విచిత్ర కుంభకాభ్యాసాత్ విచిత్రాం సిద్ధిమాప్నుయాత్ | తత్సిద్ధయే విధానజ్ఞాః చిత్రాన్ కుర్వన్తి కుంభకాన్"

అనగా: యోగరహస్యము దెలిసినవారు వృద్ధులైనవారు ఇతరులకు యోగమందు విశ్వాసము గల్గించుటకై కొన్ని కొన్ని సిద్ధులను జూపుచూ, ప్రధాన లక్ష్యమును గోరువారికి నీచసిద్ధుల అనిత్యభావమును దెలిపి పిదప తత్త్వమును దెలుపుదురని యర్థము. కొందరు తొందరపాటువలన లభించిన యల్పసిద్ధులతోనే ముగ్ధులై పతితులగుచున్నారు.

"హానమేషాం క్లేశవదుక్తం - స్థాన్యుపనిమన్త్రణే సంగస్మయాకరణం పునరనిష్టప్రసంగాత్" అని పాతంజల యోగదర్శనమందు మూడవ విభూతియందు చెప్పబడినది.

అనగా: యోగాభ్యాస మహిమాబలము నొందిన మహాసిద్ధుల్ను దేవేంద్రాదులు వచ్చి సమస్త దైవికభోగముల ననుభవించవలసినదని ఆహ్వానించినప్పటికినీ, మనస్సును చలింపనీయక, గర్వము బొందక, నవ్యాకమానియై దైవధ్యానమే పరమలక్ష్యముగా వినమ్రులై యుండవలెనని యర్థము. అంతియగాని, "నా యోగాభ్యాస మహిమకు దేవతలుగూడ భయపడి నా యధీనులైనార"ని గర్వపడరాదని భగవత్పతంజలి స్పష్టపరచినారు.

కొంద రిటీవల "భూసమాధి" యను పేరుతో పెట్టిలోనో గుంటలోనో మూసివేయించుకొనియుండి యన్నాహార జలపాన మూత్రపురీషాదులను నిరోధించుకొని ప్రదర్శనముల నిచ్చి ప్రజలను విభ్రాంతులను జేయుచున్నారు. ప్రజ లిట్టిది ఆశ్చర్యకరమని అసాధ్యమైనదని, అది దైవశక్తి యని నమ్మి అట్టి సిద్ధులను పూజించి నష్టపడుచున్నారు. ఇందలి రహస్యమేమనగా-

"జన్మమన్త్రౌషధి తపస్సమాధిజాస్సిద్ధయః" అని పాతంజల దర్శనము నాల్గవ

విజ్ఞానవీధులు

"డాక్టర్"

176. మనలో లేని సుగుణాలు

మీరు ఎంతసేపూ పాశ్చాత్యులనే పొగుడుతూ మనకేవీ సుగుణాలే లేనట్లు రాస్తున్నారు. మనలో లేని సుగుణాలు కొంచెము విపులీకరించండి అన్నారు అజ్ఞాత పాఠకులు ఒకరు.

మనలో లేని మొదటి సుగుణము నిగ్రహము. ఏది వచ్చినా మొట్టమొదట తెలుగు వారిలో వస్తుంది. సత్యాగ్రహాలు, హరనాథ్ బాబా, సాయిబాబా, సత్సంగము, ఇత్యాదులెన్ని ఉద్యమాలో వచ్చాయి. కాని దీక్షపట్టి నిలుపుకున్నవారు వ్యక్తులే గాని సంఘాలు లేవు. నిలబెట్టలేని ఉద్యమాన్ని ఎందుకూ ప్రారంభించడమూ? అన్న ముందాలోచన కాని, ప్రారంభించినది మధ్యలో వదిలిపెట్టేయడమూ అన్న నిగ్రహము కాని మనకు తక్కువ. దివాలా తీసిన మన పారిశ్రామిక సంస్థలన్నీ ఇందు కుదాహరణాలే.

మనలో లేని రెండో సుగుణము అక్కర లేని జోక్యానికి పోకుండా ఉండడము. రైళ్లలో, బస్సులలో, ఇతర ప్రయాణాలలో, "మీదే వూరూ? ఏ వూరు వెళతారు? ఏం పనీ? మీకు జీతమెంతా? పిల్లలెందరూ?......ఇంకా ఎన్నో ఇలాంటి ప్రశ్నలు తండోపతండాలు. ఎందుకివన్నీ? ఎవరికి సాయపడనూ? ఏదో పత్రికో, పుస్తకమో చదువుకుంటే నయము కాదూ?

పత్రిక అంటే జ్ఞాపకము వచ్చింది: మనలో లేని మూడో సుగుణము కొనకుండా మరొకరిది ఉపయోగించుకోడానికి చూడడము. అరవములో ముప్పయికి తక్కువుండవు మంచి ప్రచారములోవున్న పత్రికలు. మనకో? ఆ వున్న పత్రికలేనా విలేఖరుల 'అమూల్య' వ్యాసాల్ని కోరేవే గాని, కాగితము, ఆలోచన, సిరా, కాఫీ, ఖర్చుపెట్టి రాసేవారికి ఎంతో కొంత ముట్టచెప్పేవి తక్కువ. ఆ యిచ్చే వాటిలో ఎన్నో రచయిత తీర్థయాత్రల సంఖ్యమీద ఆధారపడే పారితోషిక ప్రదాతలే. ఇక చదువరులు: రైలులో ఒక్కరు ఒక పత్రిక కొంటే, ఎంతో చనువుతో రెండో కాగితము తీసుకునేవారు ఎంతమందో? పత్రిక కొని, ఏ వండో ఫలమో కొనడానికి బండి దిగి మళ్ళీ వచ్చేసరికి ఆ పత్రిక మీ సీటు దగ్గరుండదు. ఒకమారు నేనన్నాను "నేను చదవడానికేనండీ కొనుక్కున్నదీ" అని. బస్. మరి తరువాత ఆ పెద్దమనిషికి నాతో మాటలు లేవు! కావలసినదానికి కర్చుపెట్టరు. కాదంటారా, 'అక్కర' లేనిదాన్ని అడగడము మానరు. తెలుగులో తప్ప తాను 'ప్రాంతంలోగల సాహిత్య పత్రిక లేదు. మాటలోనే తెలుగువారంతా సాహితీ పరులే.

మనలో లేని ముఖ్యమైన సుగుణము చేయవలసిన పనికి ముందుగా పథకాన్ని వేసుకోకపోవడము. మనకున్న తెలివి తేటలు కావన్ని ఉపయోగానికి రాకపోవడము ఇందువల్లనే. ఎవరికి తోచిన పనిని ఎప్పుడు వీలుంటే అప్పుడు చేస్తున్నారు. ఇందువల్ల సమూహబలముచేత సాధించగల పని లేవీ జరగడము లేదు. నవ్య సాహిత్య సభలూ, నాట్యకళా సభలూ ఎన్నైనా జరిగాయి తెలుగునాట. ఏ సభకైనా కొన్ని రోజులకు ముందు ఉపన్యాసాలూ, ప్రసంగాలూ ఫలానా అని ఒక పథకము వేసుకున్నది లేదు. అంతా ఆశువన్నమాటే. కవనకనే కావ్యపఠనాలూ ఉపన్యాసాలూను. ఈ ఉపన్యాసాలకు మాట్లాడేవారు ఏమి చెప్పడమో ఒకరోజు ముందుగానైనా అనుకోరు. అధ్యక్షులవారు ఉపోద్ఘాతవాక్యాలు చెప్పుతూన్న రెండు నిమిషాలలోనూ తిప్పుతారు చదువుకుని వచ్చిన వారి నోట్సుని. ఇంకా ఆత్మగౌరవము కలవారు ఏమీ చూడకుండానే కొట్టేస్తారు ఉపన్యాసం.

మనకి లేని గొప్ప సుగుణం ఇంకొకరి గుణాల్ని మెచ్చుకోడము. సన్మానాలలో సన్మానిత వ్యక్తిని మధ్యపెట్టుకొని వీరి సొంతడబ్బా వీరూ వారి సొంతడబ్బా వారూ కొట్టుకుంటారు. ఉపన్యాసాలు వినేవారికోసమే గాని చెప్పేవారికోసము కాదని మనలో ఎందరో ఎరగరు. ఒక 'విమర్శకుడు' ఇంకొక విమర్శకుణ్ణి గురించి అంటాడు: "ఆయన వస్తువుని కాలంకమంగా శోధిస్తాడు, నిర్మొగమాటి" అని అంతవరకే. అభిప్రాయాలు మట్టుకు ఈయనవే గొప్పవి......అనుకరణము ముఖ్యప్రతి సాధనాలన్నిటా పెద్దదంటారు. మనవారు అనుకరణాల్ని చూసి అసలుని దించేయడానికి చూస్తారు. వీరు పాటూరు సర్కసు పెడితే వారు పాటూరు సర్కసూ, వీరు నవల రాస్తే వారు నవల, వీరు పత్రిక పెడితే వారు పత్రికా. యాతావాతా వీరూ వారూ కూడా 'నాతోసి' అయిపోతారు.

విమర్శించడము అందరి చేతా నవును. చెయ్యవలసినది కొంత చెప్పుతుంటారు పాఠకులు. నేనంటాను, చెయ్యవలసిన కర్తవ్యమును చెప్పేవారు చాలామంది ఉన్నారు చేసేవారే లేరని. ఉంటే చెప్పేదేమిటంటారా? ఒకరిజోలికి పోక నీకు తోచినది మంచిదనిని చక్కగా ప్లాను వేసుకుని నిర్వర్తించమని.

నాడముందు చెప్పబడినది. అనగా ఇది కొన్ని మాదకవస్తువులతో చేరిన మూటికా ప్రయోగమే గాని సత్యమగు యోగము కాదని యర్థము.

మరికొందరు విషము మ్రింగియు, గాజు ముక్కలను మ్రింగియు యోగులని చెప్పుకొనుచున్నారు. ఇది తాంత్రికములే గాని యోగము కాదని శాస్త్రములను జూచిన వారికి తెలియగలదు. ఇంతకంటె విచిత్రసిద్ధులు పొందిన విశ్వామిత్రాదుల గతి ఏమాయెను? క్షుద్రసిద్ధులను కోరుకొనక పరమాత్మని భజించిన వసిష్ఠ, అగస్త్యాది యోగివర్యుల మహిమ యెట్టిది? ఈ యంశమును పురాణములను చరిత్రను పరిశీలించినవారు గ్రహింపగలరు.

కొందరు జలస్తంభనము (జలసమాధి) మొదలగు ప్రదర్శనములనిచ్చి పామరులను భ్రమింపజేసి వాస్తవమైన యోగమర్మములను హీనస్థితికి దెచ్చుచూ, ప్రజలకేగాక తమంత తమకే యపాయము తెచ్చుకొనుచున్నారని చెప్పుటకు చింతించుచున్నాను. ఇట్టి క్షుద్రసిద్ధులవలన సత్యమగు యోగసాధనలు కాని నిర్మూలితములు నగుచున్నవి.

దురదృష్టములో [illegible] కొందరు వేదాంతులు "వితేసరోగః ప్రత్యక్తః" అను బ్రహ్మసూత్రమందలి విరళ సాధారము జేసుకొని రోగములను గురించి దుష్ప్రచారము చేయుచున్నారు. అట్టి విజ్ఞులుచో అత్యంతికముగా సంధ్యావందన వేదాధ్యయనములనుగూడ నొక మూలకు నడవుకి అప్పుడు వేదాంతులమని చెప్పుకొనుట శ్రేయము. వాస్తవమున కా బ్రహ్మసూత్రమందు నిరసింపబడినది క్షుద్ర యోగమేగాని భక్తిసాధకమైన అష్టాంగ యోగము కాదని పాఠకులు గ్రహింపగలరు.

(ఇంకా వుంది)

చిట్టిప్రశ్నలకు జవాబులు

—స్త్రీ, పురుష జాతులు పరిణామము వల్ల ఏర్పడ్డాయి. వానపాములలో రెండుగా తెగిపోవడమువల్ల జాత్యభివృద్ధి జరుగుతుంది. మొక్కలలో దుంపనుండి కొత్త మొక్కలు పుట్టడమూ, ఫెర్ను జాతి మొక్కలలో ఆకు వెనకఉండే రజమువల్ల కొత్త మొక్కలు పుట్టడమూ, పత్రజీవిలో ఆకు అంచుల ఇరుకులలోనుంచి కొత్త మొక్కలు పుట్టడమూ చూడలేదా మీరు? కాబట్టి, స్త్రీ,- పుం,-లింగభేదాలు పరిణామానికి చివరి ఫలితాలు.

—విషసర్పము కాటు వేస్తే స్పృహ తప్పదు. భయోత్పాతమువల్లనే స్పృహ తప్పేది.

—పాము కాటుకు మందు యాంటీవెనీను. మీ జిల్లా హెల్తు ఆఫీసరుగారికి రాస్తే ఆయన వివరాలు చెప్తారు.

—చంద్రునిలోని మచ్చలు కొండలూ లోయలూను. ఆ కొండల నీడలు కూడా దూరదర్శినివల్ల చూచారు.

—ఎముకలకు కూడ నెత్తురు సరఫరా కలదు. దానివల్లనే అవి ఎదగగలుగుతున్నాయి.

—మశూచి ఒకసారి వచ్చినవారికి మళ్లీ రాదన్నది అక్షరాలా సత్యము కాదు. రెండోసారి బాధపడ్డవారున్నారు. ఒకమారు ఆ వ్యాధివల్ల బాధపడి నిరోధించిన వారికి నిరోధశక్తి వృద్ధఅవుతుంది. అది చాలా సంవత్సరాలుంటుంది. మశూచికము పడిన వారికి టీకాలు వేస్తే పొక్కకపోవడమిందువల్లనే.

—పాల విరుగు సహించితే తినవచ్చును. దానిలో దోషము లేదు. అయితే విషపదార్థాలు కలిసి విరిగినపాలలో విషము ఉంటుందికదా? ఎందువల్ల విరిగినదో నిశ్చయం తెలిస్తేనేగాని తినరాదు.

—"వేడి చేయడమంటే ఇది" అని చెప్పడము కష్టము. కారణము అన్నిటికీ 'వేడి' చెయ్యడమన్న పేరు పెట్టేయడమే. కళ్లు రవరవలాడడమూ, మూత్రము పసుపు పచ్చగా రావడమూ, ఇత్యాదులెన్నో 'వేడి చేసింది' అన్న పేరుతో చలామణీ అయిపోతున్నాయి. వేడి చెయ్యడమన్నది, 'ఒంట్లో బాగుండలేదు'లాగే బహు విశాలము.

శరీరములోని జీవకణాలు పరిశ్రమవల్ల ఖర్చు ఎక్కువైపోయి, మళ్ళీ భర్తీ కావడానికి ముందు స్థితిని "వేడి చెయ్యడము" అని చెప్పవచ్చుననుకుంటాను వీరభద్రయ్యగారూ. వేడికి చెప్పబడ్డ చికిత్సలన్నీ ఆయా భాగాల తక్షణ శాంతికేగాని మొత్తపు పరిస్థితికి మందులు కావేమో గమనించండి.

—పసుపూ, కుంకమూ, కాటుకా, ఇలాంటివన్నీ ప్రాచీనుల అందపు సామగ్రి. మందులు కావు. అయితే దరిమిలా వీటిలో మందుగుణముగల పదార్థాలు చేర్చడము నేర్చారు. ముఖ్యంగా కాటుకలో. కాటుకను యునాని, ఆయుర్వేద పద్ధతులు గుర్తించాయి. అల్లోపతీ అవసరానికి తగిన చుక్కల్ని వాడతారు. అయింటుమెంటు(ముద్ద)ను వాడడముకూడా కద్దు.

—గోరింటాకు చర్మమునకు ఎరుపు వర్ణము అలవర్చడము చర్మముమీద రాసాయనిక క్రియవల్ల. ఎక్కడి చర్మానికేనా ఎరుపు తెస్తుంది గాని అందంగా కనపడే అరచేతులకూ కాళ్లకూ మాత్రమే పెట్టుకోడము మామూలు.


—హిస్టీరియా అంటే మనస్సులోని ఇష్టానిష్టాలవల్ల శరీరములో ఆ ఫలితాలు రావడము. ఒక గుర్రము కాలికి కట్టు కట్టి విప్పి చూచీ మళ్ళీ కట్టే చేస్తే నాలుగు రోజులకా గుర్రము కుంటేందట! ఇది హిస్టీరియా. సైనికుడికి ఒకడికి ముందుకి పోవడము ఇష్టము లేదట. అతని అయిష్టము అతిగా ఉండడమువల్ల కాలికి వ్యాధి వచ్చిందట. ఇది హిస్టీరియా. అలాగే చచ్చిపోయినవారు దయ్యాలై బాధిస్తారేమో అన్న భయమే హిస్టీరియా అయి దయ్యాల్ని తయారుచేసి చూపిస్తుంది.

—మానవునికి వెన్నెముక లంబముగానూ చేతులూ కాళ్లూ భిన్నరూపాలలోనూ ఎందుకున్నాయంటారా? చింపంజీ, కోతీ, మానవుడూ అన్న నేటి రూపాలకు ఆది అయిన జీవి కాళ్లనే నడకకి ఎక్కువగా ఉపయోగిస్తూ చేతులను 'పని' చెయ్యడానికి ఉపయోగించడమువల్ల. మార్పులు ఒక జీవియొక్క అలవాటునిబట్టీ, ఆ అలవాటు ఆ జీవికి ఇవ్వగల రక్షణనిబట్టీ వస్తాయి. జిరాఫీకి చెట్ల ఆకులు మంచి ఆహారమూ; కనక ఆ ఆకుల్ని తినే యత్నంలో మెడ చాచడమువల్ల దాని మెడ పొడుగైంది. ఇలాగే తక్కిన మార్పులూను. ఒక అలవాటు బ్రతుకుతెరువుకి సాయముచేస్తే అది కాలక్రమాన్న ఆ జీవికి సంక్రమిస్తుంది. బ్రతుకు తెరువుకి సహాయభూతాలు కాని అంగములు మారిపోతాయి. పెంగ్విను రెక్కలు ఈదడానికే గాని ఎగరడానికి సాయపడవు ఏదుపంది రోమాలు ముళ్ళైనాయి. సింహము మైదానాల ఇసుకా మట్టి రంగులోనూ, పు, లి పొదలలోని 'రంగు—నీడా' రంగులోనూ తయారయాయి. ఇలాగే తక్కినవీని. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



అంధభిక్షువు


సౌభాగ్యానికి పయనం
పొడువైన పెద్ద రైలుబండి, దుముకుచూ, బుస గొట్టుతూ, కిరమంటూ వచ్చి ఆగును. పల్లెవాండ్లు, ఉద్రేకంతో ఆతురతతో, ఆశతో దాని చుట్టూ మూగెదరు. ఆ పల్లె జీవితంలో అది ఒక చారిత్రాత్మకమైన విషయం. ఎందుకన, ఆ పల్లెలో పండిన పంటలు, వారి కష్టాల ఫలితము, ఆ రైలు బండిలో పట్టణానికి పోవును.
రాబోవు సంవత్సరాలలో, మన పల్లెలలో పండిన పంటలను వేలకొలది మైళ్లు రైళ్లలోను, రోడ్ల మీదను, పట్టణాలకు తీసికొని పోగలరు. పంచవర్ష ప్రణాళికలో 3,000 మైళ్ల రైలుమార్గం వేయబడును. చక్కని రాకపోకల మార్గాలకు పునాది వేయుటకై 770 మైళ్లు నూతన కాంక్రీటు రోడ్లు, 66 పెద్ద వంతెనలు కట్టెదరు. ఇట్లు మన ప్రజలు వ్యాపారంలోను, ఆర్థికంగాను, నాగరికతలోను, అనేకవిధములుగా భాగ్యతరమైన మరియు పరిపూర్ణ జీవితమునుభవించుటకై తమ అభ్యుదయ ప్రయాణమును సాగింతురు.
ఎన్నో వేల టన్నుల ఉక్కు ఈ ప్రణాళికనందలి వివిధ కార్యక్రమములను అమలుపరచుట కవసరము. ఇటులనే పలువిధములుగా ఉక్కు మనదేశము, ప్రజల భావిసౌభాగ్యం, ఐశ్వర్యములకు పునాది వేయుచున్నది.
ది టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ లిమిటెడ్